

సురవరం సుధాకరరెడ్డి
వ్యాసాలు – లేఖలు
రూ॥200/- పేజీలు:290
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



బ్రిక్స్, యుఎన్ సమావేశాలకు.. మోదీ డుమ్మాకు కారణమేమిటి? షాంఘై నిర్ణయాలు భవిష్యత్తుకు దిక్సూచిగా ఉండాలి 06

కర్నాటకలో మళ్లీ కుల గణన సిఎం సిద్ధరామయ్య 05



సంపుటి 08, సంచిక: 283 | శనివారం | 13-09-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## ‘ఓటు చోరీ’యే ప్రధాన సమస్య

ప్రధాని మణిపూర్ పర్యటన పెద్ద విషయం కాదు

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ

**జునాగఢ్ (గుజరాత్):** మణిపూర్ చాలాకాలంగా ఇబ్బందుల్లో ఉందని, అయినా జాతి ఘర్షణలతో నిండిన రాష్ట్రాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సందర్శించడం ఇప్పుడు ‘పెద్ద విషయం’ కాదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. ‘ఓటు చోరీ’ (ఓటు దొంగతనం) ప్రస్తుతం దేశం ముందున్న ప్రధాన సమస్యగా ఆయన నొక్కి చెప్పారు. గుజరాత్‌లోని జునాగఢ్ జిల్లా కేశోడ్ విమానాశ్రయం వెలుపల రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ ప్రతిచోటా ప్రజలు

తరువాయి 12లో



## దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలు

- ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలి
- అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలి
- గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాలను సందర్శించాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఇందు కోసం మహా కుంభమేళాతో పాటు గతంలో వివిధ రాష్ట్రాల్లో పుష్కరాలు, ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల రూపకల్పనలో అనుభవమున్న కన్సల్‌టెన్సీలను నియమించుకోవాలని సూచించారు. గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాలను సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి డిజైన్లు రూపొందించాలన్నారు. గోదావరి పుష్కరాల సన్నద్ధత, ముందస్తు ప్రణాళికలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కొండా సురేఖ, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని సిఎం ఆదేశించారు. అదే క్రమంలో పుష్కరాల ఏర్పాట్లు, రానున్న భక్తుల రద్దీని అంచనా వేసుకుని మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు.పుష్కరాల ఏర్పాట్లకు కేంద్రం ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్‌తో పాటు అందుబాటులో ఉన్న

తరువాయి 2లో



## నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి

ప్రమాణం చేయించిన దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్

ప్రధాన రాజకీయ పార్టీలు, ‘జెన్ జెడ్’ ఉద్యమకారుల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం

**ఖాట్మండు :** నేపాల్ ప్రధానమంత్రి కెపి శర్మ రాజీనామాతో ఏర్పడిన రాజకీయ అనిశ్చితికి తెరపడింది. పార్లమెంటును దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ రద్దు చేశారు. తాత్కాలిక ప్రభుత్వ సారథిగా మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి ప్రమాణం చేశారు. పౌడెల్ ఆమెతో ప్రమాణం చేయించారు. నేపాల్ మాజీ ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించి రికార్డు సృష్టించిన

తరువాయి 12లో



## ఢిల్లీ, ముంబై హైకోర్టులకు బాంబు బెదిరింపు

**న్యూఢిల్లీ :** దేశంలో గత కొన్ని నెలలుగా బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. విమానాశ్రయాలు, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, కోర్టులు ఇలా బాంబు బెదిరింపులు నానాటికీ పెరిగిపోతున్నాయి. తాజాగా దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై హైకోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం ఉదయం ఢిల్లీ హైకోర్టులో బాంబులు పెట్టినట్లు ఈమెయిల్ వచ్చినట్టు పోలీసులు తెలిపారు. కోర్టు ప్రాంగణంలో మూడు బాంబులను అమర్చామని, మరికాసేపట్లో అవి పేలుతాయంటూ అందులో బెదిరించారు. మధ్యాహ్నం రెండు గంటల్లోపు ఖాళీ

తరువాయి 12లో


# భూమికి భూమి ఇవ్వాల్సిందే

- ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతుల పోరాటానికి అండగా ఉంటాం
- చౌటుప్పల్ ఆర్‌డిఒ కార్యాలయం ముందు అఖిలపక్షం ధర్నా
- రైతుల ఆవేదనకు ప్రభుత్వ తీరే కారణం
- సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి

ప్రజాపక్షం/చౌటుప్పల్

ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతుల పోరాటానికి తమ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, రైతులకు భూమికి భూమి ఇవ్వాల్సిందేనని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. అభివృద్ధికి సిపిఐ వ్యతిరేకం కాదని, ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు మాత్రమే వ్యతిరేకం అని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ముందు అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ట్రిపుల్ ఆర్ భూ బాధితుల ధర్నా కార్యక్రమానికి మద్దతుగా సిపిఐ జాతీయ నాయకులు పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చౌటుప్పల్, నారాయణపురం మండలాల ట్రిపుల్ ఆర్ భూ బాధితుల ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి

తరువాయి 2లో






## భారత 15వ ఉపరాష్ట్రపతిగా సి.పి.రాధాకృష్ణన్ ప్రమాణం

- రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ :** భారత నూతన 15వ ఉప రాష్ట్రపతిగా చంద్రపురం పొన్నుసామి (సి.పి)రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక సంక్షిప్త వేడుకలో 67 ఏళ్ల వయసున్న రాధాకృష్ణన్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. ఎర్రరంగు కుర్తా ధరించిన రాధాకృష్ణన్ దేవుడి పేరిట ఇంగ్లీషులో ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు అభినందనలు తెలియజేశారు. రాధాకృష్ణన్ మంగళవారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో గెలుపొందారు. ఎన్‌డిఏ అభ్యర్థి

తరువాయి 12లో



## 15 నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం

**న్యూఢిల్లీ :** దేశంలో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాముఖ్యంగా భావించే నైరుతి రుతుపవనాల తిరోగమనం ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఐఎండి శుక్రవారం వెల్లడించింది. సాధారణంగా జూన్ 1న నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశిస్తాయి. మొదట కేరళలోకి ప్రవేశించిన ఈ రుతుపవనాలు జులై 8 నాటికి దేశమంతటా విస్తరించి వర్షాలు అందిస్తాయి. తిరిగి సెప్టెంబర్ 17 నాటికి వాయువ్య దిశగా తిరోగమనిస్తూ అక్టోబర్ 15 నాటికి పూర్తిగా నిష్క్రమిస్తాయి. కానీ ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సెప్టెంబర్ 15 నుంచే తిరోగమనానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని

తరువాయి 12లో

## 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్

- ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల హెచ్చరిక
- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ తెలంగాణలో ఈ నెల 15 నుంచి ప్రైవేట్ కాలేజీలు నిరవధికంగా బంద్ పాటించాలని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం శుక్రవారం ప్రకటించింది.రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని విద్యార్థులు, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు, మరోవైపు పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, తెలంగాణ ప్రభుత్వం రూ.10 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ పెట్టిందని, వెంటనే చెల్లించకపోతే ఈ నెల 15వ తేదీ నుంచి కాలేజీలు నిరవధికంగా బంద్ చేయనున్నట్లు ప్రైవేటు కాలేజీల యాజమాన్యం హెచ్చరించాయి. ఈ మేరకు తాజాగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను

తరువాయి 2లో

# వేలంలో ‘సింగరేణి’ పాల్గొనాలి

- కొత్త బ్లాక్‌లు సాధించాలి
- కార్మికుల భవిష్యత్తు, సంస్థ మనుగడ కోసం నిర్ణయం తీసుకున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- గతంలో భ్రమలు, అపోహలు, భావోద్వేగాల వల్ల వేలంలో పాల్గొనకుండా చేశారని మండిపాటు
- మీడియా సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



ప్రజాపక్షం/హైదరాబాద్

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న వేలాదిమంది కార్మికుల భవిష్యత్తు, సంస్థ మనుగడను, రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇకపై కేంద్ర బొగ్గు శాఖ నిర్వహించే బొగ్గు గనుల వేలంపాటలో సింగరేణి సంస్థ పాల్గొనాలని, కొత్త బ్లాక్‌లు సాధించాలని నిర్ణయించినట్లు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గతంలో సింగరేణి ప్రాంతంలోని బొగ్గు బ్లాకులు మొత్తం సింగరేణికి సొంతమై ఉండేవని, కానీ సుప్రీంకోర్టు తీర్పు అనంతరం కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని బొగ్గు బ్లాకులను వేలంపాట విధానం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు కేటాయించడం ప్రారంభించిందని, అయితే పలు రకాల భ్రమలు, అపోహలు, భావోద్వేగాల కారణంగా సింగరేణిని ఈ వేలంపాటలో పాల్గొనకుండా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ వేలంపాటలో పాల్గొనకుండా ఉన్నందువల్ల సింగరేణి గనుల పక్కనే ఉన్న రెండు పెద్ద బ్లాకులు సత్తుపల్లి, కోయగూడెం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయని, తద్వారా సింగరేణికి రూ.60 వేల కోట్ల రెవెన్యూను, రూ.15 వేల కోట్ల లాభాలను కోల్పోయిందని, ఇది ఘోర తప్పిదమని ఆయన విమర్శించారు. వేలంలో సింగరేణి పాల్గొనకపోతే అది ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చుతుందని చెప్పారు. వేలంలో ప్రైవేట్ వ్యక్తులకు బ్లాక్‌లు దక్కినా రాష్ట్రానికి రాయల్టీ వస్తుందని,

తరువాయి 2లో



యాజమాన్యం మొండివైఖరి, కాలయాపన వల్లే సింగరేణి స్ట్రక్చర్ సమావేశం బహిష్కరణ

03

## సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శిగా బినోయ్ విశ్వం తిరిగి ఎన్నిక



అలప్పుజ: సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శిగా మాజీమంత్రి బినోయ్ విశ్వం ఎన్నికయ్యారు. అలప్పుజలో జరిగిన సిపిఐ రాష్ట్ర మహాసభల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిసెంబరు 2023 లో రాష్ట్ర కార్యదర్శి కానం రాజేంద్రన్ మరణించడంతో విశ్వం తొలిసారి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన సిపిఐ జాతీయ

తరువాయి 2లో




చలో చండీఘడ్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)

25వ కాంగ్రెస్

21–25 సెప్టెంబర్, 2025


చండీఘడ్ (పంజాబ్)

దేశంలో కొత్త పరిస్థితుల్లో 8వ మహసభ – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## యుకె-ఇండియా ఉచిత వాణిజ్య ఒప్పందంపై విచారణ ప్రారంభం



**లండన్:** యుకె–ఇండియా ఉచిత వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) ప్రభావాలు, దాని సూచనలపై బ్రిటన్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్స్ ఇంటర్నేషనల్ అగ్రిమెంట్స్ కమిటీ విచారణను ప్రారంభించింది. ఈ ఒప్పందం ఈ ఏడాది జులైలో భారత ప్రధాని నరేంద్ర మోదీ బ్రిటన్‌ను సందర్శించినప్పుడు జరిగింది. దీని ప్రభావంపై ఏర్పాటు చేసిన అఖిల పక్ష కమిటీలో బ్రిటిష్ ఇండియన్ కన్సర్వేటివ్ పీర్ బ్యారోనెస్ శాండీ వర్మ కూడా ఉన్నారు. పార్లమెంటరీ ప్రక్రియలో భాగంగా నిపుణులు, సంబంధిత వర్గాల నుండి ఆధారాలు, అభిప్రాయాలు సేకరించేందుకు ఈ కమిటీ ప్రయత్నిస్తోంది. వీటి ఆధారంగా సమగ్ర ఆర్థిక మరియు వాణిజ్య ఒప్పందం (సిఇటిఎ) అమలులోకి రావచ్చు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 120 బిలియన్ అమెరికన్ డాలర్లకు రెట్టింపు చేయాలనే లక్ష్యంతో రూపొందిన ఈ సిఇటిఎ ను, ప్రధాన మంత్రి కియర్ స్టార్మర్ నేతృత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక ఒప్పందంగా వర్ణించింది.



## సైనిక రాజ్యం ఏర్పాటుకు కుట్ర!
### నేపాల్ పరిస్థితులపై బిఎన్‌ఎ అనుమానం

**ఖాట్మండు:** నేపాల్‌లో కెపి శర్మ ఓలి ప్రభుత్వం పతనం అనంతరం అధికారాన్ని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా హస్తగతం చేసుకునేందుకు సైనికుల మధ్యవర్తిత్వంలో కుట్ర జరుగుతోందని వివిధ వర్గాల ప్రజలను ప్రాతినిధ్యం వహిస్తున్న బృహత్ నగరిక్ ఆందోళన్ (బిఎన్‌ఎ) ఆరోపించింది. దేశవ్యాప్తంగా భద్రతా బాధ్యతలు చేపట్టిన నేపాల్ సైన్యం జాతీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్న వైనంపై ఆందోళన వ్యక్తం చేసింది.

'జెన్ జెడ్' ఉద్యమం లో ప్రాణత్యాగం చేసిన అమరుల శరీరాలపై, రాజ్యాన్ని పునరుద్ధరించడానికి, లౌకికత్వం, సమాఖ్యవ్యవస్థ, నిష్పాక్షిక అంతర్భావిత ప్రతినిధిత్వాన్ని రద్దు చేయడానికి ఒక వర్గం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని, ఇందుకు సంబంధించిన వ్యూహం, కుట్ర సైనికుల మధ్యవర్తిత్వంలో కొనసాగుతున్నదని ఆ సంస్థ ఆరోపించింది.

'మై రిపబ్లికా' పోర్టల్‌ను అనుసరించి అటువంటి ప్రయత్నాలు పూర్తిగా అంగీకార యోగ్యం కావు అని బిఎన్‌ఎ స్పష్టం చేసిం ది. ప్రభుత్వం వ్యతిరేక ఉద్యమం ఎప్పు దూ గణతంత్రం, లౌకికత్వాన్ని రద్దు చేయడానికిగానీ లేదా సైనిక వ్యవస్థ జోక్యాన్ని కోరడానికిగానీ విస్తరించలేదని స్పష్టం చేసింది.

నేపాల్ 2008లో రాజ్యాన్ని రద్దు చేసింది. అయితే ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ అస్థిరతల నడు మ ఈ సంవత్సరం రాజ్య పునరుద్ధరణకు మద్దతు తెలిపే నిరసనలు మళ్లీ తలెత్తాయి. ఏదైనా కొత్త పౌర ప్రభుత్వం రాజ్యాంగానికి పునాదిగా ఉండాలని, అవినీతి, అక్రమతలకు ప్రతిఘటించడంలో కట్టుబడి ఉండాలని, దానిలో ప్రతివిప్లవ శక్తులకు చోటు ఉండకూడదు అని ఆ సంస్థ తెలిపింది.

## తైవాన్ జలసంధిలో చైనా విమాన వాహక నౌక

**బీజింగ్:** చైనాకు చెందిన తాజా విమాన వాహక నౌక ఒకటి తైవాన్ జలసంధిలో ప్రయాణించింది. ఈ విషయాన్ని చైనా నౌకాదళం శుక్రవారం ప్రకటించింది. ఈ జలప్రాంతం చైనా ను తైవాన్ నుంచి వేరు చేస్తుంది. తైవాన్‌లో స్వతంత్ర ప్రభు త్వ పాలన కొనసాగుతున్నది. అయితే, ఈ ప్రాంతం తమ ఆధీనంలోకి రావాలని బీజింగ్ వాదిస్తున్నది. కాగా, విమాన వాహన నౌక ఈ జలసంధిలో ప్రయాణించడం అమెరికాతోపాటు, తైవాన్‌కు మద్దతునిస్తున్న ఇతర దేశాలకు కూడా హెచ్చరికగా భావించవచ్చని విశ్లేషకులు పేర్కొంటుండగా, చైనా మాత్రం అటువంటి ఉద్దేశం ఏదీ లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం సముద్ర పరీక్షల్లో ఉన్న ఫుజియన్ అనే విమాన వాహక నౌక, తన అధికారిక ప్రవేశానికి ముందు దక్షిణ చైనా సముద్రానికి శిక్షణ, శాస్త్రీయ ప్రయోగాల కోసం వెళ్తోందని నౌకాదళం సోషల్ మీడియాలో ఇచ్చిన సంక్షిప్త ప్రకటన తెలిపింది. ఈ వాహక నౌక కార్యకలాపాలు ఎవరి మీదా లక్ష్యంగా లేవని నౌకాదళం స్పష్టం చేసింది. దక్షిణ చైనా సముద్రానికి చేరడానికి తైవాన్ జలసంధి అనేది సాధారణ, అత్యంత సమర్థవంతమైన మార్గమని పేర్కొంది.

## 'జెన్ జెడ్' నిరసనల్లో 51 మంది మృతి

### మరణించిన వారిలో ఓ భారతీయుడు
### నేపాల్ అధికారుల ప్రకటన



**ఖాట్మండు:** సోషల్ మీడియా సైట్ల నిషేధం, పెచ్చరిల్లుతున్న అవినీతిపై నేపాల్ అంతటా ఉధృతంగా కొనసాగిన 'జెన్ జెడ్' (జెన్ జి) నిరసనల్లో కనీసం 51 మంది మృతి చెందారని, మరణించిన వారిలో ఒక భారత పౌరుడు కూడా ఉన్నాడని అధికారులు శుక్రవారం ప్రకటించారు. కాగా, ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉందని మీడియా వార్తల ద్వారా తెలుస్తున్నది. నేపాల్ పోలీసుల సంయుక్త ప్రతినిధి, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రమేష్ థాపాను ఉటంకిస్తూ 'ఖాట్మండు పోస్ట్' పత్రిక వెల్లడించిన వివరాల ప్రకారం మహారాజ్‌గంజ్‌లోని త్రిభువన్ యూనివర్సిటీ టీచింగ్ హాస్పిటల్‌లో శుక్రవారం నుంచి శవపరీక్షలు ప్రారంభమయ్యాయి. అక్కడ కనీసం 36 మృతదేహాలు ఉన్నాయి. గురు, శుక్రవారాల్లో దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి మరో 17 మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, శుక్రవారం మధ్యాహ్నం పశుపతినాథ ఆలయ సమీపంలోని బాగ్మతీ నది తీరంలో ఆర్య ఘాట్ వద్ద పలు మృతదేహాలను దహనం చేసినట్లు సమాచారం. మొత్తం మీద ఈ నిరసనల్లో సుమారు 1,700 మంది గాయపడ్డారు. వారిలో దాదాపు 1,000 మంది చికిత్స అనంతరం ఇంటికి తిరిగి వెళ్లారని పోలీసులు తెలిపారు. ఖాట్మండు లోయలో పోలీసు కార్యకలాపాలు క్రమంగా మెరుగుపడుతున్నాయి. నేపాల్ పోలీసు శాఖ ఖాట్మండు లోయలో కార్యకలాపాలను క్రమంగా పునరుద్ధరించుకుంటోందని, ఈ వారం ప్రారంభంలో జరిగిన హింసాత్మక ప్రభుత్వం వ్యతిరేక నిరసనల్లో ధ్వంసమైన లేదా తగలబెట్టిన పోలీస్ స్టేషన్లు, అవుట్‌పోస్టులు మళ్లీ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయని అధికారులు శుక్రవారం తెలిపారు. విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన అల్లర్లలో దెబ్బతిన్న స్టేషన్లు, బీట్లు, యూనిట్లు మళ్లీ తెరుచుకుంటున్నాయి. నేపాల్ పోలీస్, ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ సిబ్బంది మళ్లీ వీధులపై, లోయలోని పోలీస్ పోస్టుల చుట్టూ కనిపిస్తున్నారని ఖాట్మండు వ్యాలీ పోలీస్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. లోయ అంతటా డజన్ల కొద్దీ పోలీస్ స్టేషన్లు ధ్వంసం అయ్యాయని, కానీ ఖచ్చితమైన సంఖ్య ఇంకా నిర్ధారణ కాలేదని అధికారులు చెప్పారు. ఖచ్చితమైన డేటా ఇంకా అందుబాటులో లేదు అని రాణిపోఖరి వద్ద ఉన్న ఖాట్మండు వ్యాలీ పోలీస్ ఆఫీస్ ప్రతినిధి ఎస్‌ఎస్‌పి శేఖర్ ఖనాల్ మైరిపబ్లికా వార్తా పోర్టల్‌కు తెలిపారు. పోలీసు సిబ్బంది తాము ఉన్న సౌకర్యాలతోనే తిరిగి తమ పోస్టుల వద్దకు చేరుకుని విధులు చేపడుతున్నారని ఆయన వివరించారు. లోయలోని పలు ప్రాంతాలలో ధ్వంసమైన పోలీస్ స్టేషన్ల పునర్నిర్మాణానికి స్థానికులు కూడా సహకరిస్తున్నారని, మరమ్మతులు, శుభ్రపరిచే పనులకు ప్రజలు సహా యం చేయాలని సమాజ నాయకులు కూడా పిలుపునిచ్చారని ఆయన చెప్పారు.

### విదేశీయుల కోసం సహాయక చర్యలు



నేపాల్‌లో ఖాట్మండు లోయలో కొనసాగుతున్న కర్ఫ్యూ కారణంగా అక్కడ చిక్కుకుపోయిన విదేశీయుల సౌకర్యార్థం తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఈనెల 8 వరకు చెల్లుబాటు అయ్యే వీసా కలిగిన అంతర్జాతీయ ప్రయాణికులు ఇకపై ఎటువంటి అదనపు ఫీజులు చెల్లించకుండా ఎగ్జిట్ పర్మిట్లు పొందడంతో పాటు తమ వీసాలను సక్రమం చేసుకోవచ్చని ఇమ్మిగ్రేషన్ అధికారులను ఉటంకిస్తూ 'ది హిమాలయన్ టైమ్స్' శుక్రవారం పేర్కొంది. ఈ సౌకర్యం ఇమ్మిగ్రేషన్ కార్యాలయాలతోపాటు బయలుదేరే కేంద్రాలలోనూ అందుబాటులో ఉంటుంది. అల్లర్ల సమయంలో పాస్‌పోర్ట్‌లు కోల్పోయిన సందర్శకుల కోసం వీసా బదిలీల ఏర్పాట్లు కూడా అధికారులు చేశారు. తమ తమ రాయబార కార్యాలయాలు జారీ చేసిన అత్యవసర పాస్‌పోర్ట్‌లు లేదా ఇతర ప్రయాణ పత్రాలు కలిగిన ప్రయాణికుల వీసాలను, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం, కొత్త పత్రాలపై బదిలీ చేస్తారని, దీంతో వారు సులభంగా నేపాల్ విడిచి వెళ్లే అవకాశం లభిస్తుందని అధికారులు తెలిపారు. ఖాట్మండు నగరంలో ఉదయం 11:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. శుక్రవారం రాత్రి 7:00 గంటల నుంచి శనివారం ఉదయం 6:00 గంటల వరకు కర్ఫ్యూ కొనసాగుతుందని, రాత్రంతా అమలులో ఉంటుందని అధికారిక ఆదేశాలు జారీ అయ్యాయి.

## డాలస్‌లో దారుణం

✻ భారత సంతతి వ్యక్తి దారుణ హత్య
✻ తల నరికి కాలితో బంతాట!

**డాలస్:** వాషింగ్ మెషీన్ వివాదం కారణంగా, భార్య, కుమారుడి ఎదుటే 50 ఏళ్ల భారత సంతతి మోటెల్ మేనేజర్‌ను ఓ వ్యక్తి తల నరికి హత్య చేశాడు. అమెరికాలోని టెక్సాస్‌లో ఈ దారుణం చోటు చేసుకుంది. క్రిమినల్ రికార్డుగల సహోద్యోగి ఈ హత్యకు పాల్పడడం గమనార్హం. డాలస్ పోలీస్ శాఖ విడుదల చేసిన ప్రకటనను అనుసరించి, ఈ ఘటన డల్లాస్‌లోని డౌన్‌టౌన్ సూట్స్ మోటెల్ వద్ద చోటుచేసుకుంది. కర్ణాటకకు చెందిన చంద్ర మౌళి బాబ్ నాగమల్లయ్యతో, 37 ఏళ్ల క్యూబా మూలాలున్న సహోద్యోగి యోర్డానిస్ కొబోస్‌మార్టినెజ్ తో వాషింగ్ మెషీన్ పనిచేయకపోవడంపై గొడవ పడ్డాడు. నాగమల్లయ్య తన సూచనలను నేరుగా వినకుండా, మరొకరిని అనువదించమని కోరడంతో కొబోస్‌మార్టినెజ్ ఆగ్రహంతో ఊగిపోయాడని పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీలో, కొబోస్‌మార్టినెజ్ మచెటే తో నాగమల్లయ్యపై దాడి చేసిన దృశ్యాలు రికార్డు అయ్యాయి.



బాధితుడు మోటెల్ ఆఫీసు వైపు పారిపోగా, అక్కడ ఆయన భార్య, 18 ఏళ్ల కుమారుడు ఉన్నారు. నాగమల్లయ్య భార్య, కుమారుడు పలుమార్లు అడ్డుకోవడానికి ప్రయత్నించినా, కొబోస్‌మార్టినెజ్ వారిని తోసివేసి దాడి కొనసాగించాడు. అనంతరం బాధితుడి ఫోన్, కీ కార్డ్ తీసుకున్న తర్వాత మళ్లీ దాడి చేశాడు. నాగమల్లయ్య తలను శరీరం నుంచి వేరు చేసేవరకూ హింసించాడని కోర్టు అఫిడవిట్‌లో పోలీసులు తెలిపారు. నిందితుడు ఆ తర్వాత నాగమల్లయ్య తలను రెండుసార్లు కాలుతో ఫుట్‌బాల్ మాదిరి ఆడుతూ పార్కింగ్ లాట్‌లోకి విసిరాడని, ఆ తరువాత దాన్ని ఎత్తుకుని డంప్‌స్టర్‌లో వేసేశాడని పోలీసులు పేర్కొన్నారు. దీనిని అత్యంత దుర్మార్గమైన చర్యగా పోలీసులు తమ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దోషిగా తేలితే కొబోస్‌మార్టినెజ్‌కు జీవిత ఖైదు లేదా మరణదండన విధించబడే అవకాశం ఉంది. అధికార రికార్డుల ప్రకారం, అతను గతంలో ఫ్లోరిడాలో ఆటో దొంగతనానికి రెండు సార్లు అరెస్టు అయ్యాడు. అలాగే హ్యూస్టన్‌లో బాలలపై అసభ్యత, దాడి కేసులు కూడా ఉన్నాయి. రికార్డుల ప్రకారం అతనిపై ఇమిగ్రేషన్ హోల్డ్ కూడా ఉంది. కాగా, స్నేహితులు, కుటుంబసభ్యులు, సేవా ఇంటర్నేషనల్ వంటి కమ్యూనిటీ సంస్థలు నాగమల్లయ్య కుటుంబానికి మద్దతు ఇవ్వడానికి ముందుకొచ్చాయి.

అతని స్నేహితుడు తాన్మయ్ పటేల్ ఏర్పాటు చేసిన నిధుల సేకరణలో ఇప్పటివరకు 50,000 అమెరికన్ డాల ర్లు సమకూరాయి. ఇంకా సేకరణ కొనసాగుతోంది. కాగా, నాగమల్లయ్య అంత్యక్రియలు శనివారం జరగనున్నాయి.

## బినోయ్ విశ్వం తిరిగి ఎన్నిక
(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి వర్గ సభ్యుడు, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. కార్యదర్శిగా ఎన్నికయిన తర్వాత విశ్వం మాట్లాడుతూ వామపక్షాల ఐక్యత చాలా అవసరం, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన బలోపేతం అవుతుందని అన్నారు. 'అలప్పుజ మహాసభ విజయవంతమయింది. ఈ మహాసభ పార్టీని భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవడానికి, వాటిని విజయవంతంగా అధిగమించడానికి సిద్ధం చేస్తుంది. నన్ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగాలని రాష్ట్ర మహాసభ ఆదేశించింది. బాధ్యతాయుతమైన పార్టీ కార్యకర్తగా అందుకు నేను అంగీకరించాను' అని తెలిపారు. కస్టోడియల్ హింస ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ విధానం కాదని ఆయన అన్నారు. దుష్ప్రవర్తనకు పాల్పడిన పోలీసు అధికారులు శిక్షను ఎదుర్కొంటారని తెలిపారు. కాగా, రాష్ట్ర కార్యదర్శి ఎన్నికకు ముందు 11 మంది సభ్యులతో రాష్ట్ర సమితి, తొమ్మి ది మంది సభ్యుల కంట్రోల్ కమిషన్ కూడా ఎన్నికయింది. సెప్టెంబరు 21 నుంచి 25 వరకు చండీగఢ్‌లో జరగనున్న సీపీఐ జాతీయ మహాసభకు హాజరు కావడానికి మొత్తం 100 మంది ప్రతినిధులు ఎంపికయ్యారు.

## గోదావరి పుష్కరాలు
(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర పథకాలన్నింటితో సమన్వయం ఉండే పనులు గుర్తించి, వాటికి అవసరమైన అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. దక్షిణ భారత కుంభమేళాకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నుంచి స్పెషల్ ప్యాకేజీ కోరేందుకు వీలుగా ఈ పనుల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. పుష్కరాల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో పర్యాటక, నీటి పారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 2027లో జులై 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలకు వ్యవధి ఉన్నందున శాశ్వతమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో ప్రవేశించే గోదావరి నదికి రాష్ట్రంలో 560 కిలోమీటర్ల తీరం వెంట దాదాపు 74 ప్రాంతాల్లో పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంట ఉన్న ధర్మపురి, కాళేశ్వరంతో పాటు అన్ని ప్రధాన ఆలయాల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, వాటిని మొదట అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఆలయాల అభివృద్ధితో పాటు వివిధ ప్రాంతాల్లో శాశ్వత పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పుష్కర స్నానాలకు వీలుగా ఉండే గోదావరి తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఒకే రోజు రెండు లక్షల మంది భక్తులు పుష్కర ఘాట్లకు తరలివచ్చినా ఇబ్బంది లేకుండా రోడ్లు, రహదారుల నిర్మాణంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్, తాగు నీరు, స్నానాల ఘాట్లతో పాటు భక్తులకు అవసరమైన వసతి సదుపాయాలన్నీ ఉండేలా ప్లాన్ చేసుకోవాలని చెప్పారు.

## 'గ్రూప్-1 ఆధారాలు' ఉంటే బయటపెట్టండి



పాఠశాల విద్యార్థుల విషయాల్లో రాజకీయాలొద్దు : మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రూప్–1 పరీక్షల అంశంలో బట్ట కాల్చి మీద వేయడం కాదని,ఆధారాలను బయటపెట్టి నిరూపించాలని ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. చదువుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం హైదరాబాద్‌లోని అశోక్ నగర్ ప్రాంతంలో నూతన ఎస్‌సి హాస్టల్‌ను ప్రారంభించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నదన్నారు. పాఠశాలల విద్యార్థుల విషయంలో ప్రతిపక్షాలు రాజకీయం చేయకూడదని, సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలోని 18 నియోజకవర్గాలల్లో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్' నిర్మాణపనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రగతిభవన్ నిర్మాణానికి నిధులు విడుదల చేసిన గత ప్రభుత్వం, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల సంక్షేమ సొంత వసతి గృహాల కోసం మాత్రం నిధులను విడుదల చేయలేదని ఆరోపించారు. గిరిజన సంక్షేమానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.11 కోట్ల నిధులను విడుదల చేశామని, ఉద్యోగులు, విద్యార్థులకు సంబంధించిన సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లగా సంక్షేమ హాస్టల్స్ నిమిత్తం ప్రత్యేకంగా స్పెషల్ సెక్రటరీగా సీనియర్ ఐఎఎస్ సవ్యసాచి ఘోష్‌ను నియమించారని గుర్తు చేశారు. ఎస్‌సి,ఎస్‌టి శాఖలకు నిధులు కేటాయించాలని తాము కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని, స్కాలర్‌షిప్‌లో కేంద్రం వాటా పెంచాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ కోరారు. విద్యార్థుల భవిష్యత్తు విషయంలో ప్రభుత్వం ఎటువంటి తప్పు చేయబోదని, అనవసరంగా ప్రభుత్వంపై ఆరోపణలు చేసే వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని మంత్రి అన్నారు.

## స్టేషన్‌లలో సిసిటివి కెమెరాలు తప్పనిసరి



### డిజిపి డాక్టర్ జితేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల భద్రత కోసం విస్తృతస్థాయిలో సిసిటివి కెమెరాలను వినియోగించాలని తద్వారా దొంగతనాలను, డ్రగ్ సరఫరాలను పసిగట్టవచ్చని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అభిప్రాయపడ్డారు. రైల్వేల రాష్ట్ర స్థాయి సెక్యూరిటీ కమిటీ సమావేశం డిజిపి కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రతపై ఈ మేరకు జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ అధికారుల మధ్య తరచూ సమన్వయ సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. దొంగతనాలు, మరణాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, డ్రగ్స్ సరఫరా, వంటి నేరాల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రవేట్ వ్యక్తులను నియమించే ముందు వారి వివరాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, మానవ అక్రమ రవాణాపై తలపెట్టిన ఆపరేషన్ ఆహాత్‌ను పకడ్బందీగా కొనసాగించాలన్నారు. నేరస్తులకు సంబంధించిన చార్జిషీట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే వారిపై గ్యాంగ్స్ ఫైల్స్ నేరాల కింద కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు డిజిపి సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిజిపి (పర్సనల్) అనిల్ కుమార్, రోడ్ సేఫ్టీ రైల్వే ఐజిపి రమేష్ నాయుడు, రైల్వేస్ ఐజి, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమాసింగ్ ఠాకూర్, ఐఎస్ డబ్ల్యూ ఓఎస్‌డి కమలాసన్ రెడ్డి, రైల్వేస్ ఎస్‌పి చందనా దీప్తి, ఆర్‌పిఎఫ్ ఎస్‌పి నవీన్, ఇంటెలిజెన్స్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ రాధి, రైల్వే సీనియర్ డివిజనల్ మేనేజర్ సిహెచ్ కరుణాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు. రైల్వేల భద్రత గురించి జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ అధికారులు వివిధ అంశాలపై చర్చించారు.

## వేలంలో 'సింగరేణి' పాల్గొనాలి
(మొదటి పేజీ తరువాయి)

అదే సింగరేణి వేలంలో గనులు దక్కించుకుంటే 40 వేల మంది ఉద్యోగులు, 30 వేల మంది పొరుగు సేవల సిబ్బంది భవిష్యత్ కు బాటలు వేస్తుందని, ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కి మనుగడ ఉంటుందన్నారు. వేలంలో కేంద్రానికి వచ్చే ఆదాయం ఉండదన్నారు. దేశంలోని ఇతర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలు బొగ్గు వేలంపాటలో పాల్గొని బ్లాకులు సాధిస్తున్నప్పుడు సింగరేణి కూడా పాల్గొంటే తప్పేమిటని అన్నారు. పైగా వేలంలో బ్లాకులు పొందినందు వల్ల సింగరేణి సంస్థకు అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో లాభం చేకూరనుందని అలాగే టాక్స్‌ల రూపంలో కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుందన్నారు. సింగరేణిలో ప్రస్తుతం 38 గనులు ఉన్నాయని, కానీ ఈ గనులలో బొగ్గు నిల్వలు తరిగిపోతుండటం వల్ల మరో ఐదేళ్లలో పది గనులు మూతపడనున్నాయని, తద్వారా ఎనిమిది వేల మంది ఉద్యోగులు అవసరానికి మించి ఉంటారన్నారు. వారి ఉద్యోగ భద్రత కోసం కొత్త గనులు అవసరమన్నారు. ప్రస్తుతం సింగరేణి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తోందని కొత్త బ్లాకులు రానట్లయితే ఈ ఉత్పత్తి సగానికి పైగా పడిపోయే ప్రమాదం ఉందని తెలిపారు.

### 'సింగరేణి గ్లోబల్ ' పేరుతో అంతర్జాతీయంగా కీలక ఖనిజ రంగలోకి ప్రవేశం

కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ గానే కాకుండా సింగరేణి సంస్థ థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్తు, గ్రీన్ ఎనర్జీ రంగాలలో కూడా ప్రవేశిస్తుందని భట్టి విక్రమార్క వెల్లడించారు. సింగరేణి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ పేరుతో సోలార్, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ల ఏర్పాటులో ముందుకు సాగుతోందన్నారు. ప్రపంచంలో ఎక్కడెక్కడ కీలక ఖనిజాల ఉత్పత్తికి అవకాశం ఉందో పరిశీలించడం కోసం సింగరేణి సంస్థ ఒక ఏజెన్సీని కూడా నియమించుకుందని, ఆ ఏజెన్సీ ఇచ్చే లాభదాయక సూచనలను పరిగణనలోకి తీసుకొని సింగరేణి గ్లోబల్ పేరుతో ప్రపంచంలోని పలు దేశాల్లో కీలక ఖనిజాల ఉత్పత్తిని సింగరేణి సంస్థ ప్రారంభించనుందని తెలిపారు.

### కర్ణాటకలో బంగారం రాగి అన్వేషణకు లైసెన్సు సాధించిన సింగరేణి

సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా ఇటీవల జరిగిన కీలక ఖనిజాల అన్వేషణ వేలంపాటలో కర్ణాటక రాష్ట్రం రాయచూరులోని దేవదుర్గ్ ప్రాంతంలో బంగారం, రాగి అన్వేషణకు 37.75 శాతం రాయల్టీతో లైసెన్సు సాధించిందని, అన్వేషణ పనులు త్వరలో ప్రారంభిస్తుందన్నారు. అన్వేషణ తర్వాత ఆ ప్రాంతంలో ఎవరు ఆ గనులను చేపట్టినా సరే ఆ గనుల పూర్తి కాలం వరకు 37.75 రాయల్టీని సింగరేణికి చెల్లిస్తూ ఉంటారని, ఇది సింగరేణికి ఆర్థికంగా ఎంతో తోడ్పాటునందిస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ సిఎండి ఎన్.బలరామ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యం, నైపుణ్యం కలిగిన కార్మికులు, అధికారులు ఉన్నారని, అయితే బొగ్గు బ్లాక్‌లు లేకపోవడం వల్ల ఇది సాధ్యం కావడంలేదని, ఇకపై వేలంపాటలో పాల్గొనడానికి రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలపడం వల్ల కొత్త బ్లాకులను సింగరేణి సంస్థ చేపట్టడానికి అవకాశం ఏర్పడిందన్నారు. సమావేశంలో పెద్దపల్లి ఎంఎల్‌ఏ విజయ రమణారావు, సింగరేణి డైరెక్టర్లు ఎల్‌వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## భూమికి భూమి ఇవ్వాల్సిందే
(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఓఆర్‌ఆర్‌కు 40 కిలోమీటర్ల పరిధిలో ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం జరగాల్సినప్పటికీ కొన్ని కార్పొరేట్ కంపెనీల ఒత్తిళ్లతోటి ప్రభుత్వాలు అలైన్మెంట్లు మార్పులు తీసుకువచ్చారని, గతంలో చేసిన అలైన్మెంట్ను మార్చడంలో ఎవరికి లబ్ధి చేకూరుస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తరతరాలుగా భూములు సాగు చేసుకుంటున్న రైతులు తమ భూములు ట్రిబుల్ ఆర్ నిర్మాణంలో కోల్పోతున్నామని తెలిసి తీవ్రమైన మనస్థాపానికి గురై ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు.

### ప్రభుత్వాలు న్యాయ బద్ధంగా పని చేయాలి
### దివిస్ పరిశ్రమకు అనుకూలంగా ప్రభుత్వ తీరు దుర్మార్గం : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట అధికారంలోకి వచ్చాక మాట మాట్లాడడం సరికాదనీ, దివిస్ పరిశ్రమ యాజమాన్యం ఒత్తిడితోనే ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌లో మార్పులు తెచ్చారని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆరోపించారు. ప్రజల పక్షాన ఉండాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల వైపు మొగ్గడం శోచనీయమని, ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసుకొని ఓఆర్‌ఆర్‌కు వాస్తవ దూరంలో అలైన్‌మెంట్‌ను రూపొందించాలని, లేనియెడల రైతులు చేసే పోరాటానికి తమ పార్టీ ముందుంటుందని అన్నారు. భూములు కోల్పోయే రైతులు సంతోషంగా భూములు ఇవ్వాలి కానీ రైతుల భూములను లాకొని దుఃఖాన్ని కలిగించి కొంత మందికి లాభం చేకూర్చే విధానాన్ని తీవ్రంగా సిపిఐ పార్టీగా శాసన మండలి సభ్యునిగా తీవ్రంగా వ్యతిరేకించారు. చర్లగూడెం, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్ట్‌లు కట్టినప్పుడు ఆయా ప్రాజెక్ట్‌లలో భూములు కోల్పోయిన రైతులకు సరియైన నష్ట పరిహారం చెల్లించాలని కాంట్రాక్టర్‌ల మీద ఉన్న ప్రేమ భూ నిర్వాసితుల మీద ఉండాలని న్యాయ బద్ధమైన పోరాటాలు నిర్వహించామన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసితుల న్యాయబద్ధమైన పోరాటానికి కమ్యూనిస్ట్ పార్టీ గా ఎల్లప్పుడూ మద్దతుగా నిలబడి ఉంటామన్నారు. అలైన్మెంట్ న్యాయ పద్ధతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే భూములు కోల్పోతున్న రైతులకు సరియైన నష్ట పరిహారం చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలకు ధారాదత్తం చేసే అనుకూల విధానాలను మార్చుకోక పోతే ఉద్యమం తీవ్ర రూపం దాలిస్తుందని వెంటనే చొరవ తీసుకుని రైతులకు న్యాయం చేసే విధంగా చూడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, పల్లె శేఖర్ రెడ్డి, బచ్చన గోని గాలయ్య, కురుమిద్దె శ్రీనివాస్, పగిళ్ల మోహన్ రెడ్డి, కొండూరు వెంకటేష్, పిల్లి శంకర్, ఉడత రామలింగం, బత్తుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరవధిక బంద్
(మొదటి పేజీ తరువాయి)

కలిసి నోటీసు అందజేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయనందుకు నిరసనగా ఇంజనీర్స్ డేను బ్లాక్ డే గా ప్రకటిస్తామని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ప్రకటించాయి.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే కుట్ర : ఎఐఎస్‌ఎఫ్

కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ ఫీజు బకాయిలు విడుదల చేయడంలేదని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. సిఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్నప్పటికీ ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం సిఎం నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత మూడు విద్యాసంవత్సరాల నుండి ఫీజు బకాయిలు రూ.8 వేల కోట్లు పూర్తిగా పెండింగ్‌లో ఉన్నాయని, ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులతో పాటు బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారని, అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గు చేటన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఫీజు బకాయిల విడుదలపై మాట తప్పారని, గతంలో డిగ్రీ కళాశాలలు రాష్ట్ర వ్యాప్తంగా సెమిస్టర్ పరీక్షలు బహిష్కరించడం వల్ల విద్యార్థులకు సకాలంలో పరీక్షలు జరగలేదని, ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెబితే కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు నిర్వహించారని, కానీ ఇప్పటికీ ఫీజు బకాయిలు విడుదల లేక డిగ్రీ పూర్తి అయిన విద్యార్థులు డబ్బులు కట్టి మరి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారన్నారు. ఇప్పుడు ఇంజనీరింగ్ కళాశాలలు సైతం సెప్టెంబర్ 15వ తేదీ నుంచి ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు కళాశాలలు నిరవధిక బంద్ చేస్తామని ప్రకటించాయని, ఇప్పుడిప్పుడే ఇంజనీరింగ్ కళాశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయని ఇంజినీరింగ్ కళాశాలలు బంద్ చేయడం వల్ల విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం వారు అధికారంలోకి వచ్చిన నాటి నుండి పెండింగ్ లో ఉన్న, టోకెన్లు మంజూరైన ఫీజు బకాయిలను విడుదల చేయడం ద్వారా ప్రభుత్వంపై భారం తగ్గుతుందని, వెంటనే ప్రభుత్వం కళాశాలల యాజమాన్యాలతో చర్చించి పెండింగ్ ఫీజు రీయింబర్సమెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేనట్లయితే ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థులను ఏకం చేసి ప్రభుత్వంపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## చట్ట ప్రకారమే స్పీకర్ నిర్ణయం

మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్టీ ఫిరాయింపుల అంశం కోర్టు పరిధిలో ఉందని, చట్ట ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గాంధీ భవన్‌లో శుక్రవారం మంత్రి జూపల్లి మాట్లాడుతూ... పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఎమ్మెల్యేలకు సిగ్గుందా అంటూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇవాళో, రేపో కూలిపోతుందని కేటీఆర్ గతంలో వ్యాఖ్యలు చేశారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ఆలోచన అది కదా అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనాడు కేసీఆర్ చేసిన పనేంది? మీరు ఆనాడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించలేదా? మీరు పక్క పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు సిగ్గు లేదా అని కౌంటర్ ఇచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు వేల కోట్లు దోచుకుని ఇప్పుడు సిగ్గు లేదా? అని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆదిలాబాద్ బోథ్ నియోజకవర్గంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ మీడియా సమావేశంలో ఎంఎల్‌ఎలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మెఘారెడ్డి పాల్గొన్నారు.

# సురవరం నేటి నేతలకు ఆదర్శం




సంస్మరణ సభలో వక్తలు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ఎర్రజెండా ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం సిపిఐ యాదాద్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ పార్లమెంటు సభ్యులు అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ జరిగింది. జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఎంపి, ఎమ్మెల్యేలు బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ, బహుజన సమాజ్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కూనంనేని మాట్లాడుతూ దేశ ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు ఎరుపంటే భయం పట్టుకుందని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు లేకుండా చేయడానికి కగార్ పేరి ట మావోయిస్టులను హతమారుస్తున్నారని మండిపడ్డారు. మార్చి 26 నాటికి మావోయిస్టులు లేకుం డా చేస్తామని మోడీ, అమిత్ షాలకు శపథం పన్ని సైన్యాన్ని ఉపయోగించి మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తున్నారని మండిపడ్డారు. న్యాయం, ధర్మం గెలుస్తుందా? మోడీ అరాచకం గెలుస్తుందో చూద్దామని సవాల్ చేశారు. ఉద్యమాల జిల్లా కమ్యూనిస్టుల ఖిల్లా నల్లగొండ ఉమ్మడి జిల్లాలో ఎర్రజెండాకు పూర్వ వైభవం తీసుకురావడానికి పార్టీ శ్రేణులు రాజీలేని సమరశీల ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచి తుది శ్వాస వరకు మంచి కమ్యూనిస్టుగా విలువలతో కూడిన జీవితాన్ని గడిపిన మాజీ పార్లమెంటు సభ్యులు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి జీవితం నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ పేద ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో నలగొండ పార్లమెంటు నుంచి గెలుపొందిన సురవరం సుధాకర్ రెడ్డికి కేంద్ర మంత్రి పదవిలో అవకాశం వచ్చినప్పటికీ తనకు ఆ మంత్రి పదవి వద్దని దేశంలో ఆకలి చావులతో పేదలు చనిపోకుండా ఉండటానికి వంద రోజులు ఉపాధి కల్పించే జాతీయ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చిన పేదల పక్షపాతి సురవరం అని కొనియాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సమస్యలతో పాటు దేశ సమస్యలపై ప్రజల గొంతుకగా పార్లమెంటులో పోరాడిన యోధుడు సురవరం మరణం దేశానికి తీరని లోటుగా పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఏడు దశాబ్దాల పాటు కమ్యూనిస్టు విలువలతో కూడిన రాజకీయ జీవితాన్ని గడిపిన సురవరం సుధాకర్ రెడ్డి జీవితం నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయమన్నారు. తుది శ్వాస వరకు పేద ప్రజల కోసమే సురవరం జీవించారని, చనిపోయిన తర్వాత కూడ భౌతిక కాయాన్ని భావితరం వైద్యుల పరిశోధన కోసం అప్పగించుకొని ప్రజల కోసమే జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. పాలమూరు జిల్లాలో ఆకలి కేకలతో చనిపోతున్న గెలిపించి కరువు యాత్ర నిర్వహించారని, నల్లగొండ జిల్లాలో పీడిత ప్రాంతాల్లో తాగు తాగునీరు కోసం పాదయాత్ర చేశారన్నారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమాల పుట్టినిల్లు కమ్యూనిస్టు పార్టీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా సారథ్యం వహించిన సురవరం సుధాకర్ రెడ్డి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకొని ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయుడుగా ఉంటారని అన్నారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామ్యేల్ మాట్లాడుతూ ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలు ఎర్రజెండాను ఏమి చేయలేరని అన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ భారత పార్లమెంటు తరపున యూఎన్‌ఓ సమావేశాలకు సువరం సుధాకర్ రెడ్డి హాజరవ్వడం గర్వకారణం అన్నారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించాలని దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించి జైలు జీవితం గడిపిన చరిత్ర సురవరంకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, సిపిఐఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండి.జహంగీర్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ జనార్దన్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, బచ్చనగొని గాలయ్య, బోడ సుదర్శన్, ఉప్పల ముత్యాలు, కుసుమని హరిచంద్ర, ఏశాల అశోక్, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, పెరబోయిన మహేందర్, సిపిఐ సీనియర్ నాయకులు పాశికంటి లక్ష్మి నర్సయ్య, రేగు సిద్దయ్య, కట్కూరి రాంగోపాల్ రెడ్డి, పుట్ట రమేష్, గనబోయిన వెంకటేష్, చింతల మల్లేష్, బద్దం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## వ్యవసాయ అభివృద్ధి కోసం ఇక్రిశాట్‌తో కలిసి పనిచేస్తాం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధికి ఇక్రిశాట్‌తో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఇక్రిశాట్ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, ఇక్రిశాట్ సంస్థ ప్రతినిధులు చిక్కుళ్ళు, తృణధాన్యాల మెరుగైన రకాలతో పాటు, వివిధ పంటలలో తాము అమలు చేస్తున్న వ్యవసాయ సాంకేతిక పద్ధతులను మంత్రికి వివరించారు. ఇక్రిశాట్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ రంగం మరింతగా ఎలా అభివృద్ధి చెందుతుందో కూడా వారు చర్చించారు. ఈ చర్చలపై సానుకూలంగా స్పం దించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ రంగంలో ఇక్రిశాట్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి ఇక్రిశాట్‌తో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

**త్వరలో యాప్..**

నెదర్‌ల్యాండ్ ఎఐ కంపెనీ ప్రతినిధులతో తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. తెలంగాణలో ఉన్న ప్రతి రైతు సమస్యలకు పరిష్కారం చూపించే విధంగా, సాంకేతికతను ఉపయోగించి ఒక యాప్‌ను వృద్ధిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటికే వివిధ ప్రైవేట్ సంస్థలు వివిధరకాల యాప్‌లతో ముందుకు వచ్చాయని, అలా కాకుండా వ్యవసాయశాఖనే స్వతహాగా ఒక యాప్‌ను వృద్ధి చేసి ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాల గురించి, పంటల యాజమాన్యంతో రైతులకు అనునిత్యం ఎదురయ్యే వివిధ సమస్యలకు వెంటనే పరిష్కారం లభించేలా ఒక యాప్‌ను ఎఐ రంగంలో పనిచేస్తున్న సంస్థలతో కలిసి వృద్ధి చేయాల్సిందిగా ఆదేశించారు.

**ఒకే రోజు 11,930 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా..**

ఒక్కరోజే ఆర్‌సిఎఫ్, సిఐఎల్, కెఆర్‌ఐబిహెచ్‌సిఒ, ఐపిఎల్, డిఎఎంఆర్‌ఎ కంపెనీల నుండి 11,930 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరుకుందని అన్నారు. గత రెండు రోజులుగా రాష్ట్రానికి 23000 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందని అన్నారు. యూరియా సరఫరాలపై వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి, కమిషనరేట్ అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా నిరంతరంగా కొనసాగించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. రాష్ట్రంలోని ఆర్‌ఎఫ్‌సిఎల్ ఎరువుల కర్మాగారాన్ని తిరిగి పునరుద్ధరించేలా మరోసారి కేంద్రాన్ని కోరాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

## మహిళా పారిశ్రామికవేత్తల కోసం సిఐఐ కృషి

మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం కోసం సిఐఐ ఎంతో కృషి చేస్తోందని కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. హైటెక్ సిటీ టెక్ మహీంద్రాలో శుక్రవారం జరిగిన సిఐఐ ఇండి యా ఉమెన్ అప్ లిఫ్ట్ వాయిస్ ఫర్ చేంజ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంద్రా మహిళా శక్తి ద్వారా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు మంచి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. దేశ జిడిపి పెరగాలంటే మహిళలు వ్యాపార రం గంలో ముందుకు రావాలని సూచించారు. మహిళల్లో మల్టీ టాస్కింగ్ నైపుణ్యం, ధైర్యం ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఇంట్లోని ప్రతి మహిళకు అవకాశాలు ఇవ్వడం సమాజం బాధ్యత అని గుర్తుచేశారు. నా కుటుంబంలో ఉన్న మహిళలు కూడా విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగానే ఉన్నారని మంత్రి తెలిపారు. గ్రామీణ మహిళల్లో అపారమైన ప్రతిభ ఉందని, వారికి ప్రోత్సాహం అందిస్తే దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. మహిళల శక్తిని వేదికలపై మాత్రమే కాకుండా ప్రతి ఇంట్లో గుర్తించి, అవకాశాలు ఇవ్వడం మనందరి బాధ్యత అని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు.

## పది జిల్లాలకు రైల్వే కనెక్టివిటీ

సిఎంకు మాజీ ఎంపి వినోద్‌కుమార్ విజ్ఞప్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, 'కరీంనగర్ వయా హుజురాబాద్ నుంచి కాజీపేట' రెండు రైల్వే లైన్లపైన దృష్టి కేంద్రీకరించాలని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ముఖ్యమంత్రిని కోరారు. ఈ రైల్వే లైన్‌లో కొత్త లింకులు కలిపితే ఉత్తర తెలంగాణ పది జిల్లాలకు రైల్వే కనెక్టివిటీ వస్తుందన్నారు.హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శుక్రవారం ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ రైల్వేలైన్ విషయంలో సిఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో 'ఆదిలాబాద్, కరీంనగర్' రెండు రైల్వే లైన్లపైన చర్చించలేదన్నారు. హైదరాబాద్ నుంచి అమరావతికి గ్రీన్ ఫీల్ రోడ్డు అనేది ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోనే ఉన్నదన్నారు. ఆదిలాబాద్‌కు రైలులో వెళ్ళాలంటే మహారాష్ట్రకు వెళ్ళి, అక్కడి నుంచి మళ్లీ ఆదిలాబాద్‌కు రావాల్సి వస్తుందని, అక్కడ నిజాం కాలం నాటి రైల్వే లైన్ ఇప్పటికీ ఉన్నదని గుర్తు చేశారు. తాను ఎంపిగా ఉన్నప్పుడు సర్వే, డిపిఆర్‌ను సిద్ధం చేయించానని, ఈ రెండు రైల్వే లైన్లపైన దృష్టి పెట్టాలని సూచించారు. రెండు రైల్వే లైన్లు ఏర్పాటు చేసే విషయమై తాను సిఎం రేవంత్ రెడ్డికి,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, దక్షిణ మధ్య రైల్వే జిఎంకు లేఖ రాస్తున్నానని చెప్పారు. ఎంఎల్‌సి తక్కెళ్ల పల్లి రవీందర్ రావు ,కార్పొరేషన్ మాజీ చైర్మన్లు మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,గాదరి బాలమల్లు ,బిఆర్ఎస్‌వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.


**శ్రీ ఏడుపాయల వన దుర్గా భవాని దేవస్థానం**
నాగసానిపల్లి (గ్రా||), పాపన్నపేట (మం||), మెదక్ జిల్లా.

Rc.No. 5B/SEVDED/2024 — ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు - 1వ పిలుపు — తేది: 12.09.2025

పోతంశెట్టి క్రాస్ రోడ్ నుండి నాగసానిపల్లి రోడ్ వరకు రోడ్డుకు అడ్డంగా ఆర్చ్ గేట్ నిర్మాణం కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ ఆహ్వానించడమైనది. **విలువ:** రూ.50.00 లక్షలు. మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.in లో చూడవచ్చు. **బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ:** 15.09.2025, **బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ (సమర్పణ):** 29.09.2025.

DIPR R.O. No. : 8036-PP/CL/ADVT/1/2025-26, Date: 12-09-2025 — సం/- ఎగ్జిక్యూటివ్ అధికారి



**శ్రీ దండుమైసమ్మ దేవస్థానం**
దేవాదాయ, ధర్మాదాయ శాఖ
గ్రా|| నెమ్మికల్లు, మం|| ఆత్మకూర్ (యస్), జిల్లా|| సూర్యాపేట

బహిరంగ వేలము ప్రకటన — తేది: 06-09-2025

ఇందుమూలముగా సమస్త భక్తులందరుకు తెలియజేయునది ఏమనగా! పై దేవస్థానము వద్ద తేది : 17-09-2025 బుధవారం రోజున మ.12-00 గంటల నుండి ఈ క్రింద పేర్కొనబడిన వేలములు 2025-26 సం||నకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలములు జరుపబడును. ఆసక్తిగలవారు వేలం పాటలో పాల్గొనవచ్చును.

-: వేలం వివరములు :-

| క్ర.సం. | వేలము వివరములు | కాలపరిమితి 1 సం||రము | డిపాజిట్ | తేది, సమయం |
|---|---|---|---|---|
| 1. | తల నీలాలు సేకరించుకొను హక్కు | ది:01.01.2026 నుండి 31.12.2026 వరకు | 4,00,000 డిడి మాత్రమే | తేది:17.09.2025 మ.12.00గం.ల |
| 2. | కొబ్బరి కాయలు అమ్ముకొనుహక్కు | ది:01.01.2026 నుండి 31.12.2026 వరకు | 5,00,000 డిడి మాత్రమే | పై వేలం తదుపరి |
| 3. | పూజ సామాగ్రి అమ్ముకొను హక్కు | ది:01.01.2026 నుండి 31.12.2026 వరకు | 3,00,000 డిడి మాత్రమే | పై వేలం తదుపరి |
| 4. | పూలు, పండ్లు అమ్ముకొను హక్కు | ది:01.10.2025 నుండి 30.09.2026వరకు | 2,00,000 డిడి మాత్రమే | పై వేలం తదుపరి |
| 5. | పచ్చికొబ్బరి చిప్పలు పోగుచేసుకొను హక్కు | ది:01.10.2025 నుండి 30.09.2026 వరకు | 1,50,000 డిడి మాత్రమే | పై వేలం తదుపరి |

1. పైన తెలిపిన వేలములకు డి.డి. (కార్య నిర్వహణాధికారి శ్రీ దండుమైసమ్మ దేవస్థానము వారి పేరు మీద చెల్లుబాటు అగునట్లుగా డి.డి. తీయవలయును.)
2. వేలం షరతులు వేలంపాటకు ముందుగా తెలియపరచబడును.

DIPR R.O. No. : 7950-PP/CL/ADVT/1/2025-26, Date: 12-09-2025 — సం/- కార్యనిర్వహణాధికారి



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
డివిజన్ నెం.17, కె.జెడ్., జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్.

EOI No. 03/EE/CIRCLE-17/KZ/GHMC/2025-26/ — తేది: 11.09.2025

| NIT No. | పని పేరు | వెబ్‌సైట్ నుండి EOI డౌన్‌లోడ్ చేసుకోవచ్చు | ప్రారంభ తేదీ/ డౌన్‌లోడ్ ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 03/ EE-17 / 2025 - 26 | జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్ జోన్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్వహణ మరియు ఆపరేషన్. 1) తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియం, సర్కిల్-12, కెజెడ్, జిహెచ్‌ఎంసి. 2) విజయనగర్ కాలనీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సర్కిల్-12, కెజెడ్, జిహెచ్‌ఎంసి. 3) రెడ్‌హిల్స్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సర్కిల్-12, కెజెడ్, జిహెచ్‌ఎంసి. 4) గోల్కొండ స్పోర్ట్స్ కాంప్లెక్స్ & స్విమ్మింగ్ పూల్, సర్కిల్-13, కెజెడ్, జిహెచ్‌ఎంసి. 5) విక్టోరియా ప్లేగ్రౌండ్ ఇండోర్ మరియు అవుట్‌డోర్ స్టేడియం, సర్కిల్-14, కెజెడ్, జిహెచ్‌ఎంసి. 6) హిందీ నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సర్కిల్-14, కెజెడ్, జిహెచ్‌ఎంసి. 7) అమీర్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, సర్కిల్-17, కెజెడ్, జిహెచ్‌ఎంసి. 8) సనత్‌నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ & ప్లేగ్రౌండ్, సర్కిల్-17, కెజెడ్, జిహెచ్‌ఎంసి. 9) షేక్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్& ప్లేగ్రౌండ్, సర్కిల్-18, కెజెడ్, జిహెచ్‌ఎంసి. | తేది & సమయం | 12-09-2025 @ 12.00 P.M | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-17, జిహెచ్ ఎంసి |
| | | ప్రీ బిడ్ మీటింగ్ తేది | 19-09-2025 @ 12.00 P.M | |
| | | సాంకేతిక బిడ్ ప్రారంభ తేది & సమయం | 19-09-2025 @ 12.00 P.M | |
| | | ఆర్థిక బిడ్ ప్రారంభ తేది & సమయం | 19-09-2025 @ 12.00 P.M | |

హార్డ్ కాపీ మరియు మరిన్ని వివరాల కోసం, దయచేసి దిగువ సంతకందారుని కార్యాలయాన్ని సందర్శించండి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, కె.జెడ్., జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 7934-PP/CL/ADVT/1/2025-26, Date: 12-09-2025


# యాజమాన్యం మొండివైఖరి, కాలయాపన వల్లే సింగరేణి స్ట్రక్చర్ సమావేశం బహిష్కరణ

గత చర్చల్లో అంగీకరించిన డిమాండ్‌లను అమలు చేయకపోతే ఉద్యమం : ఎస్‌సిడబ్ల్యుయు అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల సమస్యలపై సింగరేణి యాజమాన్యంతో జరిగిన చర్చల్లో అంగీకరించిన డిమాండ్‌లను వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోనట్లయితే ఉద్యమాన్ని చేపడతామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సిడబ్ల్యుయు– ఎఐటియుసి) హెచ్చరించింది. యాజమాన్యం అంగీకరించిన డిమాండ్‌లను అమలు చేయకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు ఎందుర్కొంటున్నారని, ఈ విషయంలో యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం జరిగిన సింగరేణి స్ట్రక్చర్ సమావేశాన్ని యూనియన్ బహిష్కరించింది. కార్మికులకు సొంతింటి పథకాన్ని వెంటనే అమలు చేయాలని, మెడికల్ బోర్డు విషయంలో గతంలో మాదిరిగానే మెడికల్ బోర్డు పెట్టాలని, సంస్థ వాస్తవ లాభాలు ప్రకటించి అందులో 35 శాతం వాటాను కార్మికులకు ప్రకటించాలని యూనియన్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎస్‌సిడబ్ల్యుయు అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, మాట్లాడుతూ గత ఏడాది కాలంగా రెండు సార్లు డైరెక్టర్‌తో, ఒకసారి సిఎండితో జరిగిన సమావేశాలలో కార్మికులకు సంబంధించిన పలు అంశాలపై అంగీకరించి సర్క్యులర్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదని, సొంత ఇంటి పథకంపై కమిటీ వేసినా ఇంతవరకు ఒక సమావేశం నిర్వహించకుండా కాలయాపన చేయడం వల్ల కార్మికవర్గం నష్టపోతున్నదన్నారు. ఆదాయం పన్ను విషయంలో కోల్ ఇండియా మాదిరిగా పెర్క్స్‌పై రికవరీ చేసిన మొత్తాన్ని రిఫండ్ చేయాలని, ఎన్నడూ లేనివిధంగా ట్రాన్స్‌ఫర్ పాలసీ తీసుకురావడం అన్యాయమని, దానిని సవరించి గతంలో మాదిరిగానే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈపి ఆపరేటర్ల విషయంలో డి నుంచి సిసి, ఆ ప్రాతిపాదిక నుంచి బి ఆపరేటర్లకు ఒప్పుకున్నా ఇంతవరకు సర్కులర్ ఇవ్వలేదన్నారు. డిస్మిస్ కార్మికులకు మరొకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. అన్ని క్యాడర్ స్కీమ్‌లను పరిష్కరించాలని, మారు పేర్లతో ఉద్యోగుల పిల్లలకు వెంటనే ఉద్యోగాలివ్వాలని, 2018 నుండి పెండింగ్‌లో ఉన్న, తిరస్కరించిన డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ 2024 సర్క్యులర్ ప్రకారం అందరికి ఇవ్వాలని, కాంట్రాక్టు వర్కర్స్ హైపవర్ వేతనాలను ఇవ్వాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ కొత్త ప్రాజెక్టులను ప్రైవేటు సంస్థకు కట్టబెట్టేందుకు యాజమాన్యం, ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఉన్న ప్రాజెక్టులు మూతపడడం, కొత్త గనులు లేకపోవడం వల్ల కార్మికులు ఉద్యోగాలను కొల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త గనుల కోసం సింగరేణి వేలం పాటలో పాల్గొనాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఓవర్‌మెన్‌లకు ప్రమోషన్ విషయంలో తాత్సరం చేయడం వల్ల వారి సీనియారిటీ దెబ్బతింటున్నదని, వెంటనే వారికి న్యాయం చేయాలని కోరారు. మైనింగ్, ట్రేడ్స్‌మెన్‌ల సూటబుల్ జాబ్ విషయంలో యాజమాన్యం ఒప్పుకుని చాలా కాలం అయిందని, దీనిపై యాజమాన్యం వైఖరి పట్ల తీవ్రంగా వ్యతిరేకస్తున్నామన్నారు. క్లరికల్ ఖాళీలు పూర్తిచేయడంలో పూర్తిగా విఫలమయ్యారని, రెండేళ్లు అయినా ఇంతవరకు పరీక్ష పెట్టక పోవడంవల్ల కొంతమంది కోర్ట్‌కు వెళ్లారన్నారు. సమావేశంలో అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.సారయ్య, వై.వి.రావు, కె.వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, సెంట్రల్ సెక్రటరీ, వంగ వెంకటి, ఎం.రమేష్ పాల్గొన్నారు.

## ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి : భట్టి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదాయం కోల్పోతున్న ప్రాంతాలను గుర్తించాలని, క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనితీరు, వ్యాపార లావాదేవీలను కేంద్ర కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. జిఎస్‌టి ధరల రేషనలైజేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రం కోల్పోతున్న ఆదాయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, అలాగే ఆదాయం పెంచుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖలో అంతర్గత కమిటీలు వేసి అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు. జిఎస్‌టి ఎగవేత దారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వాణిజ్యపన్నుల శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.ఎ రిజ్వీ, కమిషనర్ హరిత, డిప్యూటీ సిఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్, డిప్యూటీ కమిషనర్లు సౌజన్య, వాసవి, సంయుక్తారాణి, సునీత, గీత పాల్గొన్నారు. గత సంవత్సరానికి, ప్రస్తుత సంవత్సరానికి వాణిజ్యపన్నుల శాఖలోని ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆడిట్ తదితర విభాగాల్లో సాధించిన ప్రగతిని భట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ నిర్ధేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖ అధికార యంత్రాంగం కృషి చేయాలని సూచించారు. ఇక నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి వాణిజ్య పన్నుల శాఖ ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. నిఘా వ్యవస్థ నిరంతరం ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని, అధికారుల నిర్లక్ష్యం మూలంగా రాష్ట్ర ఆదాయానికి గండి పడే ప్రమాదం ఉందని సూచించారు. ఉన్నత స్థాయి అధికారులు నిత్యం ఎఐ సాంకేతికతను వినియోగించుకుని పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే లావాదేవీలు పన్నుల వసూలులో వస్తున్న సమస్యలను అధిగమించేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు సూచించారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం-6
(చట్టం-30/2013 లోని సెక్షన్ 11(1) లోని సబ్ రూల్ 1 రూల్ 19 ప్రకారం)
ప్రాథమిక నోటిఫికేషన్

G1/4480/2025 — తేది: 01.09.2025
నెం. సి/116/2025 — తేది: .08.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం యం. దోమలపల్లి గ్రామం, నల్లగొండ మండలం నల్లగొండ జిల్లాలో విస్తీర్ణం: **ఎ.0.02$^3/_4$ గుంటల** ప్రభుత్వ అసైన్డ్ భూమిని ప్రజా ప్రయోజనార్థం ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్ట్ యందుగల ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (U.S.L.I.S) యందలి ఎడమ ప్రధాన కలువ యొక్క డి-1 యందు 20ఆర్ మైనర్ కాలువ కి.మీ. 0.000 నుండి 0.171 వరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి అవసరము అయి ఉన్నదని భావించినందున భూ సేకరణ పునరుపాధీ, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 యందు చట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

తెలంగాణా ప్రభుత్వం వారు జి. ఓ. యం. ఎస్. నెం.54 ఇరిగేషన్ (ఎల్.ఎ., ఆర్ & ఆర్ /2ఎ) కాడ్ & డిపార్టెమెంట్ తేది: 25-07-2017 నాడు జారీ చేసినారు అట్టి జి.ఓ. నందు ఉదయ సముద్రం భూసేకరణ చట్టం 2013 క్రింద అధ్యయము & III ఈ ప్రాజెక్ట్ నుండి మినహాయించబడినది.

కావున ఈ ప్రాజెక్టు క్రింద నల్లగొండ జిల్లా, యం. దోమలపల్లి గ్రామం, నల్లగొండ మండలం యందు విస్తీర్ణం **ఎ.0.02$^3/_4$ గుంటల** భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది .

షెడ్యూల్

గ్రామం: యం.దోమలపల్లి — మండలం: నల్లగొండ — జిల్లా: నల్లగొండ

| క్ర. సం. | సర్వే నెం. భూమి స్వభావం ఖుష్కి/ తరి/ పట్టా/ ప్రభుత్వ విస్తీర్ణం | భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం. | భూమిని కోల్పోయే రైతు పేరు తండ్రి/భర్త పేరు | ప్రదేశము పై ఉన్న చెట్లు/ నిర్మాణములో ఉన్న ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | 81 ఖుష్కి / ప్రభుత్వ 0.02 $^3/_4$ | 0.00 $^1/_4$ | సింగపంగ సాయిలు తండ్రి గోపులు | -- |
| 2 | | 0.02 $^1/_2$ | సింగపంగ సాయిలు తండ్రి గోపులు | -- |
| | మొత్తం విస్తీర్ణం | 0.02 $^3/_4$ | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని కేంద్ర భూసేకరణ చట్టం, 2013 ( చట్టం నెం. 30/2013) లోని నియమంలోని సెక్షన్ (11) 1 సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఎ., విభాగం - 2, నల్లగొండ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్, డివిజన్ నెం.6. జి.వి.గూడెం, నల్లగొండ గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పనిదినములలో మరియు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఎ. విభాగం 2, నల్లగొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్-12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే, భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యాజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల, మరియు నష్ట పరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ గారికి లేదా ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్&ఆర్ & ఎల్.ఎ. విభాగము-2, నల్లగొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- ప్రత్యేక ఉప కలెక్టరు, ఆర్&ఆర్ & ఎల్.ఏ. విభాగం-2, నల్లగొండ — సం/- అదనపు కలెక్టర్ నల్లగొండ — సం/- జిల్లా కలెక్టర్ నల్లగొండ

DIPR RO NO.606/LA/PP/Advt/Pub/2025-26



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: హైదరాబాద్**
డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్.

జిహెచ్‌ఎంసి, చార్మినార్ జోన్, సర్కిల్-10 (ఫలక్‌నుమా)లోని బహదూర్‌పురా X రోడ్ వద్ద 10 స్పాన్లలో (పిల్లర్ నెం. AP1 నుండి AP2 వరకు) ఫ్లైఓవర్ కింద 6 1/2'' వ్యాసం కలిగిన బోర్‌వెల్, సబ్‌మర్సిబుల్ పంప్‌సెట్ డ్రిల్లింగ్, HDPE పైప్‌లైన్ వేయడం మరియు జాయింటింగ్ కోసం రిజిస్టర్డ్ ఏజెన్సీ నుండి కొటేషన్లను ఆహ్వానించడమైనది - నోటిఫికేషన్ ప్రచురణ.

| క్ర.సం. | ఐటెమ్స్ | వివరాలు |
|---|---|---|
| 1 | పని పేరు | జిహెఎంసి, చార్మినార్ జోన్, సర్కిల్-10 (ఫలక్‌నుమా) లోని బహదూర్‌పురా X రోడ్ వద్ద 6 1/2'' వ్యాసం కలిగిన బోర్‌వెల్, సబ్‌మర్సిబుల్ పంప్‌సెట్, ఫ్లైఓవర్ కింద 10 స్పాన్లలో (పిల్లర్ నెం. AP1 నుండి AP2 వరకు) HDPE పైపులైన్ వేయడం మరియు జాయింటింగ్ కోసం కొటేషన్లు. |
| 2 | నోటిఫికేషన్ జారీ చేసే అధికారి చిరునామాతో కూడిన కార్యాలయం పేరు | డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్. |
| 3 | నోటిఫికేషన్ సంఖ్య & తేదీ | నం. 92/UBD/CRZ/GHMC/2025; తేదీ: 12.09.2025. |
| 4 | నోటిఫికేషన్ డాక్యుమెంట్ డౌన్ లోడ్ ప్రారంభ తేదీ & సమయం | ప్రారంభ తేదీ: 13.09.2025 మధ్యాహ్నం 01.00 గంటల నుండి. |
| 5 | నోటిఫికేషన్ పత్రం డౌన్ లోడ్ ముగింపు తేదీ | తేదీ: 13.09.2025 మధ్యాహ్నం 03.00 గంటల వరకు. |
| 6 | కొటేషన్లు సమర్పించడానికి చివరి తేదీ & సమయం | తేదీ: 16.09.2025 మధ్యాహ్నం 3:30 వరకు |
| 7 | కొటేషన్ల తెరవడం | తేదీ: 16.09.2025 సాయంత్రం 4.00 గంటలకు |
| 8 | కొటేషన్లు సమర్పించే స్థలం | డిప్యూటీ డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, GHMC, 2వ అంతస్తు, పూల్బాగ్, హైదరాబాద్. |
| 9 | కొటేషన్ల తెరవడం | 16-09.2025. |
| 10 | చిరునామా / ఇ-మెయిల్ ఐడి | ddparkssz.ghmc@gmail.com |
| 11 | సంప్రదింపు వివరాలు | 9701032001 |

సం/- డిప్యూటీ డైరెక్టర్, అర్బన్ బయోడైవర్సిటీ వింగ్, చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 7970-PP/CL/ADVT/1/2025-26, Date: 12-09-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## యాకుత్‌పురా ఘటన బాధ్యత హైడ్రాదే...చర్యలు తప్పవు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యాకుత్‌పూరా మ్యాన్‌హోల్‌లో ఐదేళ్ల చిన్నారి పడిన ఘటనలో సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ప్రస్తుతం నగరంలో ఉన్న మ్యాన్‌హోల్స్ ఆడిట్‌ను ప్రారంభించామని, మూతలు సరిగా లేని వాటిని గుర్తించి, సంబంధిత శాఖలకు సమాచారం ఇస్తున్నామన్నారు. జిహెచ్‌ఎంసి, వాటర్ బోర్డు, హైడ్రా మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేదని స్పష్టం చేశారు. బ్లేమ్ గేమ్ కాకుండా, సమన్వయంతో ముందుకు సాగాలి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. మ్యాన్‌హోల్స్ ఎమర్జెన్సీ టీమ్స్‌కు డిఆర్‌ఎఫ్ ఇన్‌చార్జ్‌గా ఉన్న వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచి జరిగితే క్రెడిట్ తీసుకోవాలని చూస్తామని, అలాగే తప్పు జరిగినప్పుడు కూడా అలాగే ఒప్పుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా పోలీస్ స్టేషన్‌లో త్వరలో కేసులు నమోదు చేయనున్నట్లు వెల్లడించారు.

## జిహెచ్‌ఎంసి కార్మికులందరికీ జీతాలు చెల్లించాలి: ఎఐటియుసి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ మున్సిపల్‌లో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ ఈ నెల 26లోపు వేతనాలు చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఒక డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణను యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఏసురత్నం, రాష్ట్ర సహాయ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి కలిసి కార్మికుల సమస్యల మీద వినతి పత్రం అందించారు. దసరా పండుగ సందర్భంగా కార్మికులకు వేతన సవరణ ఇంతవరకు జరగలేదని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై సిఎం స్పందించాలని కూడా కోరారు. కార్మిక వర్గానికి కనీసం తాత్కాలిక భృతి 6వేల రూపాయలు చెల్లించాలని కమిషనర్‌ను కోరారు. మున్సిపల్ కార్మికులకు ఇవ్వవలసిన బట్టలు నూనెలు సబ్బులు ఇతర పనిముట్లు ఇవ్వాలనికూడా కోరారు. పర్మినెంట్ కార్మికులకు దసరా పండుగ అడ్వాన్సులు డిఏ బకాయిలు, సలెండర్ లీవులు బకాయిలు వెంటనే ఇవ్వాలని,. శానిటేషన్ విభాగంలో ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్న విధంగా మలేరియా రంగంలో కూడా ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం భర్తీ చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌ని కోరారు. ఈ సమస్యలు అన్నిటిని వెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ సంఘం కోశాధికారి వి.హరినాథ్ రావు, రాష్ట్ర నాయకులు ఎం.మద్దిలేటి, యాదయ్య, లడ్డు పాల్గొనడం జరిగింది.




## 23న బయల్దేరనున్న భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జ్యోతిర్లింగంతో దివ్య దక్షిణ యాత్రను ఈ నెల 23న సికింద్రాబాద్ నుంచి భారత్ గౌరవ్ టూరిస్టు రైలు బయల్దేరుతుందని ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సిటిసి) అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు తిరువన్నమలై లోని అరుణాచలం ఆలయం, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం,మధురైలోని మీనాక్షి అమ్మన్ ఆలయం, కన్యాకుమారిలోని రాక్ స్మారక చిహ్నం, కుమారి అమ్మన్ ఆలయం, త్రివేండ్రంలోని శ్రీ పద్మనాభ స్వామి ఆలయం, త్రిచిలోని శ్రీ రంగనాథస్వామి ఆలయం, తంజావూరు లోని బృహదీశ్వర ఆలయాలను దర్శింప చేస్తుందని తెలిపారు. తెలంగాణ లోని జనగాం , కాజీపేట , వరంగల్, మహబూబాబాద్ , ఖమ్మం, మధిర ; ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు , నెల్లూరు, గూడూరు & రేణిగుంట వంటి ముఖ్యమైన స్టేషన్లలో మార్గ మధ్యంలో ఇరువైపులా ప్రయాణికుల కోసం రైలు ఎక్కేందుకు /దిగేందుకు సౌకర్యం కల్పించబడిందన్నారు. బుకింగ్ కోసం భక్తులు 9701360701, 9281030726, 9281030740, 9281495845 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు. ఆన్‌లైన్ బుకింగ్‌ల కోసం: www.irctctourism.com ను సందర్శించవచ్చునన్నారు.

## 'తన్మయం' సంగీత వాయిద్య కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్‌లోని సౌత్ లాలాగూడలోని రైల్వే మిక్స్‌డ హై స్కూల్‌లో ' తన్మయం ' సంగీత వాయిద్య పరికరాల కేంద్రాన్ని హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డి.ఆర్.ఎం) సంతోష్ కుమార్ వర్మ, హైదరాబాద్ డివిజన్ మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు ఆశా వర్మ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సంతోష్ కుమార్ వర్మ మాట్లాడుతూ, సంగీత వాయిద్య కేంద్రం విద్యార్థులకు వారి సంగీత ప్రతిభను వెలికితీయడానికి, అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుందని అన్నారు. పిల్లలలో సృజనాత్మకత, క్రమశిక్ష, సాంస్కృతిక అవగాహనను పెంపొందించడంలో ఈ చొరవ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తద్వారా వారి సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కేంద్రం వివిధ రకాల సంగీత వాయిద్యాలతో అమర్చబడి ఉందని మరియు విద్యార్థులకు నిర్మాణాత్మక శిక్షణను అందించడం లక్ష్యంగా పెట్టుకుందని, వారు డివిజనల్ మరియు ఇంటర్‌డివిజనల్ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆశా వర్మ మాట్లాడుతూ.. పిల్లలలో సంగీతం, సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇది దోహదపడుతుందన్నారు.



## లాలాగూడ సెంట్రల్ ఆసుపత్రిలో న్యూట్రీషన్ మాసం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లాలా గూడలోని సెంట్రల్ హాస్పిటల్ 'మెరుగైన జీవితం కోసం సరిగ్గా తినండి' అనే థీమ్‌తో న్యూట్రీషన్ మంత్ జరుపుకుంది. దీనిలో భాగంగా శుక్రవారం సెంట్రల్ హాస్పిటల్‌లో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల రాజారాం సమక్షంలో ఒక సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో లాలా గూడలోని సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ. శివ నాగ ప్రసాద్, ఇతర సీనియర్ వైద్యులు, నర్సులు, కుటుంబ నియంత్రణ సిబ్బంది, రోగులు మరియు విద్యార్థులు, దాదాపు 200 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన వంట కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలి

**ప్రజాపక్షం/ములుగు:** మధ్యాహ్న భోజన వంట కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ములుగు, మల్లంపల్లి మండలాల సంయుక్త సమావేశం జరిగింది.

# నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదే




### తెలంగాణసాయుధ పోరాటంపై మాట్లాడే హక్కు బిజెపికి లేదు

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ స్పష్టంచేశారు. సిపిఐ నాయకత్వం వహించిన తెలంగాణ సాయుధ పోరాటం గురించి మాట్లాడే నైతిక హక్కు ఇవాళ బిజెపికి లేదన్నారు. చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధికోసం వెంపర్లాడుతున్న కాషాయ పార్టీ అత్యుత్సాహాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, సరైన సమయంలో తగు బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యాన జరిగిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, సీనియర్ నేతలు పి.ప్రేంపావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.చాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి. స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు ఎండి.సలీం, కాంపల్లి శ్రీనివాస్, సమితి సభ్యులు ఆరుట్ల రాజుకుమార్‌లతో కలిసి ఇ.టి.నరసింహ మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనలో వెట్టి చాకిరి, అణచివేతను నిరసిస్తూ భూస్వాముల ఆరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన ఘన చరిత్ర సిపిఐదేనన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నడిపి, ప్రజలను చైతన్యవంతులను చేసిందన్నారు. ఫలితంగా ప్రజలంతా బందూకులు, గుత్పలు చేబూని భూస్వామ్యుల మెడలు వంచేలా ఉద్యమించారని తెలిపారు. మహత్తరమైన సాయుధ పోరాటంలో 4,000 మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. వెట్టిచాకిరీ వ్యవస్థ రద్దుకు, ప్రజల హక్కుల సాధనకు సాగిన ఈ మహోజ్వలమైన ఉద్యమ చరిత్ర సువర్ణాక్షరాలతో లిఖించదగిందని స్పష్టంచేశారు.

**10 లక్షల ఎకరాల భూపంపిణీ**

ఒకవైపు 3000పైగా గ్రామాలను నిజాం నియంతృత్వ పాలన నుంచి విముక్తి కల్పిస్తున్న సిపిఐ నాయకత్వం మరోవైపు భూమి లేని పేదలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచిందని ఇ.టి.నరసింహ తెలిపారు. ఈ క్రమంలోనే కౌలు రైతులు తాము సాగు చేసుకొంటున్న భూములపై హక్కుదారులుగా గుర్తించబడ్డారని పేర్కొన్నారు. ఇంతటి సాహసం, అమరత్వంతో కూడిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ఎలాంటి సంబంధం లేని బిజెపి ఇవాళ హిందూ, ముస్లిం మధ్య జరిగిన సంఘర్షణగా చిత్రీకరిస్తున్నదని మండిపడ్డారు. భవిష్యత్తుతరాలకు ఇలాంటి తప్పుడు చరిత్రను అందిస్తే తెలంగాణ ప్రజలు సహించబోరని హెచ్చరించారు. భూస్వాముల ప్రయోజనాలు కాపాడుకోవడంకోసం, ప్రజలపై అణచివేత కొనసాగించడానికే రజాకార్ల సైన్యాన్ని ఏర్పాటు చేసుకొన్నారని తెలిపారు.

**ఘన చరిత్రను వక్రీకరిస్తే ఉధృత పోరాటం**

మహోజ్వల చరిత్ర కలిగిన తెలంగాణ సాయుధ పోరాటంపై తప్పుడు వ్యాఖ్యాలు చేస్తూ, మత విద్వేషాలు రెచ్చగొడితే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఇ.టి.నరసింహ తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే వెట్టిచాకిరీ రద్దు, భూసంస్కరణ చట్టం అమలైందని తెలిపారు. సమావేశంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### కోయ సంప్రదాయాల ప్రకారమే..

## సమ్మక్క, సారలమ్మ గద్దెల ఆధునీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సమ్మక్క, సారలమ్మ గద్దెలు ఆధునీకరణ చేయాలని మంత్రులు కొండాసురేఖ, పొగులేటి శ్రీనివాస్‌రెడ్డి,ధనసరి అనసూయ సీతక్కలు అధికారులను ఆదేశించారు. మేడారం సమ్మక్క సారక్క మాస్టర్ ప్లాన్ ను వంద రోజుల్లో పూర్తి చేసేందుకు రాష్ట్ర మంత్రులు శుక్రవారం సచివాలయంలో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, సీఎం ప్రిన్సి పల్ శ్రీనివాసరాజు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ హాజరయ్యారు. మాస్టర్ ప్లాన్ లో సిఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు మార్పులు చేర్పులపై ముగ్గురు మంత్రులకు ఎండోమెంట్ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక దేవాలయ ప్రతినిధులు వివరించారు. డిజైన్ మార్పుపై ప్రతీ అంశాన్నీ మంత్రులు లోతుగా అడిగి తెలుసుకున్నారు. డిజైన్ మార్పుపై వస్తున్న ఆరోపణలను నమ్మవద్దని వారు సూచించారు. కోయ సంప్రదాయ ప్రకారమే మార్పులు చేర్పులు చేస్తున్నామని మంత్రులు తెలిపారు.

## పంట బీమా పథకం అమలు చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన ద్వారా పంట బీమా పథకం అమలుకు కృషి చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షులు పాకాల శ్రీహరిరావు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సిఎం ఎ.రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు లేఖలు రాశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇందుకోసం కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ నుండి అనుమతి పొందడం గానీ, లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం యొక్క స్వంత పంట బీమా విధానాన్ని రూపొందించాలని ఆయన సూచించారు. ఇప్పటికే ఖరీఫ్ 2025 సీజన్ నిమిత్తం పంట బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని విన్నవించారు. వ్యవసాయ రంగంలో వరుస నష్టాలతో బాధపడుతు. రైతులు ప్రైవేట్ అప్పుల భారంతో దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, రబీ 202526 నుండి రాష్ట్రంలో పంట నష్టం నుంచి రక్షణ కల్పించడానికి రైతులకు పంట బీమా అందించడం అత్యవసరం అని అన్నారు.

## కార్మికుల పక్షాన 'టిబిజికెఎస్' ఎందుకు పోరాటం చేయడం లేదు




కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిబిజికెఎస్ (బిఆర్‌ఎస్‌కు అనుబంధం ) నాయకులు అవినీతి చేయవద్దని తాను గతంలోనే అనేక సార్లు చెప్పినప్పటికీ, ఆ నాయకులు స్వార్థంతో అవినీతికి పాల్పడ్డారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, హెచ్‌ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రస్తుతం కెసిఆర్ అధికారంలో లేరని, సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపైన టిబిజికెఎస్ నాయకులు ఎందుకు పోరాటం చేయడంలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్,బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో హెచ్‌ఎంఎస్ సింగరేణి జాగృతి సంయుక్త సమావేశం( ఎబి సింగరేణి మైన్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశం) జరిగింది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి సంస్థలో అవినీతి రాజ్యమేలుతోందని, దీనిపైన సిబిఐకి ఫిర్యాదు చేస్తామన్నారు. అవినీతిని కట్టడి చేయకుంటే సింగరేణి భవన్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రతిక్షణం కార్మికుల కోసం క్షేత్ర స్థాయిలో ఉన్న కార్మిక సంఘమే గుర్తింపు ఎన్నికల్లో గెలుస్తుందని కవిత అన్నారు. గతంలో సింగరేణి కార్మికుల రిటైర్‌మెంట్ వయోపరిమితి పెంచుకోలేకపోయామని, దీనికి పరిష్కారంతో పాటు మెడికల్ బోర్డును తెచ్చుకునేందుకు పోరాటం చేయాలన్నారు. ఇదిలా ఉండగా సమావేశనంతరం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి సిఎండి బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దసరా పండగాకు ముందే సింగరేణి సంస్థ లాభాల్లో కార్మికులకు 35 శాతానికిపైగా వాటా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్‌-1 ఉద్యోగాలపై హైకోర్టు తీర్పు అమలు చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** గ్రూప్–1 ఉద్యోగాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లినా ఇదే తీర్పు వస్తుందని, అనవసరంగా జాప్యం చేయకుండా, మళ్లీ పరీక్షలు నిర్వహించాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ దొర్నాల కొండల్, నీలం వెంకటేశ్ సంయుక్త అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. టిజిపిఎస్‌సి నిర్వాకం వల్ల గ్రూప్–1 ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అవకతవకలు జరిగాయని హైకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రత్మకమైందన్నారు. ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో, రాజకీయ పలుకుబడి ఉన్న వారి పిల్లలకు లబ్ధి చేకూర్చడానికే, కోట్ల రూపాయల అవినీతికి పాల్పడేందుకే ఈ పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు తెలుస్తున్నదన్నారు. అనర్హులతో, పూర్తిస్థాయి పరిజ్ఞానం లేని వారితో పేపర్లు దిద్దించి, వాల్యుయేషన్ చేయించారని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 60 పేపర్లు దిద్దాల్సి న వారితో 200 పేపర్లు దిద్దించారని, ఇలా మూల్యాంకనంలో ఘోర తప్పిదాలు జరిగాయని తెలిపారు. తెలుగు మీడియం అభ్యర్థులకు తక్కువ మార్కులు వేశారని, తక్కువ నిష్పత్తితో పాసయ్యారని, మోడరేషన్స్ చేయలేదన్నారు. కొన్ని పరీక్షా కేంద్రంలో ఎక్కువ మంది, మరికొన్ని పరీక్షా కేంద్రాల్లో తక్కువ మంది పాసయ్యారన్నారు. గ్రూప్–1 తప్పిదాలపై సమగ్ర న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని కోరారు. సమావేశంలో సంఘం నేతలు వేముల రామకృష్ణ, నంద గోపాల్, పి.యాదగిరి, చంద్రమౌళి, విష్ణు మోదీ రాందేవ్, పగిళ్ల సతీశ్ పాల్గొన్నారు.

### గణపతి నిమజ్జన ఊరేగింపుపైకి

# దూసుకెళ్లిన ట్రక్కు

### 8 మంది మృతి, మరో 20 మందికి గాయాలు

### కర్నాటకలోని హసన్ జిల్లాలో ఘటన




**బెంగళూరు :** కర్నాటకలో విషాదం జరిగింది. శుక్రవారం రాత్రి హసన్ జిల్లాలోని ఒక గ్రామంలో గణపతి నిమజ్జన ఊరేగింపుపైకి ట్రక్కు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా, 20 మందికి పైగా గాయపడ్డారని పోలీసు వర్గాలు తెలిపాయి. గణేష్ చతుర్థి వేడుకల చివరి రోజు రాత్రి 8.45 గంటల ప్రాంతంలో మోసలే హోసహల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. మృతులలో ఎక్కువ మంది యువకులు అని ఆ వర్గాలు తెలిపాయి. 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని, వారిని చికిత్స కోసం హసన్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారని ఆ వర్గాలు తెలిపాయి. అరకలగూడు నుండి వస్తున్న ట్రక్కు అదుపు తప్పి భక్తులపైకి దూసుకెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. లారీ చక్రం కింద చిక్కుకుని దాదాపు నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు అని గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేస్తూ, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి మాట్లాడుతూ, 'హాసన్ తాలూకాలోని మోసలే హోసహళ్లిలో గణపతి నిమజ్జన ఊరేగింపు సందర్భంగా జరిగిన ఘోర ప్రమాదంలో అనేక మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారనే వార్త విని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. 'గణపతి ఊరేగింపులో పాల్గొన్న వారిపై ట్రక్కు దూసుకెళ్లడంతో భక్తులు ప్రాణాలు కోల్పోవడం నాకు చాలా బాధగా ఉంది. ఇది చాలా విషాదకరమైన సంఘటన' అని అన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కూడా ఆయన ఆకాంక్షించారు.

## ఆదర్శ నాయకుడు సీతారామ్ ఏచూరి

### తొలి వర్ధంతి సందర్భంగా సిపిఐ(ఎం)అగ్రనాయకుల ఘననివాళి



**న్యూఢిల్లీ :** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) పూర్వ ప్రధానకార్యదర్శి దివంగత సీతారామ్ ఏచూరి తొలి వర్ధంతి సందర్భంగా శుక్రవారం సిపిఐ(ఎం) ముఖ్యనేతలు నివాళులు అర్పించారు. సిపిఐ(ఎం) జాతీయ ప్రధానకార్యదర్శి ఎం.బేబి, మాజీ ప్రధానకార్యదర్శి ప్రకాష్ కారట్, హన్నన్ మొల్లాహ్ సీతారామ్ ఏచూరికి జోహార్లు నినాదాల మధ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీతారామ్ ఏచూరి మరణించి ఒక ఏడాది అయ్యింది అంటే మేం ఇంకా నమ్మలేకపోతున్నాం. ప్రస్తుత రాజకీయ దృశ్యంలో సీతారామ్ ఏచూరి అవసరం ఎంతగానో ఉందనే విషయాన్ని మనకు గుర్తుచేస్తోంది' అని ఏచూరికి నివాళులు అర్పించిన అనంతరం ప్రసంగించిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బేబి నొక్కిచెప్పారు. సైద్ధాంతిక, రాజకీయ, సంస్థాగత ఫ్రంట్ ఏర్పాటులో సిపిఐ(ఎం) అగ్రనాయకుడుగా సీతారామ్ ఏచూరి ఆదర్శ నాయకత్వం దేశానికి, పార్టీ నిర్మాణానికి ఎంతో ఉపయోగపడిందన్నారు.సిపిఐ(ఎం) అభివృద్ధిలో, దేశవ్యాప్తంగాపార్టీ నిర్మాణంలో ఆయన కృషి అనితరసాధ్యం అన్నారు. గత సంవత్సరం జరిగిన సభలో కాంగ్రెస్ ముఖ్యనాయకుడు, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఇండియా కూటమి ఏర్పాటులో సీతారామ్ ఏచూరి పాత్ర వెలకట్టలేనిదని గుర్తుచేశారని బేబి తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్‌బిజెపి వ్యతిరేకంగా సిపిఐ(ఎం) ఐక్య పోరాటాన్ని సృష్టించడంలో ఏచూరి కృషి మరువలేనిదన్నారు.

## సాంకేతిక, విద్యారంగాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

### అన్ని పాఠశాలల్లో ఎఐ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలి


### ప్రజా ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత

### పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాటారం:** సాంకేతిక, విద్యారంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో 2 కోట్ల 30 లక్షలతో నిర్మించిన కేజీవిబి జూనియర్ కళాశాల భవన ప్రారంబోత్సవం, మండలంలోని వివిధ గ్రామాల్లో 70 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రహదారుల నిర్మాణానికి, 72 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడి భవనాలు, 7 గ్రామ పంచాయతీల్లో రూ.1 కోటి 40 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని పాఠశాలల్లో యుద్ధ ప్రాతిపదికన ఏఐ లాబ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు ఒక ప్లాన్ ప్రకారం ప్రతి రోజు ఏదో ఒక పుస్తకం ఖచ్చితంగా చదవాలని, చదివిన చదువు తప్పక ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగ పడుతుందన్నారు. గ్రామంలో ఒక్కరు చదువుకున్నా వారు మాత్రమే కాకుండా మొత్తం గ్రామమే బాగుపడుతుందని తెలిపారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## నేటి నుంచి విజయ్ ప్రచారయాత్ర

చెన్నై: 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) నాయకుడు, ప్రముఖ సినీనటుడు విజయ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సిద్ధమయ్యారు. ఈనెల 13నుంచి రోజుకు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున ప్రచారం చేయనున్నారు. విజయ్ పర్యటనకు భద్రత కల్పించాలని కోరుతూ టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఇటీవల డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 13న తన మొదటి విడత పర్యటనకు తిరుచ్చి సమీపంలోని శ్రీరంగం నుంచి విజయ్ శ్రీకారం చుట్టనున్నారు. 13న తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు నియోజకవర్గాలు, 20న నాగప్టణం, తిరువారూరు, మైలాడుదురై, అక్టోబర్ 4, 5న కోవై, నీలగిరి, తిరుప్పూరు, ఈరోడ్, అక్టోబర్ 11న కన్యాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, 12న కాంచీపురం, వేలూరు, రాణిపేట నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. అక్టోబర్ 25న దక్షిణ చెన్నై, చెంగల్పట్టు, నవంబర్ 1న కష్ణగిరి, ధర్మపురి, తిరుపత్తూరు, 8న తిరువణ్ణామలై, కళ్లకురిచ్చి, విల్లుపురం, 15న తెన్‌కాశి, విరుదునగర్, 22న కడలూరు, 29న శివగంగ, రామనాథపురం నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. డిసెంబర్ 6న తంజావూరు, పుదుకోట, 13న సేలం, నామక్కల్, కరూరు, 20న దిండుగల్, తేని, మదురై నియోజకవర్గాలలో పర్యటిస్తారు.

# ఎట్టకేలకు మణిపూర్‌కు మోదీ

### జాతుల ఘర్షణల తర్వాత తొలిసారి ఈశాన్య రాష్ట్రానికి ప్రధాని
### 3గంటల పర్యటనతో ఏం సాధిస్తారంటూ కాంగ్రెస్ విమర్శ



ఇంఫాల్: జాతుల మధ్య ఘర్షణలతో రావణకాష్టంలా మారిన ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటించనున్నారు. జాతుల ఘర్షణలు ప్రారంభమై రెండున్నరేళ్లు గడిచినప్పటికీ మోదీ అక్కడ పర్యటించకపోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శిస్తున్న సంగతి విదితమే. ఈక్రమంలో ఆయన అక్కడ పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మోదీ పర్యటనపై చాలా రోజులుగా ప్రచారం జరుగుతున్నా ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునీత్ కుమార్ గోయల్... శనివారం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు ప్రధాని చురాచంద్‌పూర్‌లో ఘర్షణల్లో నిరాశ్రయులైన వారిని కలుసుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం రూ.7వేల 300 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తారన్నారు. అనంతరం పీస్‌గ్రౌండ్‌లో మణిపూర్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని వివరించారు. తర్వాత రాజధాని ఇంఫాల్ వెళ్లి అక్కడ రూ.12 వందల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మైతేయ్ కుకీ తెగల మధ్య జరిగిన ఘర్షణల్లో చురాచంద్‌పుర్ తీవ్రంగా నష్టపోయింది. 260 మందికి పైగా ఇక్కడ మృతిచెందగా... వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. సెప్టెంబర్ 1315 మధ్య మోదీ మిజోరాం, మణిపూర్, అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్‌లలో పర్యటిస్తారు. కాగా మోదీ మణిపూర్ పర్యటనను కాంగ్రెస్ విమర్శించింది. ఇప్పటికైనా మోదీ పర్యటించడం సంతోషించదగ్గ విషయమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయితే ఇన్నేళ్లు రణరంగంగా మారిన మణిపూర్‌లో మోదీ కేవలం 3 గంటలు మాత్రమే పర్యటించడం ఆరాష్ట్రాన్ని అవమానించడమే అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కీషమ్ మేఘచంద్ర ఒక వీడియో సందేశంలో మాట్లాడుతూ... ''ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను నేను కేవలం ప్రచారం కోసమేనని భావిస్తున్నాను. సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్న నిరాశ్రయులైన వ్యక్తులతో సహా నెలల తరబడి బాధపడుతున్న ప్రజలు శాంతి, పునరావాసం , న్యాయం కోసం ఒక నిర్దిష్ట రోడ్‌మ్యాప్‌ను ఆశిస్తున్నారు'' అన్నారు. ఈపర్యటన రాష్ట్రంలో శాంతి, న్యాయం తీసుకురావడానికి సంబంధించినదని వారు తెలియజేసి ఉంటే బాగుండేదన్నారు. ప్రధాని మోదీ ఇక్కడ అన్నివర్గాల వారితో చర్చించేందుకు సమయం కేటాయించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మణిపూర్‌కు చెందిన ఏకైక రాజ్యసభ సభ్యుడు లీషెంబా సనాజోబా మోదీ పర్యటనను అదృష్ట క్షణంగా అభివర్ణించారు. ''మోదీ ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను వినడం గొప్ప అదృష్టం... మణిపూర్‌లో గతంలో హింసాత్మక ఘర్షణల చరిత్ర ఉంది... ఇలాంటి సమయాల్లో ఏ ప్రధానమంత్రి కూడా రాష్ట్రాన్ని సందర్శించి ప్రజల మాట వినలేదు'' అని చెప్పుకొచ్చారు. కాగా, జాతీయ రహదారులపై ప్రయాణించే మెయితీల భద్రతను నిర్ధారించేలా ప్రధానమంత్రి అధికారులను ఆదేశించాలని ఇమాగి మెయిరా అనే మహిళా బందం డిమాండ్ చేసింది. ప్రముఖ కుకిజో గ్రూపులు ప్రధాని మణిపూర్ సందర్శనను స్వాగతించాయి. హింస కారణంగా మణిపూర్‌లో ఇప్పటివరకు 260 మందికి పైగా మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ప్రస్తుతం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన అమల్లో ఉండగా, అసెంబ్లీని సుప్తచేతనావస్థలో ఉంచారు.

### ప్రధాని పర్యటన వేళ బిజెపికి భారీ షాక్.. 43మంది నేతల రాజీనామా

మణిపూర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సిద్ధమవుతున్న తరుణంలో రాష్ట్ర భారతీయ జనతా పార్టీ (బిజెపి)లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధిష్ఠానం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉఖ్రుల్ జిల్లాలోని ఫుంగ్యార్ నియోజకవర్గంలో43 మంది స్థానిక నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా తమ పదవులకు రాజీనామా చేశారు. పార్టీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై తీవ్రఆందోళన చెందుతున్నామని రాజీనామా చేసిన నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్గత సంప్రదింపులు, కలుపుగోలుతనం లోపించాయని, క్షేత్రస్థాయి నాయకత్వాన్ని ఏ మాత్రం గౌరవించడం లేదని వారు ఆరోపించారు. పార్టీ సిద్ధాంతాలకు తాము కట్టుబడి ఉన్నామని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కొనసాగలేమని స్పష్టం చేశారు. రాజీనామా చేసిన వారిలో ఫుంగ్యార్ మండల అధ్యక్షుడు, మహిళా, యువ, కిసాన్ మోర్చాల అధ్యక్షులు, కొందరు బూత్ స్థాయి అధ్యక్షులు కూడా ఉన్నారు. ఈ మూకుమ్మడి రాజీనామాలపై మణిపూర్ బిజెపి రాష్ట్ర విభాగం తీవ్రంగా స్పందించింది. ఇదంతా కేవలం పబ్లిసిటీ కోసం చేస్తున్న స్టంట్ అని, పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుంగ్ షిమే పెంగ్‌సన్ కొట్టిపారేశారు. ''రాజీనామా చేసిన వ్యక్తులు 2022 అసెంబ్లీ ఎన్నికల నుంచే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకే ఈ చర్యకు పాల్పడ్డారు'' అని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు.

### రాజకీయ పార్టీల కోసం నియమ, నిబంధనలు రూపొందించడానికి...

# ఇసిని ఆదేశించేందుకు 'సుప్రీం' ఓకె

### కేంద్రం, ఎన్నికల సంఘం, భారత న్యాయ కమిషన్‌కు నోటీసులు జారీ
### అన్ని రాజకీయపార్టీలను ఇంప్లీడ్ చేసుకోవాలని పిటిషనర్‌కు సూచించిన ధర్మాసనం




న్యూఢిల్లీ : లౌకికవాదం, పారదర్శకత, రాజకీయ న్యాయాన్ని ప్రోత్సహించడానికి రాజకీయ పార్టీల నమోదు, నియంత్రణ కోసం నియమాలను రూపొందించడానికి ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు అంగీకరించింది. పిటిషనర్ అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిగణనలోనికి తీసుకున్న న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కేంద్రానికి, ఎన్నికల సంఘానికి, భారత న్యాయ కమిషన్‌లకు నోటీసులు జారీచేసింది. జస్టిస్ సూర్యకాంత్ నోటీస్ జారీచేయడానికి మొగ్గు చూపినప్పటికీ, ఈ పిటిషన్‌లో ఏ రాజకీయ పార్టీ ప్రమేయం లేదని ఎత్తి చూపారు. 'మీరు ఏదో నియంత్రించమని అడుగుతున్నారని వారు చెబుతారు. కానీ వారు ఇక్కడ లేరు' అని ధర్మాసనం పిటిషనర్ ఉపాధ్యాయను ఉద్దేశించి అన్నారు. ఎన్నికల సంఘంలో నమోదు చేసుకున్న అన్ని జాతీయ పార్టీలను ఇంప్లీడ్ చేసుకోవాని ధర్మాసనం పిటిషనర్ ఉపాధ్యాయ్‌కు సూచించింది. అశ్వినికుమార్ ఉపాధ్యాయ్ తన పిటిషన్‌లో 'నకిలీ రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించడమే కాకుండా కఠినమైన నేరస్తులు, కిడ్నాపర్లు, డ్రగ్ స్మగ్లర్లు, మనీలాండరింగ్ చేసే వారిని జాతీయ, రాష్ట్ర ఆఫీస్ బేరర్లుగా నియమించి వారి నుండి పెద్ద మొత్తంలో డబ్బుతీసుకుని దేశానికి అపకీర్తిని తెస్తున్నాయ్' అని పేర్కొన్నారు. 'రాజకీయ పార్టీలకు ఎటువంటి నియమ నిబంధనలు లేవు. అందువల్ల చాలామంది వేర్పాటువాదులు విరాళాల కోసం తమ రాజకీయ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ పార్టీల కొంత మంది ఆఫీస్ బేరర్లు పోలీస్ రక్షణను కూడా పొందారు' అని ఉపాధ్యాయ్ తన పిటిషన్‌లో తెలిపారు. 'ఇటీవలి మీడియా నివేదికను ప్రస్తావిస్తూ ఆదాయపు పన్ను శాఖ 20శాతం కమిషన్ తగ్గించడం ద్వారా డబ్బును తెల్లగా మారుస్తున్న ఒక నకిలీ రాజకీయ పార్టీని కనుగొన్నది. పనిచేసే పార్టీలలో పారదర్శకత, జవాబుదారీ తనం ప్రజా ప్రయోజనాలకు చాలా అవసరం. ఎందుకంటే అవి ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా కాబట్టి భారత ఎన్నికల సంఘం వారి కోసం నియమాలు, నిబంధనలను తప్పకుండా రూపొందించాలి' అని పిటిషనర్ పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది అశ్వినీ కుమార్ దూబే ద్వారా తెలియజేశారు. ప్రజాజీవితంలో పారదర్శకత, నిజాయితీకి సంబంధించి సుప్రీం కోర్టు వివిధ సంస్కరణలను ప్రారంభించిందని పిటిషన్ పేర్కొంది. రాజ్యాంగ పరిధిలో రాజకీయ పార్టీలను నియంత్రించే చర్య బలమైన ప్రజాస్వామ్య పనితీరుకు మార్గం సుగమం చేస్తుందని పిటిషన్ తెలిపింది. ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చెందిన దేశాల ఉత్తమ పద్ధతులను పరిశీలించి,రాజకీయాలలో అవనీతి, నేరారోపణను తగ్గించడానికి రాజకీయ పార్టీల నమోదు, నియంత్రణపై సమగ్ర నివేదికను సిద్ధం చేసేలా భారత న్యాయ కమిషన్‌ను ఆదేశించాలని పిటిషన్ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది.

## కొత్తగా మళ్లీ కులగణన: సిద్ధరామయ్య



బెంగళూరు: రాష్ట్రంలో మళ్లీ కొత్తగా కులగణన చేపట్టనున్నట్లు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. గతంలో ఇచ్చిన నివేదికను అంగీకరించబోమని, సెప్టెంబరు 22 నుంచి అక్టోబర్ 7 మధ్య మళ్లీ కులగణన చేపడతామని వెల్లడించారు. గతంలో చేపట్టిన కులగణన సమాచారం దాదాపు పదేళ్ల కిందటిదని, ప్రస్తుతం సమాజంలోని వాస్తవాలు తెలుసుకోవడానికి కొత్తగా సర్వే అవసరమన్నారు. 'సమాజంలో అనేక కులమతాలతో పాటు సామాజిక అసమానతలు కూడా ఉన్నాయి. దేశంలోని ప్రజలంతా సమానమేనని, ప్రజలందరికీ సమాన సామాజిక న్యాయం జరగాలని రాజ్యాంగం చెబుతోంది. దాని ప్రకారమే ప్రజల మధ్య అసమానతలు తొలగించి ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు 'సృష్టించే దిశగా ముందడుగు వేయడానికి మేము నిర్వహించే నూతన సర్వే ఉపయోగపడుతుంది' అని సిద్ధరామయ్య తెలిపారు. 2015లో కర్నాటక వెనకబడినవర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే.

## ట్రంప్ సుంకాలతో ఉద్యోగాలకు ఎసరు : థరూర్



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు భారత్‌పై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. ఇప్పటికే అనేక మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని చెప్పారు. ట్రంప్ వ్యవహారశైలి, స్వభావం పూర్తి గందరగోళంగా ఉందని మండిపడ్డారు. సింగపూర్‌లో క్రెడాయ్ ఏర్పాటు చేసిన సమావేశంలో శశిథరూర్ మాట్లాడుతూ సంప్రదాయ దౌత్య ప్రమాణాలను ట్రంప్ గౌరవించడం లేదన్నారు. 'ట్రంప్ కన్నా ముందు 44 లేదా 45 మంది అధ్యక్షులుగా పనిచేసినప్పటికీ... వైట్‌హౌస్ నుంచి ఈ రకమైన ప్రవర్తన ఎన్నడూ చూడలేదు. ఏ రకంగా చూసినా ఆయన అసాధారణ అధ్యక్షుడు. సంప్రదాయ దౌత్య ప్రమాణాలను ఆయన గౌరవించడం లేదు. నోబెల్ శాంతి బహుమతికి అర్హుడనని ఏ దేశాధినేత అయినా చెప్పడం విన్నామా? ప్రపంచంలోని అన్ని దేశాలు మా వద్దకే వచ్చి మోకరిల్లుతాయని చెప్పడం విన్నామా? భారత్, రష్యాలవి మృత ఆర్థిక వ్యవస్థలని చెప్పడం ఎప్పుడైనా విన్నామా? ఓ దేశాధ్యక్షుడి నుంచి వినిపించకూడని భాష ఇది. అందుకే ఆయనో అసాధారణ వ్యక్తి. ట్రంప్ ప్రవర్తన ద్వారా మా పని తీరును నిర్ణయించవద్దు' అని దాదాపు 1000 మందికిపైగా రియల్ ఎస్టేట్ డెవలపర్లు, కన్సల్టెంట్‌లు పాల్గొన్న సమావేశంలో శశిథరూర్ విజ్ఞప్తి చేశారు. 'సుంకాల ప్రభావం భారత్‌పై చూపిస్తోంది. ఇప్పటికే అనేక మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. సూరత్‌లోనే ముత్యాలు, ఆభరణాల వ్యాపారంలో 1.35 లక్షల మందికి లేఆఫ్‌లు విధించారు. సముద్రపు ఆహారం, తయారీ రంగంలోనూ ఈ ప్రభావం కనిపిస్తోంది. టారిఫ్‌ల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది. అనేక ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోయాయి. అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించడం కష్టంగా మారింది' అని థరూర్ చెప్పారు. అయితే, అమెరికాతో భారత్ సంప్రదింపులు కొనసాగిస్తుండటం మంచి పరిణామమేనన్నారు.

## అటవీ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న అదానీ ప్రాజెక్టు

### జైరాం రమేశ్ ఆరోపణ



న్యూఢిల్లీ: మధ్య ప్రదేశ్‌లోని ధీరౌలిలో అదానీ గ్రూప్ తన బొగ్గు గని ప్రాజెక్టు కోసం ప్రభుత్వ, అటవీ భూమిలోని చెట్లను నరికివేయడం ప్రారంభించిందని, ఇదిఅటవీ హక్కుల చట్టాన్ని 'స్పష్టంగా ఉల్లంఘించిందని' కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ శుక్రవారం ఆరోపించారు. మోదీ ప్రభుత్వం 2019లో ఈ కేటాయింపు చేసిందని, ఇప్పుడు 2025లో అవసరమైన చట్టపరమైన అనుమతులు లేకుండానే దానిని ముందుకు తీసుకువెళుతోందని మాజీ పర్యావరణ మంత్రి పేర్కొన్నారు. 'ఇది కేవలం మోదానీ తనకు తానుగా ఒక చట్టం అయినందున' అని 'ఎక్స్' పోస్ట్‌లో విమర్శించారు. అయితే కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై అదానీ గ్రూప్ లేదా కేంద్రం నుంచి వెంటనే ఎటువంటి స్పందన రాలేదు. 'మధ్య ప్రదేశ్‌లోని ధీరౌలిలో మోదానీ తన బొగ్గు గని కోసం ప్రభుత్వ, అటవీ భూమిలోని చెట్లను నరికివేయడం ప్రారంభించింది. రెండవ దశ అటవీ అనుమతి లేకుండా ఎఫ్ఆర్ఎ2006, పీఈఎస్ఏ1996 ను స్పష్టంగా ఉల్లంఘించింది. గ్రామస్తులు, ఎక్కువగా షెడ్యూల్డ్ తెగ వర్గాలు, ముఖ్యంగా దుర్బల గిరిజన సమూహం (పీవీటీజీ) కూడా నిరసన తెలుపుతున్నారు' అని ఆయన తెలిపారు. బొగ్గు బ్లాక్ ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోకి వస్తుందని, ఇక్కడ గిరిజన హక్కులు, స్వపరిపాలన నిబంధనలు రాజ్యాంగబద్ధంగా రక్షించబడ్డాయి' అని జైరాం రమేశ్ ఎత్తి చూపారు. 'ఈ రక్షణలను విస్మరించారు. పంచాయతీల (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం1996లోని నిబంధనలు, గ్రామ సభ సమ్మతిని తప్పనిసరి చేస్తూ సుప్రీం కోర్టు తీర్పులు ఇచ్చినప్పటికీ, గ్రామసభలు ఎటువంటి సంప్రదింపులు జరపలేదు' అని ఆయన ఆరోపించారు. అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం అటవీ భూమిని అటవీయేతర ప్రయోజనాల కోసం మళ్లించడంపై గ్రామసభలు నిర్ణయం తీసుకోవాలి. అయితే ఈ కేసులో గ్రామసభ ఆమోదాలు దాటవేయబడినట్లు కనిపిస్తున్నాయి' అని తెలిపారు. 'మోదానీ చెట్ల నరికివేత చేపట్టినప్పటికీ, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మం త్రిత్వ శాఖ నుంచి రెండవ దశ అనుమతి ఇంకా ఆమోదించబడలేదు' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ప్రాజెక్టుల ద్వారా గతంలో తొలగించబడిన కుటుంబాలు ఇప్పుడు మళ్లీ బహిష్కరణను ఎదుర్కొంటున్నాయి. ఇది డబుల్ స్థానభ్రంశం అని ఆయన అన్నారు. మహువా, టెండు, మందులు, ఇంధన కలప అన్నీ ఈ ప్రాజెక్టు అమలుతో అదశ్యమవుతాయని, ఇది ఆదివాసీ వర్గాల జీవనోపాధిపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందన్నారు. అడవులు కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, అవి స్థానిక ఆదివాసీ చాలా పేలవమైన పర్యావరణ ప్రత్యామ్నాయం' అని పేర్కొన్నారు. ఇదిలాఉండగా, ఈ నెల ప్రారంభంలో మధ్య ప్రదేశ్‌లోని సింగ్రౌలి జిల్లాలోని ధీరౌలి గనిలో మైనింగ్ కార్యకలాపాలను ప్రారంభించడానికి బొగ్గు మంత్రిత్వశాఖ ఆమోదం పొందినట్లు అదానీ పవర్ తెలిపింది.

## దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమే నిర్ణయాలు

### పెట్టుబడిదారుల సదస్సులో సిఎం స్టాలిన్



చెన్నై: స్టాలిన్ అంటేనే 'మేన్ ఆఫ్ స్టీల్' అనేలా తాను తీసుకునే నిర్ణయాలన్నీ దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించే విధంగానే ఉంటాయని, అంతే కాకుండా కార్యసాధనలో తనకు పట్టుదల ఎక్కువేనని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. హోసూరులో శుక్రవారం జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ఆయన మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివద్ధి చెందుతున్న కష్ణగిరి జిల్లా హోసూరు వద్ద 2 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం నెలకొల్పనున్నట్లు ప్రకటించారు. గతంలో హోసూరు చిన్న వాణిజ్య నగరంగా ఉండేదని, ప్రస్తుతం ఈ నగరంలో ఫ్యాక్టరీలు ప్రారంభించేందుకు దేశవిదేశాల నుండి పారిశ్రామికవేత్తలు వస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలోనే 5 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో ఐటీ పార్క్ ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. ఇటీవల జర్మనీ, ఇంగ్లండ్ దేశాల్లో పర్యటించి రూ.15,516 కోట్ల మేర విదేశీ పెట్టుబడులు సమీకరించగలిగానని, ఆ సంతోషంతోనే హోసూరులో పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సదస్సులో రూ.26 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేలా పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవటం సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా ఎనిమిదివేల మందికి ఉపాధి కలిగించేలా రూ.1600 కోట్లతో చేపట్టనున్న నాలుగు పథకాలకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో తమ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల్లో 77 శాతం మేర కొత్త కర్మాగారాలు ఏర్పాటయ్యాయని, ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీల్లో విస్తరణ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక, వాణిజ్యశాఖ అధ్వర్యంలో హోసూరులో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం 53 సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రముఖ కంపెనీలు రూ.23,303.15కోట్ల మేరకు పెట్టుబడులతో కొత్త ఫ్యాక్టరీలు నెలకొల్పి 44,870 మందికి ఉపాధిఅవకాశాలు కల్పించనున్నాయి. ఎంఎస్ఎంఇ శాఖ అధ్వర్యంలో రూ.10,003.85 కోట్లతో 4483 మందికి ఉపాధి కల్పించేలా 39 ఒప్పందాలు కుదిరాయి. ఈ మొత్తం రూ.24,307 కోట్ల పెట్టుబడులతో 92 ఒప్పందాలతో 49,353 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

### ఎడిఆర్ సహవ్యవస్థాపకుడు

# జగదీప్ చోకార్ మృతి

న్యూఢిల్లీ : అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సహ వ్యవస్థాపకుడు, ఎన్నికల సంస్కరణల కోసం పోరాడే న్యాయవాది జగదీప్ ఎస్ చోకర్ శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఆయనకు 80 సంవత్సరాలు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)అహ్మదాబాద్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ అయిన చోకర్... 1999లో తన సహచరులతో కలిసి ఏడీఆర్‌ను స్థాపించారు. భారత రాజకీయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి, అభ్యర్థుల సమాచారాన్ని తప్పనిసరిగా బహిర్గతం చేయడం, ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేయడం వంటి మైలురాయి వంటి న్యాయ జోక్యాలకు ఆయన నాయకత్వం వహించారు. అభ్యర్థులు తమ క్రిమినల్ కేసులు, ఆస్తులు, విద్యార్హతలను వెల్లడించడాన్ని తప్పనిసరి చేస్తూ 2002లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు, అలాగే ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేస్తూ 2024లో ఇచ్చిన తీర్పు వాటిలో ఉన్నాయి. నవంబరు 25, 1944న జన్మించిన చోకర్ విద్యారంగంలోకి వెళ్లే ముందు భారత రైల్వేలలో తన కెరీర్‌ను ప్రారంభించాడు. ఆయన ఢిల్లీ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ స్టడీస్ ఫ్యాకల్టీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. తరువాత అమెరికాలోని లూసియానా స్టేట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఆయన 1985లో ఐఐఎం అహ్మదాబాద్‌లో చేరి 2006లో పదవీ విరమణ చేసే వరకు సంస్థాగత ప్రవర్తన రంగంలో బోధించారు. చోకర్ ఐఐఎంఅహ్మదాబాద్‌లో తన పదవీకాలంలో డీన్, డైరెక్టర్ ఇన్ ఇంఛార్జ్‌గా పనిచేశారు. ఆయన మృతికి అనేక మంది రాజకీయ ప్రజా వర్గాలు సంతాపం తెలిపాయి. ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ అశోక్ లావాసా 'ఎక్స్' వేదికగా సంతాపం తెలిపారు. 'ప్రొఫెసర్ జగదీప్ చోకర్ మరణం విషాదకరం. ఎన్నికల ప్రజాస్వామ్యం ఉన్నత ప్రమాణాలను కొనసాగించడంలో గొప్ప సేవ చేసిన అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్‌కు ఆయన నాయకత్వం వహించారు. మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషి మాట్లాడుతూ 'ఏడీఆర్ వ్యవస్థాపకుడు జగదీప్ చోకర్ మరణించారని తెలిసి చాలా బాధగా ఉంది. స్వచ్ఛమైన ఎన్నికలు, ఎన్నికల సంస్కరణల కోసం పోరాడిన ఆయన తన శరీరాన్ని వైద్య పరిశోధన కోసం దానం చేశారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలన్నారు. చోకర్ మరణాన్ని 'భారత ప్రజాస్వామ్య సమగ్రత కోసం అవిశ్రాంతంగా మాట్లాడిన మనస్సాక్షి నిశ్శబ్దం' గా ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా అభివర్ణించారు. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి శ్రద్ధ వహించే వారందరికీ చెందే అసంపూర్ణమైన పని' అని ఝా అన్నారు. కార్యకర్త, సెఫాలజిస్ట్ యోగేంద్ర యాదవ్ చోకర్‌ను 'ప్రజాస్వామ్యం, ప్రజా ప్రయోజనాల కోసం నిజంగా నిస్వార్థ విజేత' అని అభివర్ణించగా, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆయన మరణాన్ని 'దేశంలో ప్రజాస్వామ్యానికి తీరని లోటు' అని తెలిపారు. తణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరికా ఘోష్ చోకర్‌ను 'ప్రజాస్వామ్యం కోసం అలుపెరుగని, ధైర్యవంతుడైన యోధుడు' అని అభివర్ణించింది. సుభాషిణి అలీ, తీస్తా సెతల్వాద్, షబ్నమ్ హష్మి సహా అనేక మంది చోకర్ మృతికి విచారం వ్యక్తం చేశారు.

# ఢిల్లీకే పరిమితమెందుకు?

### బాణసంచా నిషేధంపై సుప్రీం ప్రశ్న



న్యూఢిల్లీ: కాలుష్యాన్ని కట్టడి చేసే విధానాలు ఏవైనా ఢిల్లీకి మాత్రమే పరిమితం కావని శుక్రవారం సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో వాయుకాలుష్యం ప్రమాదకర స్థాయిలోనే ఉన్నందున బాణసంచా విక్రయాలను నిషేధిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 3న తీర్పునిచ్చింది. దీనికి సంబంధించి దాఖలైన పిటిషన్లపై తాజాగా విచారణ జరిగింది. 'ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన గాలి పీల్చుకునే హక్కు ఉన్నప్పుడు మిగతా వారికి ఉండదా? పాలసీ ఏదైనా పాన్‌ఇండియా లెవెల్‌లోనే ఉండాలి. ప్రముఖ వ్యక్తులు ఉన్నారని దిల్లీకి మాత్రమే విధానాలు రూపొందించబోం' అని కోర్టు వ్యాఖ్యలు చేసింది. 'గతేడాది శీతాకాలంలో నేను అమత్‌సర్ వెళ్లాను. అక్కడ దిల్లీ కంటే దారుణంగా కాలుష్యం ఉంది. బాణసంచాపై నిషేధం విధించామంటే అది దేశమంతా అమలవ్వాలి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అన్నారు. అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ మాట్లాడుతూ ప్రముఖులు తమను తాము రక్షించుకుంటారు. కాలుష్యం సమస్యగా మారినప్పుడు వారు ఢిల్లీ నుంచి ఇతర ప్రాం తాలకు వెళతారని పేర్కొన్నారు.

### సుప్రీంకోర్టులో సెల్ఫీలు, రీల్స్ నిషేధం

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై సుప్రీంకోర్టులో నిషేధం విధించారు. హై సెక్యూర్టీ జోన్‌లో ఫొటోలు, వీడియోలు తీయడం ఇక చెల్లదు. ఒకవేళ ఎవరైనా ఈ నియమావళి ఉల్లంఘిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. కోర్టు సెక్రటరీ జనరల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఆదేశాలు లాయర్లు, ఫిర్యాదుదారులు, ఇంటర్న్‌లు, న్యాయ క్లర్క్‌లు, స్టాఫ్, విజిటర్స్‌కు వర్తించనున్నాయి. కేవలం అధికార కార్యక్రమాలకు మాత్రమే ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అనుమతించనున్నారు. కెమెరాలు, ట్రైపాడ్లు, సెల్ఫీ స్టిక్‌లు, మొబైల్ ఫోన్ల ద్వారా వీడియోలు, రీల్స్ చేయడాన్ని సుప్రీంకోర్టులో నిషేధించారు. హై సెక్యూర్టీ జోన్‌లో ఉన్న లాన్ ఏరియా కూడా నిషేధ ప్రదేశం కిందకు వస్తుంది. మీడియా వ్యక్తులు కూడా తమ ఇంటర్వ్యూలు, లైవ్ బ్రాడ్‌కాస్ట్‌లు... నిర్దేశితలో సెక్యూర్టీ జోన్ నుంచి చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా రిపోర్టర్ ఆ నియయావళి ఉల్లంఘిస్తే, అతనికి హై సెక్యూర్టీ జోన్‌లో నెల రోజుల పాటు నిషేధం విధించనున్నారు. ఆదేశాలు ఉల్లంఘించే అడ్వకేట్లు, ఇంటర్న్‌లు, న్యాయ సిబ్బందిని సంబంధిత బార్ అసోసియేషన్లకు ఫిర్యాదు చేస్తారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. హై సెక్యూర్టీ జోన్‌లో ఎవరు ఫొటోలు, వీడియోలు తీసినా వారిని అడ్డుకునే అధికారం సెక్యూర్టీ సిబ్బందికి ఉంటుంది.

### జర్నలిస్టులను బెదిరించినా, తిట్టినా, కొట్టినా...రూ.50 వేల జరిమానా

దేశంలోని వర్కింగ్ జర్నలిస్టులు, పాత్రికేయులను బెదిరించినా, తిట్టినా లేదా కొట్టినా రూ.50 వేల జరిమానాతోపాటు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షకు అర్హులవుతారని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు గురువారం ఓ కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ తీర్పుపై జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. తమ వత్తిపరంగా ఎలాంటి భయాందోళనకు గురికాకుండా నిర్భయంగా ప్రజలకు వాస్తవ సమాచారం అందించే అవకాశం ఉంటుందని పలు జర్నలిస్టు సంఘాల నేతలు తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు ఈ తీర్పును ఆహ్వానించారు. రాజకీయ నాయకుల నుండి రక్షణగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఉన్నదని పలువురు జర్నలిస్టులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## కంగనకు 'సుప్రీం'లో ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ: బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనావత్... తనపై నమోదైన నేరపూరిత పరువునష్టం కేసు కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, ట్రయల్ కోర్టుకు వెళ్లాలని కంగనాకు సూచించింది. దాంతో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. 2021లో దిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతుల ఆందోళన సందర్భంగా మహిందర్ కౌర్ అనే వద్ధ మహిళను కించపర్చేలా రీట్వీట్ చేశారు. ఆమె రూ.100 కిరాయికి వస్తుందని తన రీట్వీట్‌లో పేర్కొన్నారు. దాంతో మహిందర్ కౌర్ పరువునష్టం కేసు వేశారు. దాంతో కౌర్ ఫిర్యాదును కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కంగనా ముందుగా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆమె పిటిషన్‌ను తోసిపుచ్చడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఆమెకు చివాట్లు పెట్టింది. 'మీ వ్యాఖ్యలకు అర్థం ఏమిటి. మీది అంత సులువైన రీట్వీట్ కాదు. మీరు మీ సొంత వ్యాఖ్యలు చేశారు. మసాలా జోడించారు' అని జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. దాంతో తన క్లయింట్ ఆ రీట్వీట్‌పై స్పష్టత ఇచ్చారని కంగనా తరపు న్యాయవాది కోర్టు దష్టికి తీసుకెళ్లగా... ఆ స్పష్టత ట్రయల్ కోర్టుకు ఇవ్వండని ధర్మాసనం సూచించింది. కంగనా పంజాబ్‌కు వెళ్లే పరిస్థితి లేదని న్యాయవాది చెప్పగా... వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరవచ్చని కోర్టు పేర్కొంది. న్యాయవాది మరేదో వాదన చేయబోతుండగా... 'ఆమె ట్వీట్‌పై మా స్పందన కోరే ప్రయత్నం చేయకండి' అని న్యాయస్థానం ఘాటుగా వ్యాఖ్యానించింది.

## బస్సు లోయలో పడి ఐదుగురి మృతి

లక్నో: రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఐదుగురు దుర్మరణం చెందిన విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. హర్దోయ్ నుంచి లక్నో వైపు వెళ్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు కాకోరి ప్రాంతంలో బ్రిడ్జి పైనుంచి 40 అడుగుల లోతైన లోయలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనలో ఐదురుగు ప్రయాణికులు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కాకోరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.

# ఓటమిలో గెలుపు

భారత ఉపరాష్ట్రపతి పదవికి జరిగిన ఎన్నికల్లో తెలంగాణ బిడ్డ, రాజ్యాంగ నిపుణుడు, న్యాయ కోవిదుడైన సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని విజయం వరించలేదు. వాస్తవంలో ఆయన ఓడినా గెలిచినట్లే. ఎవరూ ఊహించని విధంగా ఏ పార్టీకి సంబంధం లేని సుదర్శన్ రెడ్డి ఇండియా కూటమి మద్దతుతో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేశారు. బరిలో నిలిచిన నాడే గెలిచేంత సంఖ్యాబలం లేదని ఆయనకూ తెలుసు. కానీ, రాజ్యాంగ విలువల పరిరక్షణకై తాను పోటీకి సిద్ధమైనట్లు ఆయన స్పష్టం చేశారు. ఆయన పలు రాష్ట్రాలలో వివిధ రాజకీయ పక్షాల నాయకులు, ఎంపిలను మద్దతు కోసం కలుస్తూ దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న కీలక సవాళ్ళను లేవనెత్తారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రత, ఓటు హక్కు వంటి వర్తమాన అంశాలపై వ్యక్తమవుతున్న సందేహాలు ఆయన మాటల్లో ప్రస్ఫుటమయ్యాయి.

అయితే, సుదర్శన్ రెడ్డి పోటీ చేస్తున్నట్లు ప్రకటించిన వెంటనే ఉప రాష్ట్రపతి ఎన్నిక మునుపెన్నడూ లేనంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. అన్ని రాజకీయ పార్టీలతో పాటు, ప్రజలు కూడా ఆయనను గంభీరమైన అభ్యర్థిగానే స్వీకరించారు. ఇది గమనించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా సల్వాజుడుం రద్దు చేయాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా తీర్పునివ్వడం ద్వారా జస్టిస్ సుదర్శన్ రెడ్డి నక్సలిజంకు సహకరించారంటూ ఆత్మరక్షణలోకి నెట్టి వేసేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. ఈ మాటల దాడికి ఏ మాత్రం వెరవకుండా, అది సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పే తప్ప తనది కాదని సుదర్శన్‌రెడ్డి దీటుగా స్పందించారు. ఈ అంశం న్యాయ వ్యవస్థలో కూడా ప్రకంపనలు సృష్టించింది. కేంద్ర హోం మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ 18 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు ప్రకటన చేయగా, దానికి వ్యతిరేకంగా 50 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు ప్రకటన చేయడం పోటీని మరింత రసవత్తరం చేసింది.

**ప్రజాపక్షం**
**13-09-2025, శనివారం**

మరో ఆసక్తికరమైన అంశమేమిటంటే ఆయన ప్రత్యర్థి, ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్‌ను సంభాషణకు ఆహ్వానించడం. ఆయన ముందుకు రానప్పటికీ జస్టిస్ సుదర్శన్ రెడ్డి తొణకు, బెణుకులేకుండా రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం ప్రచారాంశాలుగా ఎంపిలకు రాజకీయాలకు అతీతంగా విజ్ఞప్తి చేశారు. తనది జాతీయవాదం ఎజెండా అని రాధాకృష్ణన్ ఉద్ఘాటించారు. మొత్తానికి ఉపరాష్ట్రపతి ఎన్నిక ఇరు శిబిరాల మధ్య సైద్ధాంతిక పోరుగా నిలిచింది.

సెప్టెంబర్ 9న జరిగిన ఎన్నికలో 767 ఓట్లు పోలయ్యాయి. ఎన్‌డిఎ తరుపు అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ 452 ఓట్లు సాధించి, 300 ఓట్లు సాధించిన బి.సుదర్శన్‌రెడ్డిపై విజయం సాధించారు. ప్రతిపక్షాలు తమకు వస్తాయనుకున్న ఓట్లలో 15 ఓట్లు తగ్గగా, అంతే మొత్తం చెల్లని ఓట్లు పోలవడం గమనార్హం. దాని వెనుక అధికార పార్టీ మంత్రాంగం ఉందనే గుసగుసలు వినవస్తున్నాయి. పోలింగ్ మేనేజ్‌మెంట్‌లో దిట్టయిన బిజెపి... బిఆర్‌ఎస్, బిజెడి, అకాలీదళ్ పార్టీలను ఓటింగ్‌కు దూరంగా ఉండేలా చేసిందనేది స్పష్టమే. ప్రత్యేక తెలంగాణ మద్దతుదారునిగా జస్టిస్ రెడ్డి ఏనాడు తన అభిమతాన్ని దాచుకోలేదు. అలాంటి వ్యక్తికి ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఓటు వేసే అరుదైన అవకాశాన్ని విస్మరించిన బిఆర్‌ఎస్ తీరుపై తెలంగాణ సమాజంలో సహజంగానే వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

ఉప రాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి విజయం సాధించలేకపోయినప్పటికీ, ఆయన పోటీ దేశ రాజకీయ యవనికపై బలమైన ముద్రవేసింది. ఆయనకు మద్దతు ప్రకటించిన ఇండియా కూటమికి చాలా కాలం తరువాత దేశ ప్రజల ఎదుట ఐక్యతను చాటేందుకు ఈ ఎన్నిక వేదికైంది. అలాగే బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్రతను కబళిస్తున్న తీరును చర్చనీయాంశంగా మార్చడంలో ప్రతిపక్ష పార్టీలు సఫలమయ్యాయి. అలాగే ఉప రాష్ట్రపతి పదవికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డియే సముచిత అభ్యర్థి అనే భావన సర్వత్రా వ్యక్తమైంది.

భారత 15వ ఉపరాష్ట్రపతిగా సి.పి.రాధాకృష్ణన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు ఆ పదవిలో ఉన్న జగ్‌దీప్ ధన్‌ఖడ్ మూడేళ్ళ పదవీ కాలం మిగిలి ఉండగానే రాజీనామా చేశారు. అందుకు అనారోగ్యాన్ని కారణంగా రాజీనామా లేఖలో పేర్కొనప్పటికీ, జస్టిస్ వర్మ అభిశంసనకు ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసునే ఆయన ముందుగా స్వీకరించడం పట్ల ప్రభుత్వ అధినాయకత్వం ఆగ్రహం అనేది అసలు కారణమనేది లోగుట్టు. అయితే, గత ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్ష అభ్యర్థికి 26 శాతం ఓట్లు లభించగా, ఈసారి ఎన్నికలో అది 40 శాతానికి పెరిగింది.

ప్రతిపక్షంతోనే ప్రజాస్వామ్యానికి పరిపూర్ణత అనే మౌలికాంశాన్ని కొత్త ఉపరాష్ట్రపతి విస్మరించబోరని ఆశిద్దాం.

---

## బ్రిక్స్, యుఎన్ సమావేశాలకు...

# మోదీ డుమ్మాకు కారణమేమిటి?



నిత్య చక్రవర్తి

సెప్టెంబర్ 1న జారీ అయిన ఎస్‌సిఒ డిక్లరేషన్, జూలై 6న జారీ అయిన బ్రిక్స్ ప్రకటనకు తాను చేసిన వాగ్దానాల నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనక్కి తగ్గుతున్నారా? ఈ చర్యల ద్వారా ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు, భారతదేశం–అమెరికా సంబంధాల లో పరస్పర సహకారాన్ని పునరుద్ధరించడంపై ఏదైనా సంకేతాలు పంపుతున్నారా? ఈ ప్రశ్న చాలా సందర్భోచితమైనది. ఎందుకంటే భారత ప్రధాని ఇటీవల తీసుకున్న నిర్ణయాలను పరిశీలిస్తే, ఆయన సెప్టెంబర్ 8న జరిగిన వర్చువల్ బ్రిక్స్ సదస్సుకు గైర్హాజరయ్యారు. అంతేకాకుండా, ఈ నెల చివరలో జరగబోయే ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి కూడా హాజరు కావడం లేదు.

అమెరికా అధ్యక్షుడు ఏకపక్షంగా సుంకాలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ ట్రంప్ సుంకాల యుద్ధంతో ప్రభావితమైన దేశాలు, వాటిలో ముఖ్యంగా దక్షిణ భూగోళ దేశాలు ఉమ్మడి వైఖరి తీసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలో ఈ రెండు సంఘటనలు చాలా ముఖ్యమైనవి. బ్రిక్స్‌లోని రెండు ప్రధాన సభ్య దేశాలు భారతదేశం, బ్రెజిల్ ట్రంప్ సుంకాల కారణంగా తీవ్రంగా నష్టపోయాయి. వారి ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం విధించింది. 2025లో బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపట్టిన బ్రెజిల్ అధ్యక్షుడు సెప్టెంబర్ 8న బ్రిక్ అగ్రనాయకుల వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. భారత ప్రధానితో సహా బ్రిక్స్ సభ్యులందరూ సంతకం చేసిన బ్రిక్స్ డిక్లరేషన్‌కు ఈ సమావేశం కొనసాగింపుగా జరిగింది.

వర్చువల్ సమావేశంలో భారతదేశం, ఇథియోపియా మినహా అన్ని దేశాల అధినేతలు పాల్గొన్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కార్యాచరణ ప్రణాళికను సూచించడంలో తమ వంతుగా పెద్ద ఎత్తున సహకారాన్నిఅందించారు. భారతదేశం తరపున మన విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ హాజరయ్యారు. అయితే, ఇతర దేశాల తరుపున దేశాధినేతలు హాజరైనందున ఆయనను ఎవరూ పట్టించుకోలేదు.

డాక్టర్ జైశంకర్ ఎప్పటిలాగే భౌగోళిక సవాళ్ళపై ఒక అకడమిక్ ఉపన్యాసం చేశారు. అమెరికా నిర్ణయానికి వ్యతిరేకంగా ఉమ్మడి చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయన చాలా అరుదుగా ప్రస్తావించారు. వాణిజ్య చర్యలకు వ్యాణిజ్యేతర అడ్డంకులకు ముడిపెట్టడంపై మాత్రమే ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా అమెరికా అధ్యక్షుడి ఇటీవలి చర్యలను చూచాయిగా చెప్పినప్పటికీ, తక్షణ చర్యలు గురించి ప్రస్తావించకుండా, భౌగోళిక వాణిజ్య సమస్యలపై ఇచ్చిన ఉపన్యాసంలో ఇది కలిసిపోయింది.

జైశంకర్ మాట్లాడుతూ 'నేడు వాణిజ్య విధానాలు,అందుబాటులో మార్కెట్ వంటివి భౌగోళిక ఆర్థిక చర్చలలో ప్రముఖ సమస్యలుగా ఉన్నాయి. ప్రపంచానికి సుస్థిర వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి నిర్మాణాత్మక, సహకార విధానాలు అవసరం. ఆటంకాలను పెంచడం,లావాదేవీలను సంక్లిష్టం చేయడం ఉపయోగపడదు.' అని అన్నారు. సాధారణ భౌగోళిక వాణిజ్య పరిస్థితులలో ఇది ఒక మంచి ప్రసంగం. కానీ, 2025లో డొనాల్డ్ ట్రంప్ చర్యల ఫలితంగా ప్రస్తుత పరిస్థితి సాధారణమైనది కాదు. ఆ సవాలును ఎలా ఎదుర్కోవాలనే తక్షణ సమస్యలను పరిష్కరించడానికి డాక్టర్ జైశంకర్ ప్రసంగంలో ఎటువంటి నిర్దిష్ట సూచన లేదు.

అంతేకాకుండా, ఆయన బ్రిక్స్ అంతర్గత సమస్యను కూడా ప్రస్తావించారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య ప్రవాహాలను సమీక్షించడం ద్వారా బ్రిక్స్ ఒక ఉదాహరణగా నిలబడగలదని ఆయన అన్నారు. భారతదేశం విషయానికొస్తే, మన అతిపెద్ద లోటులలో కొన్ని బ్రిక్స్ భాగస్వాములతోనే ఉన్నాయి . వాటికి త్వరితగతిన పరిష్కారాలు కనుగొనాలని మేము ఒత్తిడి చేస్తున్నాము. ప్రస్తుత సమయంలో జరిగిన వర్చువల్ బ్రిక్స్ సమావేశంలో ఈ అంశాన్ని నివారించి ఉండవచ్చు. ఈ సమావేశం

> *భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన విశాలమైన దేశం, ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ట్రంప్‌తో ఆయన విధానాల గురించి భారతదేశం ఏమనుకుంటుందో చెప్పే ధైర్యం ప్రధానికి ఉండాలి. సమావేశాలు జరుగుతాయి. అవి విభేదాలతో ముగియవచ్చు, కానీ స్నేహితులు, శత్రువుల తో సంభాషణ కొనసాగాలి. బహుశా నరేంద్ర మోదీ ఈ పాత సూత్రాన్ని మరచిపోయారేమో!*

సుంకాలపై అమెరికా చర్యలను, రాజకీయ సమస్యలను వాణిజ్యానికి ముడిపెట్టడాన్ని ఎదుర్కోవడానికి తక్షణ వ్యూహాన్ని రూపొందించడానికి పిలవబడింది. అది భారతదేశం ప్రసంగంలో ప్రధాన అంశం అయి ఉండాలి, కానీ అది అలా జరగలేదు.

చైనా అధ్యక్షుడు అమెరికా చర్యను సుంకాల యుద్ధంగా అభివర్ణించారు. బ్రెజిల్ అధ్యక్షుడు, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సుంకాల బెదిరింపులను ఎదుర్కోవడానికి ఉమ్మడి చర్యలు తీసుకోవాలని సూచించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా ట్రంప్ పేరు ప్రస్తావించకుండా కఠినమైన పదాలను ఉపయోగించారు. వర్చువల్ సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ గైర్హాజరును ప్రధానంగా బ్రెజిల్ సహా, ఇతర బ్రిక్స్ సభ్యులు గమనంలోకి తీసుకున్నారు. ఎందుకంటే వచ్చే ఏడాది బ్రెజిల్ అధ్యక్షుడు లూలా బ్రిక్స్ అధ్యక్ష పదవిని నరేంద్ర మోదీకి అప్పగిస్తారు. 2026లో భారతదేశం బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ వర్చువల్ సదస్సును మోదీ దాటవేయడం ఇతర బ్రిక్స్ సభ్యులలో కొంత అపార్థాలకు దారితీసింది. ఎందుకంటే ఆయన ఆగస్టు 31, సెప్టెంబర్ 1తేదీల్లో తియాన్‌జిన్‌లో జరిగిన ఎస్‌సిఒ సదస్సులో, అంతకుముందు జూలై 6 – 7 తేదీలలో రియో డి జనీరోలో జరిగిన బ్రిక్స్ సదస్సులో చాలా చురుకుగా పాల్గొన్నారు.

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం విషయానికొస్తే, యుఎన్ సెషన్ సెప్టెంబర్ 23న ప్రారంభమై సెప్టెంబర్ 30 వరకు కొనసాగుతుంది. భారత ప్రధానికి సెప్టెంబర్ 26న ప్రసంగించేందుకు సమయం కేటాయించబడింది. అదే రోజు చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు కూడా సర్వసభ్య సమావేశంలో ప్రసంగించడానికి సమయాలు కేటాయించబడ్డాయి. ఇలాంటి కీలక సమయంలో దేశాధినేతలు తమ దేశం, ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై తమ వైఖరిని తెలియజేయడానికి ఐక్యరాజ్యసమితి వేదికను వినియోగించుకుంటారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెప్టెంబర్ 23న ఐక్యరాజ్య సమితి సమావేశంలో ప్రసంగిస్తారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు డాక్టర్ ముహమ్మద్ యూనుస్ ఖచ్చితంగా హాజరవుతారు.


పాకిస్థాన్, బంగ్లాదేశ్ రెండూ ప్రధాన సమస్యలపై తమ వైఖరిని తెలియజేస్తాయి. పాకిస్థాన్ భారతదేశంతో ఉన్న సమస్యల గురించి కచ్చితంగా ప్రస్తావిస్తుంది. భారతదేశం తరపున డాక్టర్ జైశంకర్ ప్రాతినిధ్యం వహిస్తారు. కానీ ఆయనకు సెషన్ చివరిలో సమయం లభిస్తుంది. అప్పటికి ఆయన చెప్పేది ఎవరూ వినరు. పాకిస్థాన్ ప్రధాని, బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు ఇద్దరూ నరేంద్ర మోదీ గైర్హాజరును పూర్తిగా ఉపయోగించుకుని, భారతదేశానికి వ్యతిరేకంగా ఒకే వైపు నుంచి విషయాలను వ్యక్తపరుస్తారు. దీనిని సవాలు చేసే అవకాశం లేకుండా పోతుంది. ప్రధాని మోదీ హాజరై ఉంటే, అసలు అసెంబ్లీ షెడ్యూల్ ప్రకారం ఆయన సెప్టెంబర్ 26న ప్రసంగించే మొదటి వ్యక్తి అయి ఉండేవారు. చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాధినేతలందరికీ ఆయన తర్వాత సమయాలు ఇవ్వబడ్డాయి.

అయితే, చాలా కీలకమైన ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశాన్ని దాటవేయాలని నరేంద్ర మోదీ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటి? ఒక కారణం, మొదటి రోజు నుండి సమావేశంలో ఉండే అమెరికా అధ్యక్షుడిని కలవడం ప్రధాని నరేంద్ర మోదీ నివారించాలనుకోవచ్చు. అమెరికా మీడియా కథనాలు నిజమైతే, ట్రంప్ చేసిన ఫోన్ కాల్స్‌కు ప్రధాని స్పందించడం లేదు. ఈ విధంగా దౌత్యం నడపబడదు. ట్రంప్ మాట్లాడాలనుకుంటే ఆయనతో మాట్లాడి, భారతదేశం వైఖరిని స్పష్టంగా చెప్పాలి. దాగుడుమూతల వైఖరి అవసరం లేదు. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన విశాలమైన దేశం, ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ట్రంప్‌తో ఆయన విధానాల గురించి భారతదేశం ఏమనుకుంటుందో చెప్పే ధైర్యం ప్రధానికి ఉండాలి. సమావేశాలు జరుగుతాయి. అవి విభేదాలతో ముగియవచ్చు, కానీ స్నేహితులు, శత్రువులతో సంభాషణ కొనసాగాలి. బహుశా నరేంద్ర మోదీ ఈ పాత సూత్రాన్ని మరచిపోయారేమో!.

(ఐపిఎ సర్వీస్)

---

# షాంఘై నిర్ణయాలు భవిష్యత్తుకు దిక్సూచిగా ఉండాలి



వి.యస్.బోస్
సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు
9391356527

ఆగస్టు 23, 2025న చైనా దేశంలోని సముద్ర ప్రాంతమైన తియాన్‌జెన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ 25వ వార్షిక సమావేశం సరైన సమయంలో జరిగిందని భావించవచ్చు. సమావేశంలో జరిగిన చర్చలు, నిర్ణయాలు ప్రస్తుతానికి సముచితంగా ఉన్నాయి. వాటి అమలు ఏ రకంగా జరుగుతుందో వేచి చూడాలి. ఆ సమావేశంలో ఇండియా నుండి పాల్గొన్న ప్రధాన మంత్రి మోదీ అటు పుతిన్‌తోను, ఇటు జిన్‌పింగ్‌తోను స్నేహ హస్తం అందించటం మన దేశానికి లాభం చేకూర్చే పరిణామం. చైనా– ఇండియా సరిహద్దు సమస్యను సానుకూలంగా చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని ఇరు దేశాలు అంగీకరించటంతో ఇరు దేశాల మధ్య శాంతి నెలకొంటుందని మరోసారి ఆశ చిగురించింది. జీవిత భాగస్వామిని నిర్ణయించుకునే అవకాశం వ్యక్తులకు ఉంటుంది కానీ సరిహద్దు దేశాలను నిర్ణయించుకునే అవకాశం ఏ దేశానికి ఉండదనేది వాస్తవం. కావున ఇండియా, చైనా ఒకరినొకరు గౌరవించుకుంటూ తమ ప్రజల అభ్యున్నతికి, ఇరుదేశాల అభివృద్ధికి సహకరించుకోవటం తప్ప మరోమార్గం లేదని ఇరుదేశాలు అర్థం చేసుకోవాలి. అలా చేయటం మూలంగా సైనిక ఖర్చులు తగ్గుతాయి, నిత్యం జరిగే కవ్వింపు చర్యలు లేకుండా పోవటమే కాకుండా తద్వారా, దేశాల మధ్య వ్యాపారం పెరిగి ప్రజల అవసరాలు తక్కువ ఖర్చుతో తీరే అవకాశం ఏర్పడుతుంది. పొరుగు దేశాలతో స్నేహం, శాంతి భావంతో ఉంటే జరిగే లాభం వివరించలేనంత ఎక్కువగా ఉంటుంది.

బ్రిక్స్ దేశాలతో పాటు ఇతర అనేక దేశాలు షాంఘై సహకార సంస్థలో స్వచ్ఛందంగా పాల్గొన్నాయి. బ్రిక్స్ దేశాల ఆర్థిక అవసరాలు తీర్చటానికి ఆ దేశాలు సమైక్యంగా ఒక బ్యాంక్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. అలాగే షాంఘై సహకార సంస్థ కూడా మరొక బ్యాంక్‌ను ఏర్పాటు చేయటానికి నిర్ణయం తీసుకోవటం హర్షించదగిన పరిణామం.

అమెరికా, యూరప్‌లోని పెట్టుబడి దేశాల నాయకత్వంలో ఏర్పడిన ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ద్రవ్యనిధి సంస్థ పెట్టుబడిదారులకు అనుకూలం గా వ్యవహరిస్తూ ఆర్థిక, సామాజిక ఒత్తిడిలతో వెనకబడిన, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అన్యాయం చేయటం మూలంగా షాంఘై సహకార బ్యాంక్, బ్రిక్స్ బ్యాంకులు ఇలాంటి దేశాలకు ఆశా కిరణంగా చూడబడతాయి. ఈ రెండు బ్యాంక్‌లు ప్రపంచ పీడిత ప్రజల అవసరాలను వారి దేశ స్వావలంబనకు ఏలాంటి భంగం కలగకుండా మార్గదర్శకంగా పనిచేస్తాయని ఆశిద్దాం. ప్రపంచ బ్యాంక్, ప్రపంచ ద్రవ్యనిధి సంస్థ పేరుకే ప్రపంచం కానీ ప్రపంచ ప్రజలతో వాటికి ఏలాంటి సంబంధం లేదు. ప్రపంచ బ్యాంక్ సంబంధం అంతా అమెరికా, యూరప్ దేశాల పెట్టుబడిదారుల వ్యాపారాలు, లాభాలు మాత్రమే ప్రధానంగా చూస్తాయి. అమెరికా, యూరప్ పెట్టుబడిదారులు ప్రపంచ బ్యాంక్ ద్వారా ఇతర దేశాల ప్రభుత్వాలపై రాజకీయ, వ్యాపార ఒత్తిడి పెంచి అన్యాయంగా తమకు అనుకూలంగా మార్చుకుంటాయి. దీని కొరకు ప్రపంచ బ్యాంక్ విధివిధానాలను నిర్ణయించి అమలు కోసం కృషి చేస్తుంది. ప్రపంచ ప్రజలను మోసం చేయటానికి సమాచార విప్లవంతో ప్రపంచమంతా ఒక గ్రామంలాగా ఏర్పడిందని, అన్ని దేశాలు ఒక్కటేనని ఎవరైనా ఎక్కడైనా వ్యాపారం చేసుకోవచ్చని సూక్తులు పలుకుతూ ప్రచారం చేస్తుంది. అమెరికా దాని మిత్ర దేశాలు తమకు రాజకీయంగా అనుకూలంగా లేని దేశాలపై అతిగా పన్నులు విధించటం ప్రపంచ బ్యాంక్ సూక్తులకు వ్యతిరేకం కాదా? ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం ఇండియాపై విధిస్తున్న 50శాతం పన్నులు ఏ కోవలోకి వస్తాయో ప్రపంచ బ్యాంక్ దాని అనుబంధ పెట్టుబడిదారులు చెప్పగలరా?

ప్రతి దేశం తమ దేశం ఏ రకంగా ఉండాలి, ఏ పద్ధతిలో నడవాలి, ఏలాంటి సౌకర్యాలు, హక్కులు ప్రజలకు ఇవ్వాలి అనే విషయాలు ఆ దేశంలోని ప్రజలకు, ప్రభుత్వాలకు సంబంధించిన విషయం. కానీ పెట్టుబడిదారులు నిర్వహించే ప్రపంచ బ్యాంక్‌కు తాను ఇచ్చే రుణాల నెపంతో కార్మిక, రైతు, విద్యుత్ చట్టాలు మార్చమని, ప్రజలకు ఇచ్చే సబ్సిడీలు తీసివేయమని, ప్రభుత్వరంగ సంస్థలు మూసివేయమని, ఉద్యోగుల సంఖ్య తగ్గించమని, మానవవనరులు అవసరమైతే తాత్కాలికంగా కాంట్రాక్ట్, ఇతర పద్ధతుల్లో పూరించుకొమ్మని, పని గంటలు పెంచమని చెప్పే అధికారం ఎవరు ఇచ్చారు. అలాంటి కుట్రలకు ఆదేశాలు ఇచ్చేది అమెరికా దాని మిత్ర దేశాల పెట్టుబడిదారులే అన్నది తేటతెల్లం. దీని కొరకు పేద దేశాలు, వెనుక బడిన దేశాలు బలవుతున్న విషయం జగమెరిగిన సత్యం. ప్రపంచ బ్యాంక్‌కు ప్రత్యామ్నాయంగా షాంఘై బ్యాంక్, బ్రిక్స్ బ్యాంక్‌లతో పాటు ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ లాంటి ప్రాంతీయ బ్యాంకులతో కలిసి బాధిత దేశాలకు మార్గదర్శకం వహించి, ప్రపంచ బ్యాంకులాగా దోపిడీనే ప్రధానం కాకుండా ప్రపంచ అభివృద్ధి ప్రధానంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని దేశాలకు అందుబాటులో ఉండేటట్లు చేస్తే ప్రపంచ ప్రజలు సంతోషిస్తారు, గర్విస్తారు. ప్రాంతీయ బ్యాంకులు ప్రపంచ బ్యాంక్‌కు ప్రత్యామ్నాయంగా నిలబడతాయని ప్రజల ఆకాంక్షను తీరుస్తాయని కోరుకుందాం.

యుద్ధాలకు పెట్టుబడిదారుల వ్యాపార విస్తరణ, లాభాపేక్షలే ప్రధాన కారణం. పాకిస్తాన్‌కు, ఇండియాకు ప్రతిసారీ ఏర్పడుతున్న ఉద్రిక్తతలకు, స్వల్పపాటి యుద్ధాలకు అమెరికా రాజకీయ స్వలాభమే కారణమని ఇరుదేశాలు అర్థం చేసుకొని ప్రవర్తించాలి. ఉక్రెయిన్‌కు, రష్యాకు జరుగుతున్న యుద్ధం కానీ, ఇజ్రాయిల్‌కు, పాలస్తీనాకు జరుగుతున్న యుద్ధం కానీ, అక్రమంగా ఇరాన్‌పై జరుగుతున్న దాడులకు కానీ అమెరికాదే పూర్తి పాత్ర. అమెరికా ప్రభుత్వం ఆ దేశంలోని ఆయుధాలు తయారు చేసే పరిశ్రమల చెప్పుచేతల్లో ఉంటుందని అందుకే అమెరికా యుద్ధాలను ప్రోత్సహిస్తుందని అర్థంచేసుకోవాలి. పాకిస్తాన్‌లో ఉగ్రవాదులకు ఆర్థిక సహకారం చేసింది కూడా అమెరికానే. ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ఉగ్రవాదులను ప్రోత్సహించింది అమెరికా. దానిని నిలువరించటంలో విఫలమై రెండు దశాబ్దాల తదుపరి ఆ దేశం నుంచి అర్థాంతరంగా అమెరికా వైదొలిగింది. ఇలాంటి సంఘటనలు ప్రపంచంలో అనేకం జరిగాయి. అబద్దాలు ప్రచారం చేసి ఇరాక్‌లో యుద్ధం సృష్టించి ఆ దేశాన్ని సర్వనాశనం చేయటంలో ప్రధాన పాత్ర అమెరికాదే. అనేక దేశాల్లో అమెరికా తనకు అనుకూలమైన కీలుబొమ్మ ప్రభుత్వాలు ఏర్పాటు కోసం మోసాలు చేయటం, యుద్ధం చేయటం అమెరికా విధానాల్లో ఒకటి. అదే అన్ని పెట్టుబడిదారి దేశాలు అనుసరించే విధానం. అందుకే అలాంటి దేశాలన్నింటికి అమెరికా నాయకత్వం వహిస్తున్నది.

యుద్ధాలు సమసిపోవాలన్నా, దోపిడీలేని ప్రపంచం ఏర్పడాలన్నా అమెరికా దోపిడీ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా ప్రపంచ రాజకీయాలు మారాలి. ప్రపంచ బ్యాంకుకు దీటుగా ప్రాంతీయ ఆర్థిక బ్యాంకులు పనిచేయాలని ప్రపంచం కోరుకుంటుంది. దీనికి షాంఘై సమావేశం సరైన మార్గం చూపుతుందని ప్రపంచం ఎదురుచూస్తున్నది.

చైనా, ఇండియా అరమరికలు లేని స్నేహాన్ని పెంచుకోవాలి. పాకిస్థాన్ అమెరికాపై ఉన్న భ్రమలను వదిలి అమెరికా చెప్పుడు మాటలు వినకుండా ఇండియాతో మంచి సంబంధాలు ఏర్పరుచుకోవాలి. ఇండియా పొరుగు దేశాలతో స్నేహ సంబంధాలు మెరుగుపర్చుకోవాలి. 140 కోట్ల జనాభా కల్గిన అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం, గతంలో అలీన దేశాలకు నాయకత్వం వహించిన గత చరిత్రను పాలకులు గుర్తుంచుకోవాలి. ప్రపంచ బ్యాంక్ విధానాలను, అమెరికా దౌర్జన్యాన్ని ఎదిరించి భారతదేశాన్ని ప్రగతిపథంలో నడపటానికి పాలకులు కృషి చేయాలి. దోపిడీ అణచివేతలే ఉగ్రవాదానికి మూలాలని అందరూ గ్రహించి అణచివేతలు, దోపిడీలు లేని సమాజం ఏర్పాటుకు కృషి చేయాలి.

---





**చలో చండీఘడ్**
**భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)**
**25వ కాంగ్రెస్**
**21-25 సెప్టెంబర్, 2025**
**చండీఘడ్ (పంజాబ్)**

## దేశంలో కొత్త పరిస్థితులు
## సిపిఐ 8వ కాంగ్రెస్, పట్నా, 1968

1967లో దేశంలో సరికొత్త, పరిస్థితి ఏర్పడింది. 1967 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గుత్తాధికారం కోల్పోయింది. లోక్‌సభలో మెజారిటీ లభించినా (1962లోని 361 సీట్ల నుంచి 283 సీట్లకు తగ్గుదల) అరడజను రాష్ట్రాల్లో ఓటమి చవిచూసింది. ఆ ఎన్నికలు 'రాజకీయ భూకంపం'గా పరిగణించబడ్డాయి. దేశంలో సంకీర్ణ రాజకీయ శకం ప్రారంభమైంది. 'ఆయా రాం – గయారాం' సంస్కృతి మొదలైంది.

దేశంలో ఆర్థిక దుస్థితితోపాటు ప్రజాకర్షక నాయకులు జవహర్‌లాల్ నెహ్రూ (1964), లాల్‌బహదూర్ శాస్త్రి (1966) మరణం కాంగ్రెస్‌ను బలహీనపరిచాయి. పాత కాంగ్రెస్ నాయకులు (సిండికేట్) ఇందిరాగాంధీని ప్రధానమంత్రిని చేశారు. బొమ్మలా ఆడించవచ్చనుకున్నారు. అయితే 1967 ఎన్నికల్లో సిండికేట్ ప్రముఖులు ఓడిపోవటంతో ఇందిరాగాంధీ స్వతంత్ర ప్రతిష్ట సముపార్జించుకుంటూ, పార్టీని తన నియంత్రణలోకి తీసుకునే ప్రయత్నం చేశారు.

1967 ఎన్నికల ఫలితాల పర్యవసానంగా బిహార్, పంజాబ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, కేరళ, మద్రాసు రాష్ట్రాల్లో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. బిహార్, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ వ్యతిరేక ప్రజాభిప్రాయం ఒత్తిడి కింద సిపిఐ కూడా జనసంఘ్‌తో కలిసి మంత్రివర్గాల్లో చేరవలసి వచ్చింది. ఆ ప్రభుత్వాలు రెండు, రెండున్నర సంవత్సరాల్లో అంతర్గత వైరుధ్యాలతో కూలిపోయాయి.

ఈ నేపథ్యంలో సిపిఐ 8వ కాంగ్రెస్ (జాతీయ మహాసభ) 1968 ఫిబ్రవరి 7–15 తేదీల్లో పట్నాలో జరిగింది. అంతకుముందు కాలంలో పార్టీ నిర్వహించిన ప్రజాపోరాటాలు, బంద్ ఉద్యమాలను మహాసభ సమీక్షించి అవి పార్టీ పెరుగుదలకు ఉపకరించాయని భావించింది. సిపిఐ, ఇతర ప్రతిపక్షాలు నిర్వహించిన ప్రజాఉద్యమాలు కాంగ్రెస్ గుత్తాధిపత్యం బద్దలుకొట్టటానికి తోడ్పడ్డాయని భావించింది. అయితే కాంగ్రెస్‌లో అధికారం కోసం సిండికేట్ కుయుక్తులు, కాంగ్రెస్ వెలుపల ఉన్న భూస్వామ్య అనుకూల మితవాదులచే స్వతంత్ర పార్టీ ఏర్పాటు, జనసంఘ్ బలం పుంజుకోవటం వల్ల మితవాద అభివృద్ధి నిరోధకుల నుంచి ప్రమాదం పెరుగుతున్నదని మహాసభ హెచ్చరిక చేసింది. ప్రజల ప్రజాతంత్ర సంఘటనను విస్తృతపరచటానికి కృషి చేయాలని నిర్ణయించింది.

ఎస్.ఎ.డాంగే చైర్మన్‌గా, సి.రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికైనారు.

## సిపిఐ 9వ కాంగ్రెస్ (కొచ్చిన్, 1971)

సిపిఐ 9వ కాంగ్రెస్ (కొచ్చిన్) నాటికి దేశ రాజకీయాలు సరికొత్త మలుపు తిరిగాయి. కాంగ్రెస్‌లో మితవాదులు, అతివాదుల మధ్య (సిండికేట్ vs ఇందిరాగాంధీ) జరుగుతున్న ఘర్షణ 1969లో కాంగ్రెస్‌లో చీలికకు దారితీసింది. రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారిక అభ్యర్థి నీలం సంజీవరెడ్డి నామినేషన్ పత్రంపై సంతకం చేసిన ప్రధాని ఇందిరాగాంధీ ప్రముఖ ట్రేడ్ యూనియనిస్టు వరాహగిరి వెంకటగిరి (వివిగిరి)ని ఇండిపెండెంట్‌గా రంగంలోకి తెచ్చింది. ఆత్మ ప్రబోధం ప్రకారం ఓటు చేయాలని కాంగ్రెస్ ఎంపిలు, ఎమ్మెల్యేలకు ఆమె విజ్ఞప్తి చేశారు. కమ్యూనిస్టులు గిరికి ఓటు చేశారు. గిరి విజయం చరిత్ర సృష్టించింది. దాంతో సిండికేట్‌గా పిలవబడుతున్న పాతతరం కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ (ఒ)గా ఏర్పడ్డారు. ఇందిరాగాంధీ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐ)కి ప్రాతినిధ్యం వహించారు. ఈ సంక్షోభకాలంలో ఇందిరాగాంధీ 14 బ్యాంకులు జాతీయం చేశారు. రాజభరణాలు రద్దు చేశారు. గరీబి హాతావో నినాదంతో పేదల్లో కొత్త ఆశలు చిగురింపచేశారు. భూ గరిష్ట పరిమితి తగ్గింపు చట్టాలు తెస్తామన్నారు. అభివృద్ధి నిరోధకులు – ప్రగతిశీల శక్తుల మధ్య సంఘర్షణ పదునెక్కింది. గుత్త పెట్టుబడిదారీ, ఫ్యూడల్ వ్యతిరేక శక్తిగా ఇందిరాగాంధీ తనను తాను ప్రజల ముందుంచుకున్నారు. అంతేగాక 1971 మార్చి 26 నుంచి డిసెంబర్ 16వరకు సాగిన బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటానికి భారత్ సైనిక తోడ్పాటు ఇచ్చి, విజయం సాధించటం ఇందిరాగాంధీ ప్రతిష్టను ఇనుమడింపజేసింది.

ఈ నేపథ్యంలో సిపిఐ 9వ కాంగ్రెస్ 1971 అక్టోబర్ 3–10 తేదీల్లో కొచ్చిన్ (కేరళ)లో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. అచ్యుతమీనన్ ముఖ్యమంత్రిగా 1969లో ఏర్పడిన సిపిఐ – కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం అప్పుడు అక్కడ అధికారంలో ఉంది. సిపిఐ మహాసభ రాజకీయ నివేదిక, రాజకీయ తీర్మానం, నిర్మాణ నివేదిక, అంతర్జాతీయ నివేదికలు ఆమోదించింది. కాంగ్రెస్ వ్యతిరేక లేదా కాంగ్రెసేతర సంఘటన అనే భావం ఏదైనా మితవాద అభివృద్ధి నిరోధకులకు మాత్రమే సహాయపడుతుందని మహాసభ ప్రకటించింది. జనసంఘ్–ఆర్‌ఎస్‌ఎస్ దేశానికి అతిపెద్ద ప్రమాదం అని పేర్కొన్నది.

ఎస్.ఎ.డాంగేను చైర్మన్‌గా, సి.రాజేశ్వరరావును ప్రధాన కార్యదర్శిగా మహాసభ ఎన్నుకుంది.

## 10వ కాంగ్రెస్ (విజయవాడ, 1975 )

ఈ మహాసభ 1975 జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు విజయవాడలో జరిగింది. 3,55,526 మంది సభ్యత్వానికి ప్రాతినిధ్యం వహిస్తూ 1246మంది ప్రతినిధులు హాజరైనారు.

ఇందిరాగాంధీ పరిపాలన, మితవాద కాంగ్రెస్ నాయకులు, మతవాదులు కలిసిచేస్తున్న కుట్రల గూర్చి మహాసభ రాజకీయ తీర్మానం విశ్లేషించింది. మితవాద మతవాద శక్తులను ఎట్టి పరిస్థితుల్లోను అధికారంలోకి రానివ్వబోమని చైర్మన్ డాంగే హెచ్చరించారు. సిపిఐ సంస్థాపన 50వ వార్షికోత్సవంపై మహాసభ తీర్మానం ఆమోదించింది. చివరి రోజున దాదాపు 5 లక్షలమందితో గొప్ప ర్యాలీ జరిగింది.

ఎస్.ఎ.డాంగే చైర్మన్‌గా, సి.రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నికైనారు.

## ఎమర్జెన్సీకి తోడ్పాటు తప్పని నిర్ధారణ
## 11వ కాంగ్రెస్ (భటిండా, 1978)

సిపిఐ 11వ కాంగ్రెస్ 1978 మార్చి 31 నుంచి ఏప్రిల్ 7 వరకు పూర్తిగా భిన్నమైన, తారుమారైన రాజకీయ పరిస్థితుల్లో జరిగింది. 5,46,732 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ 1183మంది పూర్తిస్థాయి, 259 మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులు పాల్గొన్నారు.

అవినీతిపై పోరాటం పేరుతో సోషలిస్టు జయప్రకాశ్ నారాయణ్ 'సంపూర్ణ విప్లవం' అంటూ బిహార్ 1974లో ఉద్యమం ప్రారంభించారు. బిహార్ ప్రభుత్వంపై ప్రారంభించిన ఆందోళన క్రమంగా ఇందిరాగాంధీ ప్రభుత్వంవైపు మళ్లించబడింది. మితవాద, మతవాద పార్టీలు, శక్తులు దాని వెనుక చేరటంతో అది ఇందిరాగాంధీ వ్యతిరేక ఆందోళనగా మారింది, ఇతర రాష్ట్రాలకు సైతం విస్తరించింది. ఇంతలోనే లోక్‌సభకు ఆమె ఎన్నిక చెల్లదంటూ అలహాబాద్ హైకోర్టు తీర్పు వచ్చింది. ఆమె అప్పీలు విచారించిన సెలవులబెంచి జడ్జి జస్టిస్ కృష్ణయ్యర్ స్టే మంజూరు చేశారు; లోక్‌సభ సభ్యురాలిగా లేకపోయినా మంత్రి లేదా ప్రధానమంత్రిగా కొనసాగవచ్చు, సభలో మాట్లాడవచ్చు, ఓటుహక్కు మాత్రం ఉండదు అని తీర్పు ఇచ్చారు. మితవాదులు ఇందిరాగాంధీ రాజీనామా కోసం ఉద్యమం ఉధృతం చేశారు. ఈ నేపథ్యంలో ఆమె 1975, జూన్ 25 అర్ధరాత్రి దేశంలో అంతర్గత ఎమర్జెన్సీ విధించారు. మితవాదులు, మతవాదులతోపాటు సిపిఐ(ఎం) నాయకులను కూడా పోలీసులు జైళ్లలో నిర్బంధించారు. 1977లో ఆమె ఎమర్జెన్సీని ఎత్తివేసి సార్వత్రిక ఎన్నికలకు ఉత్తర్వు చేశారు. కాంగ్రెస్‌తోపాటు ఎమర్జెన్సీని బలపరిచిన సిపిఐ ఎన్నికల్లో గట్టి ఎదురు దెబ్బలు తిన్నాయి. కాగా, సిపిఐ(ఎం) జనతాపార్టీ భాగస్వాములతో సర్దుబాటుతో పోటీ చేసింది. జయప్రకాశ్ నారాయణ్ 1977 ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ (ఒ), స్వతంత్ర పార్టీ, జనసంఘ్, సోషలిస్టులతో కలిపి ఏర్పాటు చేసిన జనతాపార్టీ మొరార్జీదేశాయ్ ప్రధానిగా కేంద్రంలో అధికారం చేబట్టింది. జనతాపార్టీకి కాంగ్రెస్‌లో యంగ్ టర్క్‌గా పేరొందిన చంద్రశేఖర్ అధ్యక్షుడు.

ఈ నేపథ్యంలో జరిగిన సిపిఐ భటిండా కాంగ్రెస్‌లో ఎమర్జెన్సీని పార్టీ బలపరచటంపై తీవ్రమైన చర్చ జరిగింది. ఎమర్జెన్సీకి సిపిఐ తోడ్పాటు తప్పు అని మహాసభ నిర్ణయించింది. ఎమర్జెన్సీని ఆరంభంలో బలపరచటం సరైనదే, కాని ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రతికూల అంశాలు ముందుకు వచ్చాక తోడ్పాటు ఉపసంహరించి ఉండాల్సింది అనే ప్రతివాదన కూడా బలంగా వచ్చింది. అయితే ఎమర్జెన్సీ ఆరంభంనుంచీ ప్రజావ్యతిరేకమైందని మహాసభ స్పష్టం చేసింది. అదే సమయంలో, ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంలో జెపి నడిపిన 'సంపూర్ణ విప్లవం' నుంచి నిజంగా ప్రమాదం ఉండిందని, అందువల్ల పార్టీ నడిపిన 'ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం' సరైందని పేర్కొన్నది.

జెపి ఉద్యమంలో ప్రధానమైన శక్తి ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్ అని భటిండా కాంగ్రెస్ స్పష్టంగా పేర్కొన్నది. అందువల్ల పచ్చి మితవాద శక్తులు అధికారం చేజిక్కించుకునే ప్రమాదం తీవ్రంగా ఉండిందని భావించింది. ఎమర్జెన్సీ విధించటంలో ధ్యేయం ఏదైనప్పటికీ, అది ఇందిరాగాంధీ వ్యక్తిగత పాలనను పటిష్టం చేసిందని, మితవాద అభివృద్ధి నిరోధక శక్తులకు మాత్రమే సహాయపడిందని పేర్కొన్నది.

చైర్మన్, ప్రధాన కార్యదర్శిలను మహాసభ తిరిగి ఎన్నుకుంది.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విద్యార్థికి చేయూత



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** మాదాపూర్‌లోని రెసోరెన్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి అర్థిక స్తోమత లేకపోవడంతో ఆర్యవైశ్య సంఘంలో తమ అబ్బాయి చదువు సహాయం అందించాలని కోరాడు. దీంతో ఆర్య వైశ్య సం ఘం తరుపున రెసోరెన్స్ కళాశాల యాజమాన్యాన్ని సంప్రదించి రూ.2,60, 000 ఫీజు అందించామని మాదాపూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాలరాజు గుప్తా, శేరిలింగంపల్లి మండల ఫౌండర్ గొలి రాజు, ఆశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో డి.నాగేష్ నాయక్, మాదాపూర్ ఆర్యవైశ్య సంఘం ఫౌండర్ లింగం, ఉపాధ్యక్షుడు హరిశంకర్, కోశాధికారి సుధాకర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** మన్సూరాబాద్ డివిజన్, కాస్మోపాలిటన్ కాలనీలో ఓపెన్ స్పేస్ బేస్మెంట్ గ్రౌండ్ అభివృద్ధి పనులను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రాజెక్ట్‌లో భాగంగా బోర్ వెల్ త్రవ్వకం, గ్రౌండ్ చుట్టూరా చైన్ లింక్ మెష్, గేటు ఏర్పాటు వంటి పనులకు జిహెచ్.యం.సి తరఫున రూ.15.00 లక్షల నిధులు కేటాయించబడ్డాయని తెలిపారు, కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రుద్ర లక్ష్మీనరసింహ, గంజి సత్తయ్య, జ్ఞానేశ్వర్, మల్లారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, మునగాల హరీష్ రెడ్డి యంజాల్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీరు పోయే విధంగా చర్యలు

కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వర్షాలకు కాలనీలు మునిగి పోవడంతో కాలనీ వాసుల సమాచారం మేరకు కాలనీలను బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ భారీవర్షాలు కురుస్తుడడంతో పివిఆర్ కాలనీ, పద్మావతి కాలనీ, మైల్ స్టోన్ కాలనీలో వర్షాపు నీరు చేయడంతో జలమండలి, హైడ్రా అధికారులతో మాట్లాడి వర్షపు నీరును పోయే విధంగా చర్యలు తీసుకున్నారు. వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు కాలనీల్లో భారీగా చేరితే సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సిరివెన్నెల, భవ్యరెడ్డి, ఇంజనీరింగ్ విభాగం కార్తీక్, హైడ్రా మేనేజర్ సతీష్, జిహెచ్‌ఎంసి జవాన్ యాదయ్య, కాలనీ వాసులు రాజు గౌడ్, నరేష్ యాదవ్, వేంకటేష్, సుధాకర్, రాము, శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ అనీ క్యూ హసన్



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ప్రస్తుత కాలంలో పిల్లలు, పెద్దలు అని లేకుండా ఏ వయస్సు వారికైనా క్యాన్సర్ వ్యాప్తి చెందుతుందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కామినేని ఆస్పత్రి జెనెటిక్స్, మాలిక్యులర్ మెడిసిన్ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అనీ క్యూ హసన్ అన్నారు. శుక్రవారం ఎల్‌బినగర్ కామినేని ఆసుపత్రిలో పిల్లల క్యాన్సర్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖ వైద్యనిపుణులు కంచన్ ఎస్.చన్నావర్, ఎస్.జయంతిలతో కలిసి అనీ క్యూ హసన్ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వారిలో ప్రపంచంలో ఏటా 4 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు వస్తున్నాయని తెలిపారు.

## హోప్ ఫౌండేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** హోప్ ఫౌండేషన్ చైర్మేన్ కొండ విజయ్‌కుమార్ వేడుకలు చందానగర్‌లోని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొండ విజయ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని చందానగర్ లోని హోప్ ఫౌండేషన్ కార్యలయం వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఎ , పిఎసి చైర్మేన్ అరికెపూడీ గాంధీ, చందానగర్ డివిజన్ అధ్యక్షుడు రాఘునాథ్‌రెడ్డిలు విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు.

## బిసిల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/షాబాద్:** బీసిలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పలనాటి యాదయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఆర్‌డివో కార్యాలయంలో బీసి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి, ఏఐకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, సిపిఐ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, బీసి సంఘాల నాయకులు సుధాకర్ గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు అదే విధంగా కోటా కేటాయించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, చేవెళ్ల నియోజకవర్గం బీసి కన్వీనర్ పాడాటి వెంకటయ్య, కోకన్వీనర్ జి.నర్సింలు, మొయినాబాద్ మండల సిపిఐ కార్యదర్శి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## యువత ఎంచుకున్న రంగంలో రాణించి అభివృద్ధి సాధించాలి

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** యువత ఎంచుకున్న రంగంలో రాణించేందుకు కృషి చేయడంతోపాటు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టిసి బస్టాండ్ ఆవరణలో ఫుడ్ లవర్స్ ఫుడ్ కోర్టును మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండేందుకు ఫుడ్‌ను ఏర్పాటు చేయడంతోపాటు అదే తరహాలో ధరలు ఉండే విధంగా చూడాలని అన్నారు. యువత ఆర్థికంగా అభివృద్ధి సాధించాలంటే స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎవరో వస్తారని..ఎదో చేస్తారని కాకుండా స్వయం సంవృద్ధి సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వ్యాపారమే ప్రధానమనే లక్ష్యంతో కాకుండా సమతుల్యమైన పౌష్టికాహారాన్ని ప్రజలకు అంధించేందుకు కృషి చేయాలని సూచించారు. నిర్వాహకులు బిక్షపతిని అభినంధించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పివైస్ చైర్మెన్ ఈట గణేష్, వి.నారాయణరెడ్డి, మాజీ వైస్ చైర్మెన్ నటరాజన్, మాజీ ఎంపిపి రాజేష్ పటేల్, మాజీ సర్పంచులు భీమయ్య, ప్రేమ్‌కుమార్, నేతలు వీరేష్ గుప్తా, రాములు, శేఖర్, ప్రవీణ్, జగన్, రవి, సత్యం, శ్రీను, అంజి, పాస్టర్స్ అంతయ్య, రవి కుమార్‌లు పాల్గొన్నారు.

# వేగంగా భవన నిర్మాణ అనుమతులు

జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశాలు – టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భవన నిర్మాణ అనుమతుల మంజూరులో వేగం, పారదర్శకత అనివార్యమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో కమిషనర్ కర్ణన్, చీఫ్ సిటీ ప్లానర్ కె. శ్రీనివాస్‌తో కలిసి టౌన్ ప్లానింగ్ విభాగం కార్యకలాపాలను జోన్ల వారిగా, సర్కిళ్ల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, కోర్టు కేసులు, ప్రజా ఫిర్యాదులు, లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తులపై వేగంగా చర్యలు తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలని స్పష్టం చేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి, ప్రమాదం సంభవించే ముందే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా సెల్లార్ తవ్వకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ విభాగం ఇప్పటికే మంచి పనితీరును ప్రదర్శిస్తోందని, ఇకపై మరింత పారదర్శకతతో, సమర్థవంతంగా పని చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందాలన్నారు. ఈ సమావేశంలో కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్లు ప్రదీప్ కుమార్, గంగాధర్, రజిత్ కుమార్, వెంకన్న, శైలజ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు పాల్గొన్నారు.

## పారదర్శకత, జవాబుదారీతనానికి డిజిటల్ ముద్ర

జిహెచ్ఎంసి ఎస్సెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి అధికారులకు, ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ వస్తువుల పంపిణీకి సంబంధించి ఇకపై అన్ని వివరాలు డిజిటల్‌గా లభించనున్నాయి. ఎస్సెట్ మేనేజ్‌మెంట్‌లో పారదర్శకత, సమర్థతను పెంపొందించేందుకు టిజి ఆన్‌లైన్ సహకారంతో కొత్తగా రూపొందించిన ఎస్సెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను జిహెచ్‌ఎంసి శుక్రవారం అధికారికంగా ప్రారంభించింది. ఇప్పటి వరకు మాన్యువల్ పద్ధతిలో వస్తువుల వివరాలు నమోదు చేసి కంప్యూటర్‌లోకి పొందుపర్చే విధానం ఉండేదని, ఇకపై ఇండెంట్ దాఖలు నుంచి ఆమోదం, సరఫరా వరకు ప్రతీ దశ డిజిటల్ పద్ధతిలో వెబ్‌సైట్ ద్వారా నిర్వహించనున్నారు.

**ఇలా పనిచేస్తుంది కొత్త వ్యవస్థ...** ఉద్యోగులు అవసరమైన వస్తువుల కోసం డిమాండ్ పెడితే, ఐటీ విభాగం పరిశీలించి ఆమోదిస్తుంది. ఆమోదించిన తర్వాత సరఫరా ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రతివస్తువుపైన బార్ కోడ్ లేబుల్ ఏర్పాటు చేసి, స్కాన్ చేయడంతో సమాచారం వెబ్‌సైట్‌లో నమోదవుతుంది. ఇలా ఎవరు, ఎప్పుడు, ఏవస్తువు తీసుకున్నారో స్పష్టంగా ట్రాక్ చేయవచ్చు. అవసరమైతే వస్తువుల బదిలీ లేదా తిరిగి స్వీకరించే ప్రక్రియ కూడా సులభతరం కానుంది.

**ప్రయోజనాలు...** ఎస్సెట్ల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుంది. ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ వస్తువుల సత్వర జారీ సాధ్యమవుతుంది. వస్తువుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుంది. ఎవరికి ఎలాంటి వస్తువు ఇచ్చామన్న సమాచారం సులభంగా లభిస్తుంది. మాన్యువల్ రిజిస్టర్ల అవసరం లేకుండా, ఒక్క క్లిక్‌తో వివరాలు తెలుసుకోవచ్చు ఈకొత్త సాంకేతికతతో ఆధారిత డిజిటలైజేషన్ వ్యవస్థను జిహెచ్‌ఎంసి అధికారులు, ఉద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. వస్తువుల భద్రతకు తోడుగా, సత్వరంగా లభించేలా వ్యవస్థ ఏర్పడిందని అభిప్రాయపడుతున్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/కొత్తూరు:** గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహ్మారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తూరు ఎంపివో విజయలక్ష్మి కి ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకొని సకాలంలో వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం నాన్చుడు దోరణి అవలంభిస్తుందని వాపోయారు. మూడు నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలో ఉన్న వీధులన్న శుభ్రం చేస్తున్న కార్మికుల పై ప్రభుత్వం చిన్న చూపు చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సకాలంలో వేతనాలు ఇవ్వడంతోపాటు సబ్బు లు, నూనెలు, షూ, యూనిఫాంతోపాటు పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రమకు తగిన వేతనాలు ఇవ్వకుండా ఫ్యాన్లు, ఎసిల్లో ఉండే ఉద్యోగులకు మాత్రం లక్షల కొద్ది వేతనాలు ఇవ్వడంలో అంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశా రు. పండుల సీజన్ వచ్చేస్తుంది కాబట్టి పెండింగ్‌లో ఉన్న వేతనాలు సకాలంలో చెల్లించాలని, లేని పక్షంతో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి మామిడి శేఖర్‌రెడ్డి, జిపి మండల కార్యదర్శి సురేష్, మండల అధ్యక్షుడు బిక్షపతి, కార్మికులు దేవయ్య, చంద్రయ్య, మైసయ్య, రవీందర్, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడల్లో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు



మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఫైమిద

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సెప్టెంబర్ 17 వరకు వాడవాడల్లో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఫైమిద పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వివరిస్తూ సంఘాలను బలోపేతం చేసుకునే విధంగా వారోత్సవాలు నిర్వహించలన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ఎఆర్ దేవరాజ్ భవన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల వారోత్సవాల సందర్భంగా మహిళా సమాఖ్య సమావేశం సమాఖ్య రాజేంద్రనగర్ అధ్యక్షురాలు కె.మునీశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఫైమిద ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాజేంద్రనగర్ కార్యదర్శి కన్యగారి లక్ష్మి, నాయకులు బండారి శాంతమ్మ, కె.జ్యోతి, పి.బుజ్జి, ఆర్.వెంకటమ్మ, జి.విజయ పాల్గొన్నారు.

## ఉచిత వైద్యసేవలు ఉపయోగకరం



**ప్రజాపక్షం/శంషాబాద్ :** ఆడశిశువు హత్య చేయడం అత్యంత ఆందోళనకర విషయమని డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం శంషాబాద్ మున్సిపాలిటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆడపిల్లల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మోర్డ స్వచ్ఛంద సేవా సంస్థ అండ్ రేషి క్లీనింగ్ నిర్వాహకులు సంయుక్తంగా ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ భ్రూణ హత్యలను అరికట్టకపోతే మానవ మనుగడనే ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. అనంతరం డాక్టర్ దీనా మాట్లాడుతూ "వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం, వైద్యసేవలు అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మనాయుడు, వైస్ ప్రిన్సిపాల్ భానుప్రకాశ్, భవాని దుర్గా తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం డిమాండ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** జిహెచ్ఎంసి పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె..ఏసురత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్‌బి నగర్ సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులదరినీ పర్మినెంట్ చేయాలని, పర్మినెంట్ చేసేంతవరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతన్న ధరలకు కనుగుణంగా కనీస వేతనం 30 వేల రూపాయలు అమలు చేసే వరకు ప్రభుత్వంపై మా పోరాటం కొనసాగుతుందన్నారు. వచ్చే నెల రెండో తారీఖున దసరా పండుగ ఉన్నందున రాష్ట్ర మున్సిపల్ కార్మికులందరికీ ఈనెల 26న వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి కోరారు. కార్మికుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు ఇవ్వాలని, కార్మికులు మరణిస్తే వారి కుటుంబానికి దహన సంస్కారాల ఖర్చులు రూ.30 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనపల్లి జైపాల్‌రెడ్డి, వీ.హరినాథరావు, ఎం.మద్దిలేటి, లక్ష్మి, అండాలు, పద్మ, దయాకర్, శ్రీరాములు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే పేదలకు భరోసా

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొత్తూరు:** పేదలకు భరోసా కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కొత్తూరు, నందిగామ మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబర్‌ఖాన్, మహ్మద్ ఇబ్రహీం, చిల్కమర్రి నర్సింలు, లింగారెడ్డిగూడ అశోక్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

కొత్తూరు మండల పరిధిలోని జెపి దర్గాలో కడప పీర్‌భాయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు.

## మహిళా సమస్యలపై ప్రజావిచారణ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జాతీయ మహిళా కమిషన్, న్యూఢిల్లీ వారు, అందిన ఫిర్యాదులను త్వరితగతిన, సమర్థవంతంగా పరిష్కరించుటకు "రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ఆప్కే ద్వార్ మహిళా జనసున్వాయి" అనే ప్రజా విచారణ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా సంక్షేమ అధికారి శ్రీలత శుక్రవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు,ఈ ప్రజా విచారణ కార్యక్రమం 15 సెప్టెంబర్ గచ్చిబౌలిలోని సైబారాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియం రంగారెడ్డి జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు.

## నూతన డ్రైన్ల నిర్మాణాలతో వరద సమస్యకు పరిష్కారం

ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** నూతన డ్రైన్ల నిర్మాణాలతో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కురిసినత వర్షాలకు నీట మునిగిన ప్రాంతాలను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బంజారాకాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తివాసులు మాట్లాడుతూ పక్కనే ఉన్న స్మశానవాటిక వర్షపు నీరునిండిపోయి ఇట్టి వరద నీరు బంజారా కాలనీలోని కొన్నిరోడ్లను ముంచెత్తిందన్నారు. గతంలో పడ్డ భారీవర్షాలకుగాను ఇక్కడ ఒక డ్రైన్ కట్టడం జరిగింది. దానివల్ల దాదాపు15 కాలనీవాసులకు వరదనీటి సమస్యల నుంచి పూర్తిస్థాయిలో విముక్తి లభించిందన్నారు. ప్రస్తుతానికి ఈ వరద నీటి సమస్యల కోసం నూతన డ్రైన్స్ మంజూరు చేయడం జరిగింది అని గుర్తు చేశారు. ప్రస్తుతానికి తాత్కాలిక సమస్యల్లో భాగంగాకొంతమేర గోడ కూలగొట్టి తాత్కాలికఉపశమనం కలిగిస్తామన్నారు. త్వరలోనే నూతన డ్రైన్స్ నిర్మాణ పనులు ప్రారంభం కావడం జరుగుతుంది, ఆ పనులు సకాలంలో పూర్తి అయితే పద్మావతి కాలనీ, హయత్ నగర్ బస్సు డిపో, కోర్టు, హయత్ నగర్ ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండదన్నారు. కార్యక్రమంలో చెన్నగొని శ్రీధర్ గౌడ్, భాస్కర్, అధికారులు హేమునాయక్, సురేష్, నాయకులు రాకేశ్, లక్ష్మణ్, ఇంద్రకరణ్ రెడ్డి, మధుముదిరాజ్, మనోజ్, అంజమ్మ, దేవరం, మోహన్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. శంకర్ పల్లి మండలం మహాలింగాపురం గ్రామంలోని సిఎంఆర్ గార్డెన్స్‌లో మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పాల్గొని జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన మొత్తం 50 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర గణనీయమైనదన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, పెండింగ్ లో ఉన్న డిఎల సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకూర్త గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, శంకర్ పల్లి పిఎసిఎస్ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ కాడి గారి రాజశేఖర్‌రెడ్డి, ఇంచార్జ్ ఎంపీడీవో గోపాలకృష్ణ, సిఐ సంతోష్ గౌడ్, ఏపీవో నాగభూషణం, పిఆర్‌టియు టిఎస్ శంకర్‌పల్లి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాణిక్యం, బాల్‌రాజ్, నియోజకవర్గ ఎస్ పి యు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగేష్, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య శ్రీనివాస్ చారి, జంగయ్య,శ్రీనివాస్, ఉపాధ్యాయులు పెంటయ్య, మల్లికార్జున్,రమ, శ్రీరాములు, మల్లేశం,అనుపమ, రెహానా బేగం, గీతాంజలి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.



## అలుగులు పారుతున్న శామీర్‌పేట పెద్ద చెరువు



ప్రజాపక్షం/శామీర్‌పేట : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శామీర్‌పేట పెద్ద చెరువు నిండి అలుగులు పారడంతో రైతులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మండలంలోని చెరువులు, కుంటలు నిండి అలుగులు పారిన సంగతి తెలిసిందే.. కాగా శామీర్‌పేట పెద్ద చెరువు నిండడానికి కొద్ది నీరు తక్కువ ఉండటంతో గురువారం కురిసిన భారీ వర్షానికి శుక్రవారం ఉదయం నుంచి అలుగులు పారుతోంది. పెద్ద చెరువు నిండటంతో కట్టమైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌యాదవ్, కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ కిషోర్‌యాదవ్, గ్రామస్థులు గంగమ్మకు ఘటంకుండతో కట్టమైసమ్మ ఆలయం వరకు ఊరేగిం పు నిర్వహించారు. అంతకు ముందు కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

## ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా తమకున్న నైపుణ్యతల మేరకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం హౌసింగ్ బోర్డు కాలనీలో సురేష్ నెలకొల్పిన వాటర్ వాషింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రభుత్వపరంగా యువత అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగ పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయికిరణ్,శ్రీనివాస్, కిషోర్,విఠల్ నాయక్, మహేందర్, బాల కృష్ణ, వెంకన్న గౌడ్, చిన్న రాజు, గణేష్, తరుణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## మాతృ మరణాలను నివారించాలి

### డిఎంహెచ్‌ఒ ఉమాగౌరి

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మాతృ మరణాలను నివారించటంలో భాగంగా ప్రతి గర్భిణీకి ప్రాథమిక స్థాయి నుండే సమగ్ర సేవలు అందిస్తూ తగు సూచనలిస్తూ ఎలాంటి ప్రమాదకర పరిస్థితులను గమనించిన వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, గాంధీలాంటి ఆస్పత్రులకు రెఫరల్ చేస్తుండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఉమాగౌరి సూచించారు. శుక్రవారం తమ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్క కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన ఉప కమిటి సమావేశంలో హెల్త్ వర్కర్ల నివేదికలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవల వివరాలను సమక్షించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ మాతృ మరణాలను జరుగకుండా అన్ని స్థాయిల్లో వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ వైద్యాధికారులు సత్యవతి, మల్లీశ్వరి, స్వర్ణలత సిబ్బంది పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలిస్తే ఇబ్బందులు

ప్రజాపక్షం/మల్కాజిగిరి : బోడుప్పల్‌లో నిర్మించనున్న సమీకృత నూతన భవనంలోకి మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించ వద్దన్న డిమాండ్‌తో శుక్రవారం మల్కాజ్‌గిరిదస్తావేజు లేఖరులు సబ్ రిజిస్ట్రార్‌ను కల్సి వినతిపత్రాన్ని సమర్పించారు. తమ దుకాణాలను మూసి వేసి నిరసన వ్యక్తం చేసారు. ఈ మేరకు వినతిపత్రం అనేక ఏళ్లుగా సొంత భవనంలో కొనసాగుతున్న మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనే 40 మందికి పైగా దస్తావేజు లేఖరులుగా పని చేస్తూ కుటుంబాలను పోషించుకొంటున్నామని, కార్యాలయాన్ని తరలించటం వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. దీంతోపాటు ఈ కార్యాలయానికి సమీప ప్రాంతాల ప్రజలు రిజిస్ట్రేషన్లకు వచ్చే నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మల్కాజిగిరి దస్తావేజుల సంక్షేమ సంఘం ప్రతినిధులు లక్ష్మణ్, నరేష్ బాబు, వంశీ సుందర్, సుందరి, ఈశ్వర్, నజీర్‌లతో పాటు న్యాయవాదులు శ్రీధర్ నాయుడు, రమణమూర్తి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు విద్యా సామాగ్రి అందజేత

ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు చేయూత నివ్వాలని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు గోదావర్తి నీరజ, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రితో పాటు నోట్ పుస్తకాలు, స్టేషనరి, బిస్కెట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు కావాల్సిన మౌళిక వసతులను కల్పించడానికి ప్రతి ఒక్కరు దాతలుగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి, రోటరి క్లబ్ సభ్యులు యశోద, పెయింట్ పీటర్ ఇంజినీరింగ్ కళాశాల డైరక్టర్ సరోజ, శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ చైర్మన్ పెండెం లక్ష్మీనారాయణ(నాని), మాజీ ధర్మకర్త నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## శామీర్‌పేటకు చేరుకున్న బతుకమ్మ చీరలు

ప్రజాపక్షం /శామీర్‌పేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ మేరకు బతుకమ్మ పండగకు కొత్త చీరలను పంపిణి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంది. త్వరలోనే దసరా పండగతో పాటు బతుకమ్మ పండగ జరుపుకునే మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం చిరుకానుకగా కొత్త కొత్త డిజైన్‌లతో బతుకమ్మ చీరలను పంపిని చేయడానికి రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు శామీర్‌పేట మండల కేంద్రంలోని గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయానికి బతుకమ్మ చీరలను తరలించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ పిడి సాంబశివరావు మాట్లాడుతూ శామీర్‌పేట, కీసర, మేడ్చల్, మూడుచింతలపల్లి, ఘట్‌కేసర్ మండలాలకు మొత్తం 42,804 చీరలు వచ్చాయని చెప్పారు. ఈ చీరలను ఆయా మండలాల్లోని మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులకు మాత్రమే పంపిణి చేస్తామని చెప్పారు. శామీర్‌పేట మండల కేంద్రంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యాలయానికి చీరలు వచ్చాయని వివరించారు. త్వరలోనే చీరల పంపిణిని చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మి, డిపిఎం ఆనందం, ఎపిఎంలు సురేష్‌రెడ్డి, ఝాన్సిలు ఉన్నారు.

## బాలబాలికలకు కబడ్డీ ఎంపిక పోటీలు

ప్రజాపక్షం/ నిజాంపేట్ : మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపిక పోటీలు జరుగుతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేశ్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వీరేశ్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపిక జరుగుతాయని, బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమిలో జరుగుతాయని తెలిపారు. ఈ నెల 14న ఆదివారం అకాడమిలో జరుగునని, ఎంపికైన జట్లు ఈ నెల 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా, ముష్కల్‌లో జరిగే 35వ అంతర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అవుతారని తెలిపారు. కబడ్డీ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్య



ప్రజాపక్షం/చర్లపల్లి: ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని కత్తులతో పొడిచి చంపిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మౌలాలీ హెచ్‌బి కాలనీకి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీకాంత్‌రెడ్డిని గుర్తు తెలియని వ్యక్తులు మంగాపురం కాలనీలో వెంబడించి కత్తులతో పొడిచి పారిపోయారు. శ్రీకాంత్‌రెడ్డి అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు.ఈ హత్యకు పాత కక్షలే కారణమని తెలిసింది.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి కి తరలించారు.కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జిహెచ్‌ఎంసి మలేరియా విభాగం కాంట్రాక్ట్ కార్మికుల

# సమస్యలు పరిష్కరించాలి

* ఐదు సంవత్సరాలుగా జీతాల పెంపు లేదు
* ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ



ప్రజాపక్షం/హైదరాబాద్: జిహెచ్‌ఎంసిలో యాంటీ లార్వా ఆపరేషన్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. జిహెచ్‌ఎంసిలో పనిచేస్తున్న కాంట్రాక్టు మలేరి యా విభాగం కార్మికుల సమస్యలపై యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడ వార్డు కార్యాలయం వద్ద కార్మికులతో సమావేశం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల క్రితం అరకొర జీతాలు పెంచడం జరిగిందని ప్రస్తుతం వీరి జీతాలు 26 వేలకు పెంచాల్సినటువంటి అవసరం ఉందని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జిహెచ్‌ఎంసిలో మలేరియా విభాగం కార్మికులు మూడు కేటగిరీలుగా ఉండా ల్సి ఉన్నప్పటికీ కెసిఆర్ ప్రభుత్వం దాని రెండు కేటగిరీలకు మార్చడం వలన అనేకమంది కార్మికులకు అన్యాయం జరిగిందని వారు పేర్కొన్నారు. గత 20 సంవత్సరాల నుండి జిహెచ్‌ఎంసి లో జనాభా పెరుగుతున్న అందుకు అనుగుణంగా మలేరియా విభాగం కార్మికుల సంఖ్యను పెంచకపోవడం వలన కార్మికులపై పనిభారం పడుతున్న దన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు పెంచకపోగా వారికి ఇవ్వాల్సిన స్టేషనరీ సైతం ఇవ్వటం లేదని పాతకాలపు స్ప్రే మిషన్లతోనే పని చేయాల్సిన పరిస్థితి వస్తున్నదని నర్సింహ పేర్కొన్నారు.

కార్మికుల ఎవరైనా దురదృష్ట వశాత్తు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వవలసి ఉన్నా, అది ఇవ్వడం లేదని; సంవత్సరానికి 23 సెలవులు ఇవ్వవలసిన ఉన్నా దానిని అమలు చేయ దం లేదని వారు పేర్కొన్నారు. జిహెచ్‌ఎంసి కాంటాక్ట్ కార్మికుల జీతాల పెంపుకై ప్రభుత్వం ఆలోచించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తు న ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య జిహెచ్‌ఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్ ఉప ప్రధాన కార్యదర్శి పి నరసయ్య ఈఎఫ్‌ఏ నరేందర్ రెడ్డి పి.నవీన్, రాజేష్, రాకేష్, సతీష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామకంఠంవాసులకు పునరావాస కల్పనకు

# శాశ్వత ప్రాతిపదికన ఇళ్లు

### విఎస్. బోస్ డిమాండ్



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : అగ్నిమాపకదళ కార్యాలయ నిర్మాణం కోసం అనేక ఏళ్లుగా ఆల్వాల్ పోలీస్‌స్టేషన్ పక్కన గ్రామ కంఠం స్థలంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారిని తొలగిస్తే ప్రభుత్వపరంగా పునరావాసం కల్పించే విధంగా శాశ్వత ప్రాతిపదికన ఇళ్లు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్, జిల్లా కార్యదర్శి ఉమామహేష్‌లు డిమాండ్ చేసారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న పేద కుటుంబాలు ఇంటింటికి తిరిగి ఉదయాన్నే చెత్త సేకరించటం ద్వారా కుటుంబాలను పోషించుకొంటున్నారని, వారుంటున్న ఇళ్లను తొలగించటం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. శుక్రవారం ఈ ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలను కల్సి పార్టీ పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ విషయంలో తాము జిల్లా కలెక్టర్‌ను సైతం కలుస్తామన్నారు. అనంతరం జిహెచ్‌ఎంసి ఆల్వాల్ డిప్యూటి కమిషనర్ శ్రీనివాసరెడ్డిని కల్సి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, నిమ్మల నర్సింహ, శ్రీనివాస్, మండల కార్యదర్శి ఆల్వాల్ బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు దశరథ్, యాదయ్య గౌడ్, యాదగిరి, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



## వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి

### ఎసిపి వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట:రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని అంతవరకు వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించి వాహనాలను జాగ్రత్తగా నడపాలని మేడ్చల్ ట్రాఫిక్ ఎసిపి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శామీర్‌పేటలోని నల్సార్ చౌరస్తాను పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శామీర్‌పేటలోని పలు ప్రధాన చౌరస్తాలైన అలియాబాద్, మజీద్‌పూర్, అరెంజ్ బౌల్, నల్సార్ చౌరస్తాల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రమాదాల నివారణకు గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని వాటి నివారణకు త్వరలోనే చర్యలు చేపడుతామని అన్నారు. వాహనదారులు యూటర్న్ చేసేటప్పుడు జాగ్రత్తగా చేయాలని సూచించారు. రోడ్డు నిబంధనలను పాటించి ఇంటికి సురక్షితంగా చేరాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## చట్టానికి లోబడి కల్లు కంపౌండ్‌లు నడపాలి

### శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : కల్లు కంపౌండ్‌ల నిర్వాహకులు చట్టానికి లోబడి కల్లు దుకాణాలను నడపాలని లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవని శామీర్‌పేట పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ హెచ్చరించారు. శుక్రవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఉమ్మడి మండలంలోని కల్లు కంపౌండ్‌ల దుకాణాదారులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రతి కల్లు కంపౌండ్‌లో సిసి కెమరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. భద్రత చర్యలను తప్పకుండా పాటించాలని వారికి అవగాహన కల్పించారు. నిర్వాహకులకు నోటీస్ జారీ చేసి పై సూచనలను పాటించాల్సిందిగా సూచించారు. శాంతి భద్రతలను కాపాడటంలో శామీర్‌పేట పోలీసులు ఎల్లప్పుడు ప్రజలతో కలిసి పనిచేస్తారని, ప్రజల సహకారంతో మరింత సురక్షిత వాతావరణం నెలకొల్పుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లు కంపౌండ్‌ల నిర్వాహకులు, ఎస్ఐలు దశరథ, శశివర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# ఫేస్ రికగ్నిషన్ ప్రక్రియ వేగిరం

### అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆదేశం



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ఇంటర్ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు గాను ఆన్‌లైన్‌లో ఫేస్ రికగ్నిషన్ ప్రక్రియను త్వరితగతంగా పూర్తి చేసి పూర్తి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలంటూ జిల్లాలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లను జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆదేశించారు. ఫేస రికగ్నిషన్ సిస్టమ్(FRS)ను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తేనే జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ పోర్టల్‌లోకి రావటం ద్వారానే స్కాలర్‌షిప్‌లు అందుతాయన్నారు. ఆయా కళాశాలల్లో ఈ విధానాన్ని ఇప్పటి వరకు ఏయే కారణాలతో చేయలేకపోతున్నారని ప్రిన్సిపాళ్లను ప్రశ్నించగా విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండటమని, ఆన్‌లైన్‌లో నమోదు చేయటంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని, కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్‌మీడియట్ అధికారి కిషన్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్ ప్రిన్సిపాల్, తదితరులు పాల్గొన్నారు.





## వైకుంఠధామాన్ని మోడల్ గ్రేవ్ యార్డ్‌గా తీర్చిదిద్దుతాం

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: భగత్‌సింగ్ నగర్ వైకుంఠధామాన్ని మోడల్ గ్రేవ్ యార్డ్‌గా తీర్చిదిద్దుతామని బిఆర్‌ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద పేర్కొన్నారు. శుక్రవారం 128 చింతల్ డివిజన్‌కి చెందిన సంక్షేమ సంఘాల నాయకులు పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్‌ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి వివేకానందను కలిశారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ నగర్ స్మశాన వాటికను అభివృద్ధి పరిచి, మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని కోరారు. నీటి సౌకర్యం, స్నానాల గదుల నిర్మాణం, కాపలాదారుడి ఏర్పాటు, దహన వాటిక, వాచ్‌మెన్ రూమ్, వాహనాల పార్కింగ్, గ్యాలరీ వంటివి ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వివేకానంద సానుకూలంగా స్పందిస్తూ బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు వైకుంఠధామాలకు కోట్లాది రూపాయల నిధులతో అన్ని విధాలుగా అభివృద్ధి పరిచామన్నారు. రానున్న రోజుల్లో కూడా భగత్‌సింగ్ నగర్ స్మశాన వాటికను అభివృద్ధి పరిచి సమీప కాలనీ వాసులకు అందుబాటులోకి తేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేగ కృష్ణమూర్తి చింతల్, చంద్రా నగర్, భగత్‌సింగ్ నగర్, దుర్గయ్య నగర్, రంగా నగర్, స్టార్‌లైట్ అపార్ట్‌మెంట్, స్ఫూర్తి నగర్, ఆదర్శ్ నగర్, వైఎంఎస్ కాలనీ, సాయి కాలనీ, శివా నగర్ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### మురుగునీటి డైవర్షన్ పనుల్లో వేగం పెంచాలి

నిజాంపేట్ : ఫాక్స్ సాగర్ చెరువులో మురుగునీరు కలవకుండా జరుగుతున్న పనుల్లో వేగాన్ని పెంచాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అధికారులను ఆదేశించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్ నగర్ డివిజన్ జీడిమెట్ల ఫాక్స్ సాగర్ చెరువులో మురుగునీరు కలవకుండా సుమారు రూ.2.40 కోట్లతో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే వివేక్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఫాక్స్ సాగర్ చెరువులో పలు కాలనీలు, బస్తీల నుండి మురుగునీరు కలవడం వలన చెరువు పూర్తిగా కలుషితం అవుతుందని, చెరువులోకి మురుగునీరు కలవకుండా పనులను చేపట్టామని తెలిపారు. సుమారు డెబ్బై శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను సైతం త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. చెరువును పరిరక్షించడంతో పాటు మత్స్య సంపదను పెంపొందించడానికి ఈ పనులను చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ రామారావు, మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్, భాస్కర్, మదుమోహన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు


ప్రజాపక్షం/వికారాబాద్:ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో 15,16 తేదీన స్పాట్ అడ్మిషన్ నిర్వహించడం జరుగుతుందని,విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రొపెసర్ సీవీ గీత లక్ష్మీ పట్నాయక్ తెలిపారు. కళాశాలలో ఉన్న కోర్సులు బిఎ , ఇంగ్లీష మీడియం, తెలుగుమీడియం, బీఎస్సి లైఫ్‌సైన్స్, ఇంగ్లీష్ మీడియం, ఫిజికల్‌సైన్స్ సీట్లలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు జరుగుత్నువి అని ఇందులో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం మాత్రమే జరుగుతాయని తెలిపారు.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాపక్షం/తాండూరు: తాండూరు మండల పరిధి సంగెంకలాన్ వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గురవారం తాండూ రు ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో వాగులు వంకలు ఏరులై పారిన విషయం తెలిసిందే. తాండూరు మండల పరిధి సంగెంకాలన్ గ్రామ సమీపంలోని దిడ్డి వాగు వదృతంగా ప్రవహిస్తున్నది. గ్రామానికి చెందిన బొక్తంపల్లి మొగులప్ప(47) పొలానికి వెళ్ళి తిరిగి వస్తున్న సమయంలో వాగు వరద ఉదృతంగా ప్రవహిస్తుంది. వాగు దాటే ప్రయత్నం చేసిన మొగులప్ప వరద ఉధృతిలో గల్లంతైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ అధికారులను, పోలీసులను అప్రమత్తం చేసి గల్లంతైన మొగులప్ప ఆచూకీ కోసం గురువారం అర్థరాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించ లేదు. తిరిగి శుక్రవారం వరకు గాలింపు చర్యలు మమ్మురం చేయగా చిట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరి మార్గం సమీపంలో మొగులప్ప మృతదేహాన్ని గుర్తించారు.గ్రామస్తులు వెంటనే మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్‌కు సమాచారం ఇవ్వగ ఆయన పోలీసులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని వాగు లోంచి వెలికి తీసికి పోస్టు మార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించి పంచనామ అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతిని భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## మహిళలు ఆత్మ విశ్వాసంతో వ్యాపారవేత్తలుగా ఎదగాలి

### అదనపు కలెక్టర్ సుధీర్



ప్రజాపక్షం/వికారాబాద్:మహిళ ఆత్మ విశ్వసంతో వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు. శుక్రవారం వీహబ్ ఆధ్వర్యంలో జిల్లా స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రమికవేత్తలకు ర్యాంప్ ఉమెన్ అక్సెలేషన్ ప్రోగ్రం పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాదికారత కోసం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా మహిళలను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. బ్యాంకుల ద్వారా ప్రతి సంవత్సరా పెద్ద మొత్తంలో రుణాలు అందించడం జరుగుతుందని ,మహిళలు పొందుతున్న రుణాలచే అర్థికంగా ఎదిగేందుకు ,కుటుంబాల భవిషత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సద్దుదేశంతో వెబ్‌హబ్ ద్వారా వ్యాపారాలు చేసుకునే విధంగా శిక్షణతో పాటుగా మెలకువలను ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. బ్యాంకుల నుండి తీసుకున్న రుణాల ద్వారా ఉత్పత్తి రంగంలో రాణించి తమ నైపుణ్యాన్ని పెంపొందించుకొని అదాయాన్ని సమకూర్చుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.డిఆర్‌డిఓ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకులు, స్త్రీనిది ద్వారా సంవత్సరానికి 610 కోట్ల రూపాయల రుణాలు అందించడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకొని మహిళలు వ్యాపార రంగాల్లో రాణించాలన్నారు. వరల్డ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్‌ఎంఎస్‌ఎంఈ ఆద్వర్యంలో చేపడుతున్న ఈ శిక్షణ ద్వారా మహిళలు వ్యాపారాలు నిర్వహించుకొని ఆదాయపరంగా ఎదిగేందుకు ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని ఆయన తెలిపారు. రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన మహిళా పారిశ్రమికవేత్తలకు తమ బిజినెస్ అభివృద్ధిని వేగవంతం చేసుకొని తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. వీహబ్ డైరెక్టర్ జాహిద్‌షేక్ మాట్లాడుతూ టెక్స్ టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తుల తయారీ, హస్తకళలు వంటి రంగాల్లోని వ్యాపారులకు బిజినెస్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నా రు. ఈ క్యాక్రమంలో వీహబ్ అసోసియేట్ డైరెక్టర్ శ్రీహరి, మహేశ్వర్, తాజ్, సాయిరామ్, నర్సింలు, రవికుమార్ కొమరయ్య,జానకి తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై దాడి కేసులో నిందితుడికి జైలు శిక్ష : ఎస్ఐ

ప్రజాపక్షం/కొడంగల్ : ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడని ఆ అమ్మాయికి వచ్చే సంబంధాలను చెడగొడుతున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిని దారుణంగా కొట్టడంతో ఆ వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడంతో అట్టి కేసును కొడంగల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి విచారించి నిందితులకు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. పూర్తి వివరాల్లోకి వెళితే కొడంగల్ మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన బెరకోటి మల్లప్ప అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడని ఆమె కు వచ్చిన సంబంధాలను చెడగొడుతున్నాడనే ఉద్దేశంతో బండి సాయప్ప, అబ్బులప్ప, బోట్టు మల్లమ్మ, ఊరు హన్మమ్మలు రాడ్ తీసుకుని విచక్షణా రహితంగా దాడి చేశారు. క్షతగాత్రుడి అన్న బెరకోటి సాయప్ప 15/04/2019 సం.లో పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. అప్పట్లో కొడంగల్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శేఖర్ గౌడ్ కేసు నమోదు చేయగా కొడంగల్ న్యాయమూర్తి శ్రీరామ్ బండి సాయప్పకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, 500 రూపాయల జరిమానా విధించడంతో పా టు మిగతా ఏడుగురికి 500 రూపాయల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఎస్ఐతో పాటు కోర్టు కానిస్టేబుల్ రమేష్‌లున్నారు.

## ప్రతి ఫిర్యాదుపై సకాలంలో విచారణ

### ఎస్‌పి ఆదేశం

ప్రజాపక్షం/కోట్‌పల్లి: వికారాబాద్ నియోజకవర్గంలోని కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్‌పి తనిఖీ చేసి పరిసరాలను, రికార్డులను, కేసు డైరీలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పద్ధతులు, కేసుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల డిజిటలైజేషన్ స్థితిని తెలుకున్నారు. సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సిబ్బంది పనితీరు, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. విధుల్లో నిబద్ధత, నిజాయితీ అత్యంత ముఖ్యమని ఎస్పీ గుర్తు చేశారు. శాంతిభద్రతలను కాపాడటానికి పోలీసులు నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా చోరీలు, సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సైబర్ నేరాలను, ఆత్మహత్యలను, రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదును సకాలంలో స్వీకరించి, విచారణను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, సిఐ రఘురామ్, ఎస్ఐ శైలజ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# రాణించిన హ్యారిస్, జమాన్..

**ఆసియా కప్ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది**

ఆసియా కప్ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ ఆదిలో తడబడినా భారీ స్కోర్ చేసింది. స్పిన్ ట్రాక్ మీద ఒమన్ బౌలర్ అమిర్ ఖలీం(3–31) తిప్పేయగా కీలక ఆటగాళ్లు చేతు లెత్తేశారు. ఓవైపు వికెట్లు పడుతున్నా మొహమ్మద్ హ్యారిస్ (66) అర్ధ శతకంతో జట్టును ఆదుకున్నాడు. ఆఖర్లో ఫఖర్ జమాన్ (23), మొహమ్మద్ నవాజ్ (19) మెరుపులతో పాక్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. ఒమన్ బౌలర్లలో షాహ్ ఫైజల్ కూడా మూడు వికెట్లతో రాణించాడు. టాస్ గెలిచిన పాకిస్థాన్ సారథి సల్మాన్ అఘా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. తొలిసారి మెగా టోర్నీ ఆడుతున్న ఒమన్ బౌలర్లను ఉతికేసి కొండంత స్కోర్ కొట్టానుకున్న పాక్ జట్టుకు ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్ సయీం అయూబ్(0)ను స్పిన్నర్ అమిర్ ఖలీం వెనక్కి పంపాడు. ఆ తర్వాత షహిబ్జద ఫర్హాన్(29) జతగా మొహమ్మద్ హ్యారిస్(66) ధనాధన్ ఆడాడు. ఈ ఇద్దరూ బౌండరీలతో చెలరేగి రెండో వికెట్‌కు 85 రన్స్ జోడించారు. దంచికొడుతున్న ఈ ద్వయాన్ని అమిర్ విడదీసి మళ్లీ ఒమన్‌కు బ్రేకిచ్చాడు. కాసేపటికే అర్ధ శతకం బాదిన హ్యారిస్ రివర్స్ స్వీప్ ఆడబోయి అమిర్ ఓవర్లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాతి బంతికే సల్మాన్ అఘా(0) గోల్డెన్ డక్ అయ్యాడు. 120కే ఐదు వికెట్లు పడిన వేళ.. ఫఖర్ జమాన్ (23), మొహమ్మద్ నవాజ్(19)లు దూకుడుగా ఆడి జట్టు స్కోర్ 150 దాటించారు. ఆఖర్లో షాహ్ ఫైజల్ ధాటికి టెయిలెండర్లు పెవిలియన్‌కు క్యూ కట్టడంతో పాక్ 160కే పరిమితమైంది.







## సెమీస్‌కు పూజారాణి..

**లివర్‌పూల్:** ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయమయ్యాయి. సీనియర్ బాక్సర్ పూజా రాణి.. మహిళల 80 కిలోల విభాగంలో సెమీస్‌కు చేరి పతకాన్ని ఖాయం చే సుకుంది. క్వార్టర్స్‌లో పూజా.. 3–2తో ఎమిలా కొటె ర్స్ (పోలండ్)ను ఓడించింది. ఈ టోర్నీలో ఇప్పటికే నుపుర్ షెరోన్, జైస్మిన్ లంబోరియా సెమీస్ చేరిన విషయం విదితమే. మహిళల 57 కిలోల క్వార్టర్స్ లో జైస్మిన్.. 5–0తో మమజొనోవా (ఉజ్బెకిస్థాన్)పై ఏకపక్ష విజయం సాధించింది. కాగా రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన నిఖత్ జరీన్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. పురుషుల విభాగంలో అవినాశ్ జమ్వాల్ సైతం క్వార్టర్స్ లోనే ఇంటి బాట పట్టాడు.

## సెమీఫైనల్‌లో సాత్విక్ – చిరాగ్..



ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యంతో మెరిసిన సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ మరో టైటిల్ వేటకు చేరువైంది. ప్రతిష్ఠాత్మక హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన మూడు సెట్ల పోరులో జునైదీ అరిఫ్ – రాయ్ కింగ్ యాప్ (మలేషియా)లను చిత్తు చేసింది. దాంతో.. వరుసగా రెండో టోర్నమెంటల్‌లో సెమీస్ బెర్తు కైవసం చేసుకుంది భారత స్టార్ ద్వయం. హాకాంగ్ ఓపెన్‌లో సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి జోడీ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. 42వ ర్యాంక్ జోడీని మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్ చేరిన ఈ ద్వయం అదే దూకుడు చూపించింది. బలమైన ఆటాకింగ్‌తో భారత జంటకు చెక్ పెట్టాలని భావించిన జునైదీ అరిఫ్ – రాయ్ కింగ్ యాప్‌లకు చుక్కలు చూపించింది. ప్రత్యర్థి ఎత్తుల్ని చిత్తు చేస్తూ తొలి సెట్‌ను సాత్విక్ సాయిరాజ్ 21–14తో కైవసం చేసుకున్నారు. అయితే.. రెండో సెట్‌లో అటాకింగ్ గేమ్‌తో మలేషియా షట్లర్లు 22–20తో పైచేయి సాధించారు. దాంతో.. మూడో సెట్ ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. నిర్ణయాత్మకమైన ఈ సెట్‌లో సాత్విక్ – చిరాగ్ జోడీ టాప్ గేర్‌లో ఆడింది. తమదైన శైలిలో దూకుడు కనబరిచి జునైదీ – రాయ్ కింగ్ జంట సెమీస్ ఆశలపై నీళ్లు చల్లింది. ఈ ఏడాది తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ వేటలో ఉన్న ఈ జోడీ శనివారం లిన్ బింగ్ వీ – చెన్ చెంగ్ కౌన్ (చైనీస్ తైపీ)తో తలపడనుంది.

# ఫోకస్

# సైన్స్

## మీకు తెలుసా?

- ☞ కాంతి ఒక సెకనులో సుమారు 3 లక్షల కిలోమీటర్ల వేగంతో (299,792,458 మీటర్లు/సెకనుకు) ప్రయాణిస్తుంది. అంటే కాంతి ఒక సెకనులో భూమి చుట్టూ 7.5 సార్లు తిరగగలుగుతుంది.
- ☞ బ్లాక్ హోల్స్ (కృష్ణ బిలాలు) అనేవి అతి భారీ నక్షత్రాల పేలుడు (సూపర్‌నోవా) తర్వాత ఏర్పడతాయి. ఇవి కాంతిని కూడా అడ్డంగించేటంత ఎక్కువ గురుత్వాకర్షణ శక్తిని కలిగి ఉంటాయి.
- ☞ మన శరీరంలోని ప్రతి సెల్ (కణం)లో ఉన్న డిఎన్‌ఎను పూర్తిగా విప్పి వరుసగా పెడితే, అది 600 పర్యాయాలు సూర్యుడి వరకు వెళ్ళి తిరిగి రావడానికి సరిపోతుంది!
- ☞ అంతరిక్షం నిశ్శబ్దంగా ఉంటుంది. అక్కడ గాలి ఉండదు కాబట్టి శబ్ద తరంగాలు ప్రయాణించలేవు. అందుకే స్పేస్ ఫిక్షన్ సినిమాల్లో వినే పేలుళ్లు, నిజానికి అక్కడ వుండవు. సోషల్ మీడియాలో కూడా వివిధ గ్రహాలు చేసే శబ్దాలు తెగవైర్ అవుతుంటాయి. కానీ, నిజానికి అంతరిక్షంలో ఎలాంటి చప్పుళ్లు వినిపించవు.
- ☞ మన శరీరం నిండా దృఢంగా ఉన్నట్టు అనిపించినా, అసలు అణువుల్లో 99.9999 శాతం ఖాళీ ఉంటుందనేది నమ్మడానికి కష్టమైన నిజం.
- ☞ మన మెదడు సుమారు 86 బిలియన్ న్యూరాన్లు కలిగి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఒక సూపర్ కంప్యూటర్ కంటే అధికంగా ప్రాసెస్ చేయగలుగుతుంది.
- ☞ మొక్కలు గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, ఆ పటిష్టమైన కాండం, ఆకులు నిర్మించడానికి ఉపయోగిస్తాయి. అంటే మొక్కలు నేల నుంచి మట్టినికాదు.. భూమిపైన గాలినే తింటాయి. ఈ ప్రక్రియన కిరణ జన్య సంయోగక్రియ అంటారు.


## హీలియం సేకరణకు చైనా కొత్త టెక్నాలజీ



అత్యంత తక్కువగా, కేవలం 0.03 నుంచి 0.05 శాతం మాత్రమే హీలియం ఉండే సహజ వాయు క్షేత్రాల్లోనూ, సుమారు 99.99997 శాతం శుద్ధ హీలియం (6ఎన్9 గ్రేడ్)ను వేరు చేసే టెక్నాలజీని చైనా అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ సైన్స్ మ్యాగజైన్స్ కథనాల ప్రకారం, చైనాకు చెందిన వాక్రీ టెక్నాలజీస్ అనే కంపెనీ ఈ అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానంతో ఓ పరికరాన్ని తయారు చేసింది. ఈ పరికరం ద్వారా హైడ్రోజన్‌ను వేరుచేయడం, వాయువు స్వచ్ఛత పెంచడం సాధ్యమవుతుంది. వాతావరణ పొరల సహాయంతో వేర్వేరు వాయువులను వేరు చేస్తుంది. ఒత్తిడి మార్పుల ద్వారా అవసరమైన వాయువును సంగ్రహిస్తుంది. అత్యల్ప ఉష్ణోగ్రతల వద్ద హీలియంను శుద్ధి చేస్తుంది. ఈ సమగ్ర విధానం సాయంతో ఈ కంపెనీ సంవత్సరానికి సుమారు 4 లక్షల క్యూబిక్ మీటర్లు శుద్ధమైన హీలియం ఉత్పత్తి చేయగలిగింది. చైనా దగ్గర సహజవాయు క్షేత్రాలు ఉన్నప్పటికీ, అందులో సాంద్రీకృత హీలియం చాలా తక్కువ. ఫలితంగా, పలు అవసరాల కోసం ఖరీదైన దిగుమతులపై ఆధారపడక తప్పడం లేదు. నూతన టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో, హీలియం ఉత్పత్తిలో చైనా స్వయం సమృద్ధి కావడమేగాక, వ్యూహాత్మక వనరుల భద్రతను పెంచుకోగలుగుతుంది. సాధారణంగా హీలియం అనగానే బెలూన్లలో నింపడానికి ఉపయోగపడే వాయువుగానే చాలా మందికి తెలుసు. కానీ, ఇది శాస్త్రీయ పరిశోధనలు, పారిశ్రామిక రంగాల్లో కీలక భూమిక పోషిస్తుంది. అంతరిక్ష పరిశోధనలు, ఎంఆర్ఐ యంత్రాల్లో సూపర్‌కండక్టింగ్ మాగ్నెట్స్‌ను చల్లబరచడం, సెమీకండక్టర్ పరిశ్రమలో అధిక నాణ్యతను సాధించడం, క్వాంటం కంప్యూటింగ్ వంటి పలు సాంకేతిక విభాగాల్లో ఇది చాలా ముఖ్యమైనది. అందుకే, ప్రపంచవ్యాప్తంగా హీలియం అవసరం 2035కి రెట్టింపు అవుతుందని అంచనా.ఈ కొత్త పరికరం కేవలం చైనాకే కాకుండా, ప్రపంచ హీలియం సప్లై చైన్ లోనూ ఒక మైలు రాయి నిలిచిపోతుంది.

## భారీ బ్లాక్‌హోల్ విలీనం

అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం అత్యంత భారీ కృష్ణ బిల (బ్లాక్ హోల్) విలీనాన్ని గుర్తించింది. జిడబ్ల్యు231123 అని పిలిచే ఈ సంఘటనను ఇప్పటి వరకూ గుర్తించిన బ్లాక్‌హోల్ విలీనాల్లో అత్యంత పెద్దది. గురుత్వాకర్షణ తరంగ నెట్‌వర్క్‌ను అందించిన లిగో విర్గో కాగ్రా (ఎల్‌వికె) సహకారంతో ఈ విలీనాన్ని పరిశీలించడం సుసాధ్యమైంది. సాధారణంగా రెండు కాల రంధ్రాలు తమతమ కక్ష్యల్లో తిరుగుతూ, ఒకదానికొకటి ఆకర్షించుకుంటూ ఉంటాయి. గురుత్వాకర్షణ తరంగాలను వి శ్వంలోకి విడుదల చేస్తుంటాయి. ఈ క్రమంలో ఈ రెండు ఒకదానికొకటి సమీపంలోకి వెళతాయి. అలాంటి సందర్భాల్లో విలీనాలు సంభవిస్తాయి. రెండు బ్లాక్‌హోల్స్ బలంగా ఢీకొని ఒకే బ్లాక్‌హోల్‌గా మారిపోతాయి. ఈ గురుత్వాకర్షణ తరంగాలను భూమిపై గురుత్వాకర్షణ తరంగ పరిశీలనశాలల ఎల్‌వికె నెట్‌వర్క్ వంటి అబ్జర్వేటరీలు గుర్తిస్తాయి. జిడబ్ల్యు 231123 బ్లాక్‌హోల్ శక్తిని అంచనా వేయడం కూడా కష్టమే. సూర్యుని ద్రవ్యరాశికి దాదాపు 100, 140 రెట్లు ఉన్న రెండు కృష్ణ బిలాలు ఢీకొన్నాయి. దీనితో సూర్యుని ద్రవ్యరాశికి దాదాపు 225 రెట్లు ఎక్కువ ఉన్న ఒకే ఒక భారీ కృష్ణ బిలం ఏర్పడింది. ఇంత భారీ బ్లాక్‌హోల్ ఊహాతీతమైనది. నిజానికి జిడబ్ల్యు 231123 నుండి వచ్చిన తరంగాల ఉద్భవం కొన్ని బిలియన్ల సంవత్సరాల క్రితమే జరిగింది, కానీ ఈ ఏడాదిలో అవి భూమిని చేరుకున్నాయి. 60 సౌర ద్రవ్యరాశి కంటే తక్కువ ఉన్న సాధారణ నక్షత్ర కృష్ణబిలాల మాదిరిగా కాకుండా, జిడబ్ల్యు 231123 చాలా పెద్దది. అసాధారణంగా వేగంగా తిరుగుతుంది. ఈ లక్షణం దీని ఆవిష్కరణను మరింత ఆసక్తికరంగా మారుస్తున్నది. ఇంత పెద్ద బ్లాక్ హోల్స్ సాధారణంగా భారీ నక్షత్రాల కూలిపోవడం వల్ల వస్తాయని భావిస్తారు. అయితే, తాజా సంఘటన కొన్ని చిన్న బ్లాక్ హోల్స్ విలీనం ద్వారా కూడా పెద్ద కృష్ణబిలాలు ఏర్పడతాయన్న కొత్త సిద్ధాంతం తెరపైకి వచ్చింది.



# ప్రజల జీవనగతిని మార్చిన సాయుధ పోరాటం

**సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు**

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తెలంగాణ జీవన గతిని మార్చిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. నిజాం రక్కసి పాలన అంతం కోసం జరిగిన పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎం.వెంకటాయపాలెంలో సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. అమరవీరుల స్మారక స్తూపం వద్ద సిపిఐ పతాకాన్ని రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. అమరులు గంగవరపు శ్రీనివాసరావు, గంగవరపు విజయ్‌కుమార్ విగ్రహాలకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్ధినేని కర్ణకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకున్న తర్వాత రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దం మోహినుద్దీన్ 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని హేమంతరావు తెలిపారు. ఆనాటి పోరాటంలో సామాన్యులు సాయుధులై పోరాడారన్నారు. నాటి సాయుధ పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, మిడికంటి వెంకటరెడ్డి, జిల్లా నాయకులు పుచ్చకాయల సుధాకర్, ఉన్నం రంగారావు, లింగా వెంకటనారాయణ, పాసంగుల పాటి చందర్‌రావు, పగిళ్ల వీరభద్రం, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వెంపటి సురేందర్, బండి మాధవరావు, బత్తినేని సీతారాములు, మెట్ల యాదయ్య, యన్నం భాస్కర్, రామ్మూర్తి, బండి ఉపేందర్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం...

**ఖానాపూర్ :** తెలంగాణ సాయుధ పోరాటంలో నిర్మల్ జిల్లా చరిత్రను స్మరించుకోవాలని సిపిఐ నిర్మల్ జిల్లా జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ మండల కేంద్రంలో సాయుధ పోరాట వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భూక్యా రమేష్ మాట్లాడుతూ నాటి సాయుధ పోరాటంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చాలామంది పాల్గొన్నారని, జైలుకు వెళ్లారన్నారు. వెట్టి చాకిరి విముక్తికి రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను సన్నద్ధం చేయడంలో కమ్యూనిస్టు పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. ఆంధ్ర మహాసభ, ఆర్య సమాజ్ వంటి సంఘాలు కమ్యూనిస్టులతో కలిసి నిజాం పాలన నుండి తెలంగాణ విముక్తి కోసం పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నరసింహులు, పిట్టల భీమేష్, పిల్ల రమేష్, గంగాధర్, బగ్గు రాజన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సరూర్‌నగర్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం వంటి అనేక మంది త్యాగాలు మరువలేనివని, వారి ఆశయ సాధన కోసం నేటి మహిళలు ముందుకు సాగాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఫైమిదా అన్నారు. సరూర్‌నగర్ డివిజన్‌లో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు సరూర్‌నగర్ మండల కార్యదర్శి కమలమ్మ ఆధ్వర్యంలో సిపిఐ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ, సిపిఐ మాజీ సర్పంచ్ ఆర్.గోపాల్, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

**ఆలేరు :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దేశానికే తలమానికమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బస్టాండు వద్ద గల కట్కూరి సుశీలమ్మ రామచంద్రరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కట్కూరి దంపతుల పాత్ర ఎనలేనిదన్నారు. రజాకార్లకు దేశముకులకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిన ఘనత కట్కూరు దంపతులదన్నారు కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, రాజు, రవి, పోతు ప్రవీణ్, సామి, ఆంజనేయులు, శీను, జంగ సరళ, నీలమ్మ మోతే భవాని, సంపత్, జార బిక్షపతి, పూలమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**డిండి :** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా శుక్రవారం డిండి మండల కేంద్రంలో సిపిఐ ఉద్యమకారులు, అమరులు కృష్ణ శర్మ, ఎలిమినేటి పెద్దయ్య, చింతకుంట్ల వెంకటయ్య స్మారక స్తూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయుధ పోరాట వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన మహత్తర సాయుధ పోరాటానికి రావినారాయణరెడ్డి, మద్దుమ్ మైనోద్దిన్, దొడ్డి కొమురయ్యల నాయకత్వంలో సాగిని ఈ పోరాటంలో 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి, దున్నేవాడికి భూమి కావాలని జాకీర్దారులు జమీందారులకు వ్యతిరేకంగా ప్రజల్ని విముక్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దిన్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శులు విజేందర్‌రెడ్డి, శైలేష్, మండల కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, కేశవులు, శ్రీనయ్య, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, సిపిఐ శాఖ కార్యదర్శులు లక్ష్మారెడ్డి, చక్రి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లింగమయ్య, అజయ్‌శర్మ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, ఎఐఎస్‌ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్, జమిల్ తదితరులు పాల్గొన్నారు.




మద్దూరు/ధూల్మిట్ట...

### ''బైరాన్‌పల్లి'ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి''

**మద్దూరు/ధూల్మిట్ట :** తెలంగాణ సాయుధ పోరాట స్మృతి చిహ్నాలు బైరాన్‌పల్లి గుండ్రాంపల్లి లాంటి పోరాటాల ఖిల్లాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ కోరారు. తెలంగాణ సాయుధ పోరాట 77వ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం బైరాన్‌పల్లి గ్రామ నెత్తుటి చరిత్రలో అమరులైన వీరులకు, అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరుల బలిదానం చేసిన బురుజు వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంద పవన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు పోరాట స్ఫూర్తి బైరాన్‌పల్లి నెత్తుటి చరిత్ర అని, నిజాం నిరకుషత్వం ధన, మాన, ప్రాణ దోపిడీలను ఎదురించి 118 మంది ప్రాణాలొడ్డిన బైరాన్‌పల్లి పోరాట చరిత్రను దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘటన అని పేర్కొన్నారు. భావితరాలకు నాటి పోరాట చరిత్రను తెలిపేందుకు పాఠ్యాంశాలలో సిలబస్‌గా చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, కనుకుంట శంకర్, అందె అశోక్, ఈరి భూమయ్య, జేరిపోతుల జనార్ధన్, కుడిక్యాల బాల్‌మోహన్, కత్తుల బాస్కర్‌రెడ్డి, వలబోజు నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

### చరిత్రను వక్రీకరిస్తే ఊరుకునేదిలేదు

**నాగర్‌కర్నూల్ :** ప్రపంచ పోరాట చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడ్డ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో సమాజంలోని సకల ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహా, జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ పిలుపునిచ్చారు. కొల్లాపూర్ ఎన్‌టిఆర్ చౌరస్తా వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను స్మరించుకుంటూ సిఆర్ శర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతాన్ని విలీనం చేసేంతవరకు మట్టి మనుషులు మహావీరులుగా మారినటువంటి చరిత్ర తెలంగాణ సాయుధ పోరాటానిదన్నారు. స్వేచ్ఛస్వాతంత్ర్యం కోసం, బానిస బతుకుల విముక్తి కోసం వెట్టిచాకిరిని రూపుమాపడం కోసం జరిగిన ఉద్యమం అన్నారు. కార్యక్రమంలో తుమ్మలశివుడు, ఆర్.ఇందిరమ్మ, కుర్మయ్య, కిరణ్‌కుమార్, బండి లక్ష్మి పతి, నాయకులు యూసుఫ్, శివుడు, చందు, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు శివకృష్ణ, గుర్రంశేఖర్, రాము, శేఖర్, గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్...



నాగర్‌కర్నూల్...



ఆలేరు...



దేవరకొండ...



నిర్మల్...



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ఉద్యోగోన్నతితోపాటు బాధ్యతలు కూడా పెరుగుతాయి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఉద్యోగోన్నతితో పాటుగా బాధ్యతలు కూడా పెరుగుతాయని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. ఆర్మడ్ రిజర్వ్ నందు కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్న కె వీరబాబు, కె మహేష్, బి జానయ్యలు ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్‌గా పదోన్నతి పొందారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి వారికి ప్రమోషన్ ఉత్తర్వులు అందజేసి, మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. పోలీసు శాఖకు మంచి పేరు తేవాలని కోరారు. క్రమశిక్షణతో మెలగాలని, తోటి సిబ్బందిని గౌరవించాలని, సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. ఆరోగ్యం పట్ల, కుటుంబాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, ఏఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, ఏఆర్ డిఎస్‌పి నరసింహ చారి, పోలీసు సంఘం అధ్యక్షులు రాంచందర్ గౌడ్, ఆర్ఎస్ఐలు సురేష్, యం అశోక్, కె అశోక్, అన్వర్, సాయిరాం, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## దింపుడుగల్లం ఆశలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు

వారి సమాధానాలు బలహీనంగా ఉన్నాయి

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఫిరాయింపు ఎమ్మెల్యేలు దింపుడుగల్లం ఆశలో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి జగదీష్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌గా ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాధానాలు బలహీనంగా ఉన్నాయని పేర్కొన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదని స్పీకర్‌కు చెప్పడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని తాము కేవలం నియోజక వర్గ అభివృద్ధి కోసమే కలిశామంటే ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. ఆయన కప్పిన పార్టీ జెండాను జాతీయ జెండా అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జాతీయ జెండాను హేళన చేసేలా ఎమ్మెల్యేలు మాట్లాడడం సరికాదన్నారు. దొంగతనం చేసి తప్పించుకోలేని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని అన్నారు. నమ్మిన పార్టీకి, ప్రజలకు ద్రోహం చేసిన వారిని ఎవరూ క్షమించరన్నారు. కోట్లాది మంది ప్రజలకు గంతలు కట్టే ప్రయత్నం చేయడం మంచిదికాదని హితవు పలికారు. తమ నేత కెసిఆర్‌పై నమ్మకం ఉన్నప్పుడు నోటీసులు ఇచ్చినప్పుడు అతని వద్దకు రావాలి కదా అని అలా కాకుండా సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి ఎందుకు వెళ్ళారో చెప్పాలని నిలదీశారు. ప్రజల ముందు అడ్డంగా దొరికిన దొంగలన్నారు. రేవంత్ రెడ్డి కాదుకదా ఎమ్మెల్యేలను ఇంకా ఎవరూ కాపాడలేరన్నారు. ఆ నియోజక వర్గాలలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని జోస్యం చెప్పారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం...

డాక్టర్ అశోక్‌ను సస్పెండ్ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** మండలంలోని కూరెళ్ళ గ్రామంలో గల పల్లె దవాఖానలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అశోక్ విధులపట్ల నిర్లక్ష్యం వహించడంతో కలెక్టర్ హనుమంతరావు విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అశోకుని సస్పెండ్ చేయమని డీఎంహెచ్వో కు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం కలెక్టర్ హనుమంతరావు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మికతనికి తనిఖీ నిర్వహించగా డాక్టర్ విధులకు రాకపోవడంతో, అక్కడ ఉన్న గ్రామ ప్రజలు డాక్టర్ సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కలెక్టర్ తెలుపగా సస్పెండ్ చేయమని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం తుక్కాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళను పరిశీలించారు. మండల కేంద్రంలోని ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరువాగును పరిశీలించి, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు దాటడానికి ప్రజలు ప్రయత్నం చేయవద్దని, యువకులు సెల్ఫీల కోసం ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాములు నాయక్,ఎంపీ ఓ పద్మావతి,పంచాయతీ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.8 వేలకోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ




**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ లోని ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులు వివిధ కోర్సులు చదువుతూన ప్రభుత్వం సకాలంలో ఫీజులు ఇవ్వకపోవడం వల న చదువుల మధ్యలో ఆపాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మూడు సంవత్సరాల నుండి విద్యార్థులకు ఫీజులు ఇవ్వకపోతే చదువులు ఎలా కొనసాగుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకుండా తక్షణమే బకాయి ఫీజులు చెల్లించాలని కోరారు. ఫీజులు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తారని హెచ్చరించారు. అనంతరం వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉదయ్, శ్రీకాంత్, చరణ్, రవి, మహేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో లిఖించదగినది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లిలో రావి నారాయణరెడ్డి స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి నర్సింహా మాట్లడతూ భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ ప్రజల విముక్తి కోసం గెరిల్లా యుద్ధ చరిత్రను నేడు బీజేపీ పార్టీ వక్రీకరిస్తూ హిందు ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా నమ్మించే ప్రయత్నం చేస్తుందన్నారు. చరిత్రను తిరిగేస్తే అందరికి తెలుస్తుందన్నారు. చరిత్ర ఒకరకంగా రాజకీయాల కోసం మరోరకంగా చిత్రీకరిస్తే ప్రజలు తిరగబడ్తారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రభుత్వం పాఠ్యాంశాల్లో చేర్చి యువతకు తెలిసేలా చేయాలన్నారు. ప్రభుత్వం సెప్టెంబర్ 17న విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు బాలగోని మల్లయ్య, గంగాపురం వెంకటయ్య, గాలయ్య, ఉట్కూరి కృష్ణ, పెండెం రవీందర్, ఏనూతల రమేష్, చిండెం మల్లేష్, పల్లె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# పాలకుడిని కాదు..సేవకుడిలా పని చేస్తా

దేవరకొండ శాసనసభ్యులు బాలునాయక్



**ప్రజాపక్షం/చింతపల్లి :** గ్రామాల రూపురేఖలు మార్చేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకుడిలా కాకుండా ప్రజా సేవకుడిలా పని చేస్తానని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. జనహిత ఎంఎల్ఏ మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో పలువురు అధికారులతో కలిసి పలు కాలనీల్లో పర్యటించి ప్రజలనుండి నేరుగా సమస్యలు తెలుసుకొని పలు సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. అదేవిధంగా ఆర్అండ్ఆర్ కాలనీలో పలు అభివృద్ధి పనులకు, మండల పరిధిలోని హరిజానాపురం గ్రామంలో మంచి నీటి ట్యాంక్ నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలసి శంకుస్థాపన చేశారు. గ్రామీణ మౌళిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని అన్నారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జెసి శ్రీనివాస్, ఆర్‌డిఓ రమణారెడ్డి, మాజీ ఎంఎల్ఏ ఉజ్జిని యాదగిరిరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, నాగభూషణం, ముచ్చర్ల గిరి, వెంకటయ్య గౌడ్, యాదగిరిగౌడ్, పవన్‌కుమార్, రాంసింగ్, నర్సిరెడ్డి, కొండల్‌యాదవ్ పాల్గొన్నారు.

**ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు స్థల పరిశీలన**

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని కేజిబివి స్కూల్ పక్కన ప్రభుత్వం నిర్మించదలిచిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్‌తో కలిసి స్థలం ను పరిశీలించారు. స్కూల్‌కు అవసరమైనటువంటి 25 ఎకరాలను సమగ్రంగా గుర్తించాలని ఆర్డివో రమణారెడ్డికి కలెక్టర్ సూచించారు. అవసమైతే రైతుల వద్ద నుండి కూడా స్థలం సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జే. శ్రీనివాస్, తహశీల్దార్ నరేందర్, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సబ్జెక్టులో 70 శాతం వచ్చేలా కార్యాచరణ

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశం




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో కనీసం 70 శాతం వచ్చే విధంగా టీచర్లు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్స్, వెల్ఫేర్ కళాశాలలు, కెజిబివిలకు సంబంధించిన ప్రిన్సిపాల్స్‌తో ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరాల అకాడమీక్ సంబంధించి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలల మీద నమ్మకంతో విద్యార్థులు వస్తున్నారని వారికి అర్థమయ్యేలా బోధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకునేలా అందరం కలిసి వారిని తీర్చిదిద్దాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల హాజరు శాతం చాలా తక్కువగా ఉంటుందని ప్రతి విద్యార్థి యొక్క తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రతి సబ్జెక్టు టీచర్ వారితో మాట్లాడాలని వారి పిల్లలు ప్రతి రోజు కళాశాలకు వచ్చేలా చూడాలని 1, 2 టెస్టులకు సంబంధించి ఫలితాలు తెలియజేయాలని అలాగే ఇంటి వద్ద కూడా చదివిపించాలని తల్లిదండ్రులను కోరారు. ఇంటర్ చదివే విద్యార్థులు కష్టపడితే ఏదైనా సాధిస్తారు కాబట్టి వారికి చదువుకుంటే కలిగే ప్రయోజనాలు, కెరియర్‌పై మోటివేషనల్ క్లాసులు తీసుకొని ప్రోత్సహించాలన్నారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా లాంటి వాటిని విద్యార్థులు ఉపయోగించి పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేలా చూడాలని తెలిపారు. ప్రతి సోమవారం, మంగళవారం స్టాఫ్ అటెండెన్స్ 100శాతం హాజరవ్వాలని అత్యవసరం ఉంటే తప్ప సెలవు మంజూరు చేయకూడదని ఈ సందర్భంగా ఆదేశించారు. వచ్చే సోమవారం ప్రిన్సిపాల్స్ స్టాఫ్‌తో సమావేశం నిర్వహించి ఇటీవల విద్యార్థులకి నిర్వహించిన 1, 2 టెస్ట్‌లకు సంబంధించి ఫలితాలపై సమీక్ష చేయాలని తదుపరి వార్షిక పరీక్షల నాటికి ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్టులో కనీసం 70 శాతం మార్కులు తెచ్చుకునేందుకు కార్యాచరణ లిఖితపూర్వకంగా సంబంధిత సబ్జెక్ట్ టీచర్ నుండి నివేధిక తీసుకోవాలని తదుపరి సమావేశం సెప్టెంబర్ 22న అట్టి నివేధికలపై సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి భాను నాయక్, జిసిడిఓ పూలన్, డిసిఓలు పద్మ, లక్ష్మి, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# అక్రమ యూరియా అధిక ధరలకు విక్రయిస్తే పిడియాక్ట్

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్



**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో యూరియా అక్రమ నిల్వ చేసిన,పక్కదారి పట్టించిన,అధిక ధరకు విక్రయించిన కఠిన చర్యలు తప్పవు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ హెచ్చరించారు. శుక్రవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు పది ఫర్టిలైజర్స్ దుకాణాలలో టాస్క్ ఫోర్స్ బృందాలతో అకస్మిత తనిఖీలు నిర్వహించగా, రైతులను మోసం చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న పలువురు పై నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఒక కేసు, గుర్రంపోడు పోలీస్ స్టేషన్ లో మూడు కేసులు, శాలిగౌరారం పోలీస్ స్టేషన్ లో ఒక కేసు, మొత్తం ఐదు కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఫర్టిలైజర్ షాప్‌ల లైసెన్స్ రద్దు చేయుట కొరకు కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు వెల్లడించారు.ఎవరైనా యూరియాను అక్రమ నిల్వలు చేసినట్లు, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని అలాంటి వారిపై పిడియాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, ఆగ్రోస్ వ్యవసాయ దుకాణాల ద్వారా యూరియాను సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఫర్టిలైజర్స్ యజమానులు ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేస్తున్న యూరియా ధరలను, యూరియా స్టాక్ వివరాలను దుకాణం ఎదుట పట్టికలో ప్రదర్శించాలని తెలిపారు. అలాగే యూరియాను కృత్రిమ కొరత సృష్టించకుండా రైతులకు సహకరిస్తూ ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సాగు దృష్ట్యా యూరియాను సకాలంలో రైతులందరికీ అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటుందని,ఎవరైనా జిల్లాలో ప్రభుత్వ సబ్సిడీపై సరఫరా చేస్తున్న యూరియా రైతులకు అందకుండా అక్రమ నిల్వ చేసిన,ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కాకుండా అధిక ధరలకు విక్రయించినా, పక్కదారి పట్టించినా,ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## కుక్కల దత్తత, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** కుక్కల దత్తతతో పాటు, వ్యాక్సినేషన్ చేసేందుకు ఉద్దేశించి జిల్లా యంత్రాంగం పెద్ద ఎత్తున చేపట్టనున్న కుక్కల దత్తత, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించనున్నారని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్నారాయణ్ అమిత్,పశుసంవర్ధక, మున్సిపల్, అధికారులతో కలిసి కుక్కల వ్యాక్సినేషన్, దత్తతకై ఏర్పాటు చేస్తున్న రాంనగర్ పార్కులో ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుక్కల దత్తత కార్యక్రమంలో భాగంగా 13 న ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని,ముఖ్య అతిథులకు పోలీస్ డాగ్స్ ద్వారానే సెల్యూట్ తో పాటు, బొకేల అందజేత ఉంటుందని, అనంతరం కుక్కలకు ఇచ్చే వ్యాక్సినేషన్ ని ముఖ్య అతిథి పరిశీలిస్తారని, దత్తత ఇచ్చే కుక్కల పరిశీలన, బెలూన్లు ఎగరవేయడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ఈ సందర్భంగా నిర్వహించే పోలీస్ డాగ్ విన్యాసాలను తిలకిస్తారని తెలిపారు. నల్గొండ జిల్లాలోని జంతు ప్రేమికులు ప్రత్యేకించి కుక్కలు దత్తత తీసుకోదల్చుకున్నవారు రాంనగర్ పార్క్ లో ఉదయం 7:30 గంటలకు హాజరుకావాలని ఆమె కోరారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిడాక్టర్ రమేష్ ,మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఉన్నారు.

## బస్సులలో విద్యార్థులను తీసుకెళ్ళడంలో జాగ్రత్తలు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు సూచన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన ప్రతి బస్ పూర్తి ఫిట్నెస్ కలిగియుండి, అర్హులైన డ్రైవర్లను నియామకము చేయడం, విద్యార్థులను బస్సులలో తీసుకెళ్ళడం,పాఠశాలకు తీసుకురావడం విషయం లో తగు జాగ్రత్తలు తిసుకొవాలని అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ ప్రయివేటు పాఠశాలల యాజమాన్యలకు సూచించారు. జిల్లాలోని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యములు వారి బస్సుల యొక్క డ్రైవర్స్‌తో సమావేశము నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్సు పాఠశాలకు వచ్చే సమాయానికి విద్యార్థులు బస్సు దిగి వారి గమ్యస్థానం చేరే వరకు కూడా ఓ ఆయా లేదా అటెండర్లను నియామకము చేసి విద్యార్థులు తరగతి గదులలోనికి వేళ్లేంతవరకు జాగ్రత్తలు వహించడం వంటివి పాటించాలన్నారు. డివిజన్ మండల పరిధిలో టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రయివేటు పాఠశాలల యాజమాన్యములు వారు బస్సుల నిర్వాహణ విషయములో తగు జాగ్రత్తలు తీసుకొనటుకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా ఆదేశించారు.డిఈఓ బిక్షపతి,డిప్యుటీ ట్రాన్స్పోర్స్ కమీషనర్ లావాణ్య, రెవెన్యూ డివిజనల్ అధికారి వై శెఖర్ రెడ్డి,యంవిఐలు, అసిస్టెంట్ యంవిఐలు, ప్రయివేటు పాఠశాలల వ్యవహర్తలు, పాఠశాలల బస్ డ్రైవర్స్ పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ఉదయాదీత్య భవన్‌లో జిల్లా అధికారులతో నిర్వహిస్తున్న సమీక్ష సందర్భంగా ఈ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. అందువల్ల ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు సమర్పించేందుకు ఎవరు జిల్లా కేంద్రానికి రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.వచ్చే సోమవారం ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

## యూరియా బస్తాల కోసం రైతుల అవస్థలు...

రైతులకు యూరియా సరఫరాలో కేంద్రం నిర్లక్ష్యం...రైతు సంఘం

**ప్రజాపక్షం/డిండి :** డిండి మండల కేంద్రంలో రైతులు యూరియా కోసం సహకార కేంద్రం వద్ద శుక్రవారం ఉదయం నుండే బారులు తీరారు. తాము వేసుకున్న వరి , పత్తి ఇతర పంటలకు యూరియా చేసేందుకు యూరియా బస్తాల కోసం సహకార సంఘం వద్ద బారులు తీరి ఈ రోజైనా యూరియా మా వరకు వస్తుందో లేదోనని సందిగ్దంలో రైతులు క్యూలో నిలబడి వేచి చూస్తున్నారు. యూరియా సరఫరా వద్ద ఇబ్బంది కలగకుండా డిండి ఎస్ఐ బాలకృష్ణ తన సిబ్బందిని కేటాయించారు. మండలానికి ఒక రోజు 400 బస్తాలతో లారీ వస్తే డిండి టాప్లపు సొసైటిలకు 200 చొప్పున యూరియా బస్తాలు సహకార కేంద్రాలకు రాగా రైతులకు పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కార్డు చూసి ఈపాస్ మిషన్లో తంబు వేయించుకొని ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియాను సహకార సంఘం సిబ్బంది అందిస్తున్నారు. సరిపడా యూరియా రాక రైతులు ఇబ్బంది ఎదుర్కొవాల్సి వస్తుందని మండలానికి సంబంధించి డిండి ప్రాజెక్టు ఆయకట్టు కింద ఇంకా వరినాట్లు సాగుతున్న నేపథ్యంలో మునుముందు రైతులకు ఇబ్బంది కలగకుండా రైతులకు సరిపడా యూరియాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని అందుకు సహకార సంఘం ఉన్నతాధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

రైతులు నానా ఇబ్బందులు పడుతూ అరకొర యూరియాతో సతమతమవుతున్నారని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి తెలంగాణ రైతాంగానికి సరిపడా యూరియాను అందించాలని సిపిఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్ అన్నారు. నల్గొండ జిల్లాలో డిండి ప్రాజెక్టు ఆయకట్టురైతాంగానికి యూరియా సరఫరాలో అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మైనోద్దీన్ అధికారులను కోరారు.

# కార్పొరేట్ శక్తులతో దెబ్బతింటున్న చిరు వ్యాపారాలు

స్థానిక వ్యాపారులను ప్రజలు ప్రోత్సహించాలి

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వ్యాపార రంగంలో కార్పొరేట్ శక్తుల రాకతో చిరు వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, స్థానిక వ్యాపారులను ప్రజలు ప్రోత్సహించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంతటి విజయ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జ్యూయలరీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా అధ్యక్షులుగా ఎన్నికైన అంతటి విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మన్నెం సింహాద్రి యాదవ్, కోశాధికారిగా బుర్లె మధుసూదన్‌తోపాటు ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్తక, వ్యాపార సంఘాలు, ఉద్యోగ సంఘాల కమిటిలు ఏకగ్రీవం కావాలని వీటిలో రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు. ప్రపంచీకరణ కార్పోరేట్ శక్తుల మూలంగా చిన్నవ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలు, కూరగాయలు, హెయిర్ కటింగ్ లాంటి చిన్న చిన్న వ్యాపారాల్లో కూడా పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు చొరబడుతున్నారని అన్నారు. దీంతో పేద, మధ్య తరగతి వారు ఎక్కువగా ఉన్న భారత్ వంటి దేశాలకు ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులు మంచిగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, కార్పోరేట్ శక్తుల మూలంగా కుల వృత్తులు దెబ్బతింటున్నాయన్నారు. ప్రపంచీకరణ ఆర్థిక విధానాలతో మొదట చేనేత రంగం, ఆ తరువాత వ్యవసాయ రంగం దెబ్బతిన్నాయన్నారు. కార్పోరేట్ శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు తన మద్ధతు ఎప్పుడు ఉంటుందని చెప్పారు. సూర్యాపేట జ్యూయలరీ అసోసియేషన్ సభ్యులు ఐక్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అలాగే వినియోగదారుల నమ్మకానికి అనుగుణంగా నాణ్యత గల మెరుగైన సేవలు అందించాలని కోరారు. అనంతరం కార్యవర్గాన్ని పట్టణ ప్రముఖులు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అంతటి విజయ్ కుమార్ మాట్లాడుతూ సంఘ బలోపేతానికి శాయశక్తులొడ్డి పని చేస్తానని చెప్పారు. వ్యాపారులు నమ్మకంతో పనిచేస్తే వినియోగదారుల మన్ననలు పొందుతారని అన్నారు. బంగారు వ్యాపారంలో ఎన్నో ఒడిదొడుకులు ఉంటాయని వాటన్నింటిని అధిగమించి వ్యాపారులందరూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి కమిటి చైర్మన్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్ కుమార్, మాజీ జిల్లా గ్రంథాలయ కమిటి చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్, నాయకులు ఉప్పల ఆనంద్, జ్యూయలరీ వ్యాపారులు గునగంటి రాములు, అంతటి రాములు, అంతటి కృష్ణ పాల్గొన్నారు.

## విద్యా బోధనలో మార్పు రావాలి



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాంఘిక శాస్త్ర యూపీ లెవల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు తీసుకురావాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ పేద విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షితులయ్యే విధంగా పనిచేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుని ఉపాధ్యాయ అవార్డు తీసుకున్న వారికి నల్లగొండ జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో సన్మానం చేశా రు. ఈ కార్యక్రమంలో ఫోరం అధ్యక్షులు నల్ల మేకల వెంకయ్య, నరసింహ నాయ క్, తిరుపతి,రహీం, ప్రభాకర్ రెడ్డి, జనార్ధన్, మాలి సైదులు, కల్పన,సరిత, పద్మ,వీరనారాయణ పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS
## మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కె.రాణి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తూముకుంట ప్రభుత్వ ఇసుక రీచ్ నుంచి గ్రామానికి చెందిన సుధాకర్ టీఎస్ 32 టీ 7126 ట్రాక్టర్ ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా సంగినేనిపల్లి గ్రామానికి ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక అవసరమైన వారు తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు.



## పేదప్రజల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం

### ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలపరిధిలోని గుడ్లనర్వ గ్రామానికి చెందిన లేట్ల వెంకటయ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ 20రోజుల క్రితం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హామీతో ఈనెల 8న గుండె ఆపరేషన్ చేయించి ఆదుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం నిమ్స్ ఆస్పత్రికివెళ్లి వెంకటయ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకొని ఆయనను పరామర్శించి రూ.6లక్షల ఎల్ఓసిని అందజేసి కుటుంబసభ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పేద ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలతో ఆదుకుంటామని ఇది పేదప్రజల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో గుడ్ల నర్వ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలస్వామి, నాగర్ కర్నూల్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**ప్రజాపక్షం/వంగూర్ :** శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి కొండారెడ్డిపల్లిగేటు సమీపంలో అచ్చంపేట మండలంలోని అక్కారంతండాకు చెందిన కళ(35) ప్రమాదవశాత్తూ ద్విచక్రవాహనంపై నుండి పడి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం అక్కారంతండాకు చెందిన బాలు తన ద్విచక్రవాహనంపై భార్య కళతో కల్వకుర్తి నుండి అచ్చంపేటవైపు వెళుతుండగా ప్రమాదవశాత్తూ కొండారెడ్డిపల్లిగేటు సమీపంలో రోడ్డుప్రమాదంలో మృతిచెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు తెగిపాయే ... రాకపోకలు నిలిచిపాయే: యుగంధర్

**ప్రజాపక్షం/పెబ్బేరు :** రోడ్డు తెగిపోయి... రాకపోకలు నిలిచిపోతున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోరా ..? అని బీసీ పొలిటికల్ జేఏసి స్టేట్ చైర్మన్ డా.రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు. శుక్రవారం పెబ్బేరు మున్సిపాల్టీ చెలిమిల్ల ... శేరుపల్లి సమీపంలో తెగిపోయిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో నిన్న కురిసిన వర్షానికి రోడ్డు తెగిపోయి రహదారి అస్తవ్యస్థమై ప్రజల ప్రయాణం గందరగోళంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 50 గ్రామాల ప్రజలు, పెబ్బేరు, ఇతర దూర ప్రాంతాలకు వెళ్లే ఎంతో మంది విద్యార్థుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయటంలో కాంట్రాక్టరు శ్రద్ధ చూపటంలేదని, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించి కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసి నాయకులు దేవర శివ, రాఘవేందర్ గౌడ్, చెలిమిల్ల రామన్ గౌడ్, యశ్వంత్, రమేష్ పాల్గొన్నారు.

## వెంకటేష్ అనుమానాస్పద మృతిని ఖండించిన బిసి సమాజ్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ మండలం మాచన్ పల్లి గ్రామానికి చెందిన బిసి బిడ్డ వెంకటేష్ ముదిరాజ్ మృతిపై అనుమానాలను నివృత్తి చేసి, బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని అదేవిధంగా ప్రేమ వ్యవహారమే మృతికి కారణమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్న నేపథ్యంలో పోలీసులు విచారణ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి , ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో కోరారు. వెంకటేష్ ప్రేమించిన యువతి కనిపించకపోవడంతో ఆమె బంధువులు వెంకటేష్‌ని కొట్టి ఆచూకీ చెప్పాలని బయటకు తీసుకెళ్లి బలవంతం చేసిన మరుసటి రోజే చెట్టుకు ఉరి వేసుకొని ఉండటం ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడం చూస్తే ఇది హత్య చేసి ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించారని శరీరంపై గాయాలు, వాతలు ఉన్నాయి. కనుక ముమ్మాటికి హత్య గావించబడ్డాడని శ్రీనివాస్ సాగర్ అనుమానం వ్యక్తం చేశారు.

## గౌడ సంఘానికి ఘనంగా సన్మానం



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట పట్టణంలో నూతనంగా ఎన్నికైన గౌండ్ల సంఘాన్ని, పట్టణ భారతీయ జనతా పార్టీ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో డా.ఎద్దుల రాజవర్ధన్ రెడ్డి సౌజన్యంతో స్థానిక కొత్తకోటలోని కొత్తకోట పీపుల్ స్కూల్ సెంట్రల్ ఆఫీసులో జరిగింది. గౌరవ అధ్యక్షులుగా ఎం.జనార్ధన్ గౌడ్, అధ్యక్షులుగా జి.వెంకటన్నగౌడ్, ఉపాధ్యక్షులుగౌ కృష్ణయ్యగౌడ్, రాఘవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గండు రవీందర్ గౌడ్ , కార్యదర్శి ఎం.నరేష్ గౌడ్, కోశాధికారి హరికృష్ణ గౌడ్ , ప్రచార కార్యదర్శి రఘునాథ్ గౌడ్, గౌరవ సభ్యులుగా దేవిగౌడ్, నారాయణగౌడ్, జి.వెంకటేష్ గౌడ్, శివశంకర్ గౌడ్, నరేష్ గౌడ్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము భరత్ భూషణ్ , సుబ్బిరెడ్డి, నారాయణమ్మ, మద్దిగట్ల శ్రీనివాస్ రెడ్డి, వనపర్తి శ్రీనివాస్ రెడ్డి, తాపస్ పట్టణ అధ్యక్షులు రాఘవేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంఇఒను కలిసిన కార్యకర్తలు

**ప్రజాపక్షం/అడ్డాకుల:** అడ్డాకుల ఎంఇఒగా నూతన బాధ్యతలు చేపట్టిన వి.ప్రకాష్‌ని, అడ్డాకుల మండల నాయకులు కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మునగల శెట్టి బాలరాజు, బిఎస్‌పి పార్టీ మండల అధ్యక్షులు పాతిరి ప్రసాద్, సామాజిక కార్యకర్తలు గుడిబండ నరసింహ, గుడిబండ అంజి, శాఖాపూర్ చెన్నకేశవులు, పొన్నాకల్ రామాంజీ పాల్గొన్నారు.

## సంక్షేమబోర్డు పరిరక్షణకు ఉద్యమం

### తెలంగాణ భవన నిర్మాణకార్మిక సంఘం (ఎఐటియూసి) రాష్ట్రప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** భవననిర్మాణ కార్మిక సంక్షేమబోర్డు పరిరక్షణ కోసం కార్మికులు ఉద్యమాల్ని తీవ్రతరం చేయాలని తెలంగాణభవన నిర్మాణకార్మిక సంఘం ఎఐటియూసి రాష్ట్రప్రధాన కార్యదర్శి పల్లాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. భవననిర్మాణ సంక్షేమబోర్డులో ప్రమాదవశాత్తూ, సహజమరణంచెందిన క్లయిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనికి తాకట్టుపెట్టిన ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నాగర్‌కర్నూల్‌లో జరిగిన ఎఐటియూసి తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్‌వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నో పోరాటాలుచేసి సాధించుకున్న సంక్షేమబోర్డును ఇన్సూరెన్స్‌రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేయడం బాధాకరమన్నారు. లేబర్‌డిపార్టుమెంట్ గుట్టుచప్పుడుకాకుండా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనికి బీమాపేరుతో రూ.250కోట్లు అప్పజెప్పడం దుర్మార్గమని ఆరోపించారు. 2009నుంచి మనరాష్ట్రంలో లేబర్‌డిపార్టుమెంట్ ద్వారా కార్మికులకు పథకాలు అందుతున్నాయి ఇప్పుడు ఎలాంటి కారణాలు లేకుండా బీమారంగానికి అప్పజెప్పడం ఎంతవరకు సమంజమన్నారు. రాష్ట్రంలో 15లక్షలకు




పైగా భవననిర్మాణ కార్మికులు సంక్షేమబోర్డులో నమోదై ఉన్నారన్నారు. భవననిర్మాణ సంక్షేమబోర్డు క్లయిములు బీమా కంపెనికి అగ్రిమెంట్ వెంటనే రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈసమావేశంలో ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, తెలంగాణ బిల్డింగ్‌అండ్‌కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటస్వామి, ఎఐటియూసి జిల్లా కోశాధికారి రవీందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు విజయ్, నర్సింహ్మా, మేస్త్రీలు పాల్గొన్నారు.

## గుడి నిర్మాణానికి శ్రీకారం



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని బీసీ కాలనీలో నిర్మాణం చేసే ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి సిల్పీ పాండుకు శుక్రవారం మూడు లక్షల రూపాయల నగదును చెల్లించి గుడి నిర్మాణానికి శ్రీకారం చేశారు. శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో గుడి నిర్మాణంపై అఖిల పక్ష నాయకులు చర్చించి త్వరగా గుడి నిర్మాణం పూర్తి చేయుటకు అందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు బి. కొండయ్య, లక్ష్మారెడ్డి, పి. నరసింహ గౌడ్, రాజుల ఆసి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రంజిత్ రెడ్డి , నీలప్ప , చిన్న హనుమంతు, కావలి వెంకటేష్, సత్య నారాయణ గౌడ్, వల్లంపల్లి లక్ష్మ ణ్ , జుట్ట శంకరు, అంబదాస్ మిఠాయి రమేష్, కథలప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల కేటాయింపుపై విచారణ జరిపించాలి



సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కొల్లాపూర్ నియోజకవర్గంలో గల ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికపై విచారణ జరిపించాలని సిపిఐరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్‌లు డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నిరుపేదలకు గృహాలు కల్పించే ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల పథకం కొల్లాపూర్ నియోజకవర్గంలో సరైన రీతిలో అమలవడం లేదని లబ్దిదారుల ఎంపికలో తీవ్ర అవకతవకలు జరిగాయని, వాటిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని అర్హులైన పేదలందరికి తక్షణమే ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కోరుతూ సిపిఐ కొల్లాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ చౌరస్తానుండి స్థానిక ఆర్‌డిఓ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించి అనంతరం ఆర్‌డిఓ కార్యాలయంముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐరాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు ఇస్తారని ఎన్నో ఆశలతో ఎదురుచూస్తుంటే తీరా ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇండ్లకేటాయింపు జరగడం అత్యంత బాధాకరమని వారు విమర్శించారు. గతంలో ప్రభుత్వ ప్రజా ప్రతినిధులకు అనేక సందర్భాల్లో వివరించిన మార్పు కనపడని ఎడల సిపిఐ ఈ ఆందోళన కార్యక్రమానికి పూనుకోవడం జరిగిందని, ఒక్కొక్క గ్రామంలో పదుల సంఖ్యలో 50 ఇండ్లు అవసరం ఉండగా 1520 ఇండ్లతో పేర్లు ప్రకటించుకోవడం జరిగిందన్నారు. అవికూడా ఎవరిపేర్లు ఉన్నాయి ఎవరు లబ్దిదారులు ఎవరు అర్హత లేనివాళ్లు ఉన్నారన్నటువంటి అంశాన్ని గోప్యంగా ఉంచడానికి సిపిఐ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఈవిషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విచారణ చేపట్టి బాధ్యులైనవారిపై చర్యలు చేపట్టకపోతే వారితోపాటు రాష్ట్రప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని వారు గుర్తుచేశారు. ఇదివరకే ఇండ్లు, ఆస్తులు కలిగినటువంటి వాళ్లు ఒకే ఇంట్లో ఇద్దరిపేర్లు ఇలా అనేక తప్పుల తడకగా ఏ మండలంలో గ్రామాల్లో చూసిన ఈ కేటాయింపులు జరగడం జరిగిందన్నారు. అందుకే సిపిఐ అన్నిగ్రామాల్లో అర్హులైన నిరుపేదలందరి పేర్లను స్వీకరించి స్థానిక ఆర్‌డిఓకి వారిపేర్లతో ఒక వినతిపత్రాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తుమ్మలశివుడు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఆర్.ఇంద్ర, కుర్మయ్య, కిరణ్‌కుమార్, బండిలక్ష్మి పతి, కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్, మండల నాయకులు జంగంశివుడు, చందుశంకర్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివకృష్ణ, గుర్రంశేఖర్, పవన్, గోవింద్‌రెడ్డి,చెన్నమ్మ,రాములమ్మ,లబ్దిదారులైన మహిళలు పాల్గొన్నారు.

## బాధితుడి కుటుంబానికి భరోసా



**ప్రజాపక్షం/అడ్డాకుల:** అడ్డాకుల మండలం కందూరు గ్రామానికి చెందిన కమ్మరి చంద్రయ్య (తిక్కన్న) ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిజెపి మాజీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూరు రమేష్ వారి మృతికి సంతాపం తెలుపుతూ స్థానిక పేదల ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు 5000 ఆర్థిక సాయం అందించారు. స్థానిక నాయకుల ద్వారా మృతుడి స్వగృహానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఉపసర్పంచు కాటవరం శంకర్, బొంబాయి బుచ్చయ్య మాదిగ, నాగరాజు గౌడ్, ఆర్టీసీ , వెంకటాచారి, కుమ్మరి నారాయణ, బోయ కోటయ్య మాదిగ, బాలకృష్ణయ్య, కుల పెద్దలు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా ఇండ్ల నిర్మాణం

### కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారులు నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం హన్వాడ మండలం వేపూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేసుకున్న పావనితో కలెక్టర్ మాట్లాడారు. ఎన్ని చదరపు అడుగులలో నిర్మాణం చేసుకున్నారు? 540 చదరపు అడుగులలో మేడం అని పావని కలెక్టర్‌కు తెలిపారు. దశలవారీగా నిర్మాణం ననుసరించి అకౌంట్లో డబ్బులు జమ అయినవా? ఇప్పటివరకు రెండు విడతల్లో డబ్బులు వచ్చాయి మేడ అని పావని తెలిపింది. పావని ఇంటిలోకి వెళ్లి గోడలు, స్లాబ్ వరకు పూర్తయిన ఇంటి నిర్మాణం పరిశీలించారు. నిర్మా ణం తీరు పరిశీలించిన కలెక్టర్ ఇల్లు చాలా అందంగా నిర్మాణం చేసుకున్నారని కలెక్టర్ అన్నారు. అనంతరం గ్రామంలో ఆయుష్, ఆరోగ్య మందిరంను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయుష్ ఆరోగ్య కేంద్రం మందిరం చుట్టూ చెత్త చెదారం గమనించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామం మొత్తం క్లీన్‌గా లేదని, చెత్త తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్యం లేకుంటే డెంగ్యూ, చికెన్ గున్యా, జ్వరాలు వ్యాపిస్తాయని పంచాయితీ సెక్రెటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెటర్నరీ సబ్ సెంటర్‌లో లైవ్ స్టాక్ అసిస్టెంట్ విధులకు సరిగా రావడం లేదు మాకు చాలా ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటర్నరీ అధికారితో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అయిన లైవ్ స్టాక్ అసిస్టెంట్ నరేష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని వెంటర్నరీ అధికారిని ఆదేశించారు. వెటర్నరీ సబ్ సెంటర్ ముందు వేసిన మట్టిని లెవెలింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**పత్తి పంటను కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి**

2025–26 వానాకాలం సీజన్‌లో అక్టోబర్ రెండవ వారంలో రైతులు పండించిన పత్తి పంటను కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా




కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వి.సి. కాన్ఫరెన్స్ హాల్ లో వానాకాలం 2025–26 మార్కెటింగ్ సీజన్లో పత్తి కొనుగోళ్లపై సి.సి.ఐ, మార్కెటింగ్, జిన్నింగ్ మిల్లులు యజమానులు, అగ్ని మాపక శాఖ, తూనికలు, కొలతలు శాఖ, పోలీస్, సంబంధిత అధికారులతో ముందస్తు కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025–26 వానాకాలం సీజన్ పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్న దృష్ట్యా పత్తి కొనుగోలుకు జిన్నింగ్ మిల్లులో అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో పత్తి కొనుగోలుకు నాలుగు జిన్నింగ్ మిల్లులు నోటిఫై చేయనున్నట్లు, మహబూబ్ నగర్‌లో ఒకటి, జడ్చర్లలో మూడు జిన్నింగ్ మిల్లులు నోటిఫై చేయనున్నట్లు మార్కెటింగ్, సి.సి. ఐ అధికారులు వివరించారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాఫీగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి కొనుగోళ్లకు సి.సి.ఐ కేంద్రాలకు వచ్చిన రైతులు తప్పనిసరిగా తమ యొక్క ఆధార్ కార్డును మొబైల్ నంబరుతో వేలి ముద్రల ద్వారా నవీకరణ ఆధార్ అథెంటికేషన్ చేయించుకోవాలని తెలిపారు. పత్తి రైతులు తమ యొక్క పంటను దళారులకు అమ్ముకోకుండా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వారి కొనుగోలు కేంద్రాలలో మాత్రమే అమ్ముకొని వానాకాలం సీజన్ కు పత్తి మద్దతు ధర రూ.8110 పొందాలని అన్నారు. సి.సి.ఐ అధికారులు తగినంత సిబ్బందిని జిన్నింగ్ మిల్లులు వద్ద నియమించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, అతి తొందరలో సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడం జరిగింది. పోలీస్ శాఖ పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశం లో రెవెనూ అదనపు కలెక్టర్ డా.ఏనుగు నరసింహ రెడ్డి, అదనపు కలెక్టర్ ఎస్.పి. రత్నం, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, జిల్లా మార్కెటింగ్ అధికారిని బాలమణి, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, సిసిఐ అధికారులు, తూనికలు కొలతల శాఖ అధికారి రవీందర్, జిన్నింగ్ మిల్లులు నిర్వాహకులు పాల్గొన్నారు.

## అమ్మ పేరిట మొక్క నాటుదాం



**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముదుమాలలో శుక్రవారం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఏక్ పేడ్ మాకే నామ్ (ఒక మొక్క అమ్మ పేరున) కార్యక్రమంలో భాగంగా మేగా ప్లాంటేషన్ నిర్వహించడం జరిగింది. 1 నుండి 5 తరగతి వరకు నిర్మాణాత్మక మూల్యాంకనం (ఎఫ్ఎ1) లో తెలుగు, ఇంగ్లీషు, గణితం, పరిసరాల విజ్ఞానం విషయాల యందు ఉత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి ర్యాంకు విద్యార్థుల వారి తల్లుల పేర్ల మీద మునగ, మిక్సిడ్ రాయల్ గ్రీన్ , అశోక్ మొక్కలు నాటించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడం కోసం గ్రామ పంచాయతీ సహకారంతో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్, పంచాయతీ కార్యదర్శి రాజు, ఉపాధ్యాయ బృందం హెల్త్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/నారాయణపేట్:** నారాయణపేట్ టౌన్, రూరల్, దామరగిద్ద పరిధిలో చాలా కాలంగా కోర్టులో పెండిగ్‌లో వున్న కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట సీఐ శివశంకర్ ఒక ప్రకటనలో ప్రజలకు తెలిపారు. ఈనెల 13 వ తేదీన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో నారాయణపేట కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడును. ఈ లోక్ అదాలత్ ద్వారా చట్టరీత్యా రాజీకి అర్హమైన క్రిమినల్ కేసులతో పాటు రాజీపడదగిన సివిల్ కేసులు, భూ వివాదాలు, వాసన ప్రమాద పరిహార కేసులు, చిట్ ఫండ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, వైవాహిక కేసులు, తగాదాలు, అన్ని రకాల ట్రాఫిక్ కేసులకు సంబంధించి జాతీయ లోక్ అదాలత్ నందు ఇరువర్గాల కక్షిదారులు అంగీకారయోగ్యమైన సత్వర పరిష్కారం ఈ లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చని మరిన్ని వివరాలను లోకల్ పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించాల్సిందిగా సిఐ తెలిపారు.

## ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్ల పట్టివేత




**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి పర్మిషన్ లేకుండా అర్థ రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుంటే రెండు టిప్పర్లను టాస్క్ ఫోర్స్ మాగనూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి నల్లగట్టు మారెమ్మ టెంపుల్ రోడ్డుపై పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించి విచారించగా 1.టిప్పర్ నెంబర్ కేఏ 33 బి 2526 డ్రైవర్ అలిపురం సిద్ధన్న తండ్రి మల్లయ్య, అలిపురం యాద్గిర్, కర్ణాటక ఓనర్ సలీం అహ్మద్ తండ్రి మహబూబ్ యాద్గిర్, కర్ణాటక, 2.టిప్పర్ నెంబర్ కేఏ33 బి 7677 డ్రైవర్ చంద్రప్ప తండ్రి మారెప్ప, గుల్బర్గా, కర్ణాటక, ఓనర్ రాఘవేందర్ తండ్రి మల్లికార్జున్, యాద్గిర్, కర్ణాటక రాష్ట్రం, రెండు టిప్పర్ డ్రైవర్లు, ఓనర్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా పర్మిషన్ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే ఆ వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు.

## కోస్గి సామాజిక ఆరోగ్య కేంద్రం రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలి

### అన్ని రకాల వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు
### స్టేట్ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ

**ప్రజాపక్షం/నారాయణపేట్/మద్దూర్ :** నారాయణపేట జిల్లా కోస్గి సామాజిక ఆరోగ్య కేంద్రం రాష్ట్రంలోని మిగతా ఆరోగ్య కేంద్రాలకు (మోడల్) ఆదర్శంగా నిలవాలని స్టేట్ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు అన్నారు. ఇటీవల కాలంలో కోస్గి సీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రజారోగ్యం కాపాడటంలో వైద్యులు చిత్తశుద్ధితో వైద్య సేవలు అందించాలని ఆమె సూచించారు. శుక్రవారం నారాయణపేట జిల్లాలోని కోస్గి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని గైనిక్, పీడియాట్రిక్, మెయిల్, ఫిమేల్ సర్జికల్ వార్డు, ట్రై ఏజ్, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. చిన్న పిల్లల వార్డులోకి వెళ్ళి అక్కడ చికిత్స పొందుతున్న పలువురు చిన్నారులను చూసి ఆప్యాయంగా పలకరించారు. ఆ చిన్నారుల తల్లులతో మాట్లాడి పిల్లలకు వచ్చిన డెంగ్యూ జ్వరం ఎన్ని రోజుల క్రితం నుంచి ఉందని, ఆస్పత్రిలో ఎన్ని రోజుల నుంచి చికిత్స పొందుతున్నారని అడిగి తెలుసుకున్నారు. జ్వరం తగ్గేవరకు చాలా జాగ్రత్తగా పిల్లలను చూసుకోవాలని తెలిపారు. వాటితో పాటు రోజు వారి ఓపీ, ఐపి వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది మెడికల్ ఆఫీసర్లు ఉన్నారని, ట్రైనింగ్ అయిన నర్సింగ్ వాళ్లు ల్యాబ్‌లో ఎన్ని టెస్టులు చేస్తున్నారననే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్.అజయే కుమార్, టిజిఎంఎస్ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ఈడీ కౌటిల్య, సిఐఓ మంజునాథ్ నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ మసూద్ ఖాన్, ఐటీఈ అండ్ సీ అధికారి యశ్వంత్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్.మల్లికార్జున్, వైద్యులు అనిరుద్ పాల్గొన్నారు.

**బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలి**

పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం స్టేట్ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో



కలిసి పరిశీలించారు. మద్దూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో బయోమెట్రిక్ తప్పనిసరిగా అమలు చేయాలని ఆమె ఆదేశించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను తిరిగి రోగులతో మాట్లాడారు. వైద్య సేవల గురించి వాకబు చేశారు. అనంతరం ఆస్పత్రిలో కలెక్టర్, స్టేట్ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ శాఖ ముఖ్య అధికారులతో ఆస్పత్రి అభివృద్ధి, ప్రగతి, అవసరమైన వసతి సదుపాయాల గురించి సమీక్ష నిర్వహించారు. బిల్డింగ్, డ్రగ్స్ పెసిలిటి ,ఎన్ సీడి స్క్రీనింగ్, టీబి టెస్ట్, తదితర వాటి గురించి చర్చించారు.ఆస్పత్రికి వెయింటింగ్ కుర్చీలు, బెడ్స్, అవసరమని ఆర్ఎంవో పావని కోరారు.ఇంకా ఏమైనా అవసరము ఉంటే ప్రతిపాదనలు పంపించాలని ఫ్యామిలి స్టేట్ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ డైరెక్టర్ క్రిస్టినా సూచించారు.

# రీల్

## 19న 'అందెల రవమిది' విడుదల

నాట్యమార్గం ప్రొడక్షన్స్ బ్యానర్‌పై శివ బట్టిప్రోలు సమర్పణలో ఇంద్రాణి ధవళూరి నిర్మాతగా దర్శకురాలిగా తెరకెక్కించిన చిత్రం అందెల రవమిది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ తెలుగు సినిమా ప్రముఖుల మధ్య ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో దర్శకురాలు ఇంద్రాణి ధవళూరి మాట్లాడుతూ.. ఇలాంటి ఒక గొప్ప సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. తెలుగులో వచ్చిన ఎన్నో అద్భుతమైన సినిమాలు ముఖ్యంగా స్వర్ణకమలం సినిమా ఎంతో ప్రత్యేకం అని, ఆ సినిమా నుంచి ఎంతో స్ఫూర్తి పొందినట్లు చెప్పారు. విశ్వానాథ్ సినిమాలు కూడా ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. ఈ సినిమా ఇంత బాగా రావడానికి ఎంతో మంది కృషి ఉంది అని పేర్కొన్నారు. తెలుగు ఇండస్ట్రీలో ఎంతోమంది తనకు ఇన్స్పిరేషన్ అని చెప్పారు. తెలుగు సినిమా నిర్మాత కెవిన్ రామారావు, ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దాము లాంటి పెద్దలు ఈ సినిమాను ప్రోత్సహించడానికి వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే సినిమా పాటలు ఆదిత్య మ్యూజిక్‌లో షే అవుతున్నాయని చెప్పారు. కెవిన్ రామారావు మాట్లాడుతూ ఇంద్రాణి ధైర్యాన్ని మెచ్చుకోవాలి, ఇలాంటి క్లాసికల్ టైటిల్‌తో ఈ రోజుల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చినందుకు అని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సినిమా పూర్తిగా కమర్షియల్‌గా మారిపోయింది, ఇలాంటి సమయంలో సంగీతం, నాట్యంతో మళ్లీ ఇండస్ట్రీకి ప్రాణం పోయడానికి అమె అమెరికా నుంచి వచ్చారు అని కొనియాడారు. నిజమైన ఫ్యాషన్ అంటే ఇదే అని ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ అన్నారు . చాలామంది ఇండస్ట్రీకి ఎందుకు వస్తున్నారు అంటే ఫ్యాషన్ అంటారు కానీ ఇంద్రాణి ఫ్యాషన్ అంటే ఏంటో చూపించారు. ఒక సినిమాని ఆ ర్ట్ ఫామ్‌లో తీయడం ఉంటే మామూలు విషయం కాదు అందులోనూ నాట్యం అనే ఆటో ఫార్ములా ఎంచుకొని ఇంత చక్కగా ఒక సినిమాను ప్రేక్షకులకు అందించిన ఇంద్రానికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తారు. ఈ కార్యక్రమంలో యూఎఫ్ఓ లక్ష్మణ్, ఈస్ట్ వెస్ట్ డిస్ట్రిబ్యూటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




## శిల్పా శిరోద్కర్ నటనకు అవార్డ్ గ్యారంటీ

సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'జటాధర'. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్ బాబు ప్రొడక్షన్స్ పతాకం నిర్మిస్తోంది. ఈ సినిమాను వెంకట్ కళ్యాణ్ తెరకెక్కిస్తున్నారు. 'ఖుదా గవా', 'మృత్యుదండ్' వంటి చిత్రాలలో అద్భుతమైన నటనతో అందరినీ ఆకట్టుకున్న శిల్పా శిరోద్కర్ 'జటాధర' చిత్రంలోని పర్ఫార్మెన్స్‌తో అవార్డులన్నీ గెలిచేస్తారని ప్రేరణ అరోరా అన్నారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. "జటాధర'లోని శోభ అనే పాత్రలో నటించిన శిల్పా శిరోద్కర్‌కు అన్ని అవార్డులు వస్తాయని ఎంతో నమ్మకంగా చెబుతున్నాను. శోభ ఒక శక్తివంతమైన, సంక్లిష్టమైన పాత్ర. ఆమె ప్రేక్షకులను పూర్తిగా ఆశ్చర్యపరుస్తుంది' అని అన్నారు. 'జటాధర' సూపర్ నేచురల్ థ్రిల్లర్ అందరినీ ఆకట్టుకునేలా తెరకెక్కిస్తున్నారు. సస్పెన్స్, యాక్షన్, మిస్టరీల ప్రత్యేకమైన కథతో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. 'జటాధర'లో శిల్పా శిరోద్కర్, సోనాక్షి సిన్హా, సుధీర్ బాబు, ఇందిరా కృష్ణ, రవి ప్రకాష్, దివ్య ఖోస్లా, రాజీవ్ కనకాల, శుభలేఖ సుధాకర్, రోహిత్ పాఠక్ వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు.ఇప్పటికే శోభ పాత్రలో నటి శిల్పా శిరోద్కర్ ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.



## 'దక్ష'కు యు/ఎ సర్టిఫికెట్



మంచు లక్ష్మీ ప్రసన్న ప్రధాన పాత్రలో శ్రీలక్ష్మి ప్రసన్న పిక్చర్స్ అండ్ మంచు ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై రూపుదిద్దుకుంటున్న చిత్రం 'దక్ష ది డెడ్‌లీ కాన్స్పిరసీ'. ఇందులో డాక్టర్ మంచు మోహన్ బాబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తండ్రీ కూతుళ్లు కలిసి మొదటి సారిగా ఇందులో కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వంశీ కృష్ణ మల్లా అందించారు. ప్రస్తుతం ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని, సెన్సార్ బోర్డ్ నుంచి యు/ఎ సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 19న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ తన ట్వీట్‌లో.. "నా మిత్రురాలు, ఆప్తురాలైన లక్ష్మి మంచుకి, ఆమె తదుపరి చిత్రం దక్షకు శుభాకాంక్షలు. మీకు ఆత్మీయమైన నా ప్రేమను తెలియజేస్తున్నాను. మీరు, మోహన్ బాబు గారు కలిసి తెరపై కనిపించడం చాలా అద్భుతంగా ఉంది. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను. దర్శకుడు వంశీ కృష్ణ మల్లా , చిత్ర బృందానికి శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మి , సముద్రఖని, మలయాళ నటుడు సిద్దిక్, విశ్వంత్, చిత్రా శుక్లా, రంగస్థలం మహేష్, జెమినీ సురేష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అచు రాజమణి, ఛాయాగ్రహణం: గోకుల్ భారతి, నృత్య దర్శకురాలు: బృంద,
స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వంశీ కృష్ణ మల్లా.

## 'చాయ్ వాలా' నుంచి తొలి పాట 'సఖిరే' విడుదల



వైవిధ్యమైన సినిమాలతో తనదైన గుర్తింపు సంపాదించుకున్న యంగ్, ప్రామిసింగ్ యాక్టర్ శివ కందుకూరి హీరోగా 'చాయ్ వాలా' అనే చిత్రాన్ని హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్ మీద రాధా విజయ లక్ష్మి , వెంకట్ ఆర్. పాపుడిప్పు భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రమోద్ హర్ష రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో మేకర్స్ తొలి పాటను విడుదల చేశారు. 'సఖిరే..' అంటూ సాగే ఈ మెలోడీ సాంగ్ హృదయాలను హత్తుకుంటోంది. క్యాచీ ట్యూన్‌తో మ్యూజిక్ డైరెక్టర్ ప్రశాంత్ ఆర్.విహారి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. సురేష్ బనిశెట్టి రాసిన ఈ పాటను కపిల్ కపిలన్ పాడారు. ప్రేయసిపై గుండెలనిండా స్వచ్ఛమైన ప్రేమను నింపుకున్న హీరో తన భావాలను అందంగా ఈ పాట రూపంలో వ్యక్తం చేస్తున్నారు. హీరో శివ కందుకూరి స్టన్నింగ్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్నారు. హీరోయిన్ తేజు అశ్విని బ్యూటీతో చూపులు తిప్పుకోనీయటం లేదు. ఈ మెలోడీలో రొమాంటిక్ మూమెంట్స్ విజువల్ ట్రీట్‌లా ఉంది. పాట అందరూ పాడుకునేలా ఉంది. కపిల్ కపిలన్ గొంతు నుంచి వచ్చిన ఈ పాట మరింత మాధుర్యంగా అనిపిస్తోంది. ప్రేమించేవాళ్లకు, మ్యూజిక్ లవర్స్‌కు ఈ పాట బాగా కనెక్ట్ అవుతుంది.ప్రమోద్ హర్ష దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు ప్రశాంత్ ఆర్.విహారి సంగీతాన్ని అందిస్తున్నారు. క్రాంతి వర్ల సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి పవన్ నర్వ ఎడిటర్ గా పని చేస్తున్నారు.

## కన్నడ రాజ్ కుమార్, వీరప్పన్ కిడ్నాప్ కథాంశంతో చిత్రం



కాల భైరవ క్రియేషన్స్ శ్రీ విఘ్నేశ్వర చిత్రాలయ పతాకంపై అశోక్, ముని, నాగేష్ ప్రధాన పాత్రధారులుగా కట్ట శ్రీకర్ ప్రసాద్ దర్శకత్వంలో వి.లీల మనోహర్ నిర్మిస్తున్న చిత్రం అక్టోబర్‌లో షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి తెలుగు దర్శకుడు కట్ట శ్రీకర్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. కన్నడ కంఠీరవ రాజ్ కుమార్, వీరప్పన్ కిడ్నాప్ కథాంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కించడం జరుగుతుందని దర్శకుడు శ్రీకర్ ప్రసాద్ తెలిపారు. అప్పటి కిడ్నాప్ కోణంలో పలు అంశాలను ఈ చిత్రంలో చర్చించడం జరుగుతుంది. పూర్తి వివరాలు దసరా తర్వాత వెల్లడిస్తామని అన్నారు.ఈ చిత్రానికి సమర్పణ: ఎస్ ఏ గోవిందరాజులు, కథ: బి అనయ్య,స్క్రిప్ట్ రైటర్: బి రామ్మూర్తి,సంగీతం: అర్జున్ జన్య, కెమెరా: కె. మనోహర్,ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: పరిటాల రాంబాబు, కో ప్రొడ్యూసర్: మహాదేవ్, (కేంపన్న).

## దీపావళికి 'మిత్రమండలి' విడుదల

ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ స్థాపించిన నిర్మాణ సంస్థ బి.వి. వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'మిత్ర మండలి' చిత్రం హాస్యం, రహస్యం, యవ్వన శక్తి మిశ్రమంగా ప్రేక్షకులకు అపరిమిత వినోదాన్ని అందించడానికి సిద్ధమవుతోంది. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం., విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. వీరు వెండి తెరపై నవ్వుల టపాసులు పేల్చబోతున్నారు.నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాతగా సోమరాజు పెన్మెత్స వ్యవహరిస్తున్నారు. ఆర్.ఆర్. ధృవన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా సిద్ధార్థ్ ఎస్.జె, ఎడిటర్ గా పీకే, కళా దర్శకుడిగా గాంధీ నడికుడికర్, కాస్ట్యూమ్ డిజైనర్‌గా శిల్పా టంగుటూరు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా రాజీవ్ కుమార్ రామా వ్యవహరిస్తున్నారు.దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 16న ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల చేయనున్నట్లు తాజాగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.ఈ చిత్రానికి సంగీతం: ఆర్.ఆర్. ధృవన్, ఛాయాగ్రహణం: సిద్ధార్థ్ ఎస్.జె, కూర్పు: పీకే, కళా దర్శకుడు: గాంధీ నడికుడికర్, కాస్ట్యూమ్ డిజైనర్: శిల్పా టంగుటూరు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజీవ్ కుమార్ రామా.



# దేశంలో ఎమర్జెన్సీ కంటే ప్రమాదకరమైన పరిస్థితులు

### సిపిఐ (ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో నాటి ఎమర్జెన్సీ రోజుల కంటే అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో పెరుగుతున్న ఫాసిస్టు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని పిలుపునిచ్చారు. సిపిఐ (ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఈ సభకు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సభాధ్యక్షత వహించగా ప్రధాన వక్తగా, పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, వక్తలుగా సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, వామపక్ష పార్టీల నాయకులు పోటు రంగారావు(సిపిఐ ఎం.ఎల్ (ప్రజాపంథ )),చలపతిరావు( సిపిఐ(ఎం.ఎల్.) న్యూడెమోక్రసి),ఎం.రమేష్ రాజా(సిపిఐ(ఎం.ఎల్.) లిబరేషన్), జానకిరాములు (ఆర్ఎస్‌పి), సి.హెచ్ మురహరి(ఎస్‌యుసిఐ(యు), ఉపేందర్ రెడ్డి (ఎంసిపిఐ) తదితరు లు హాజరయ్యారు. సభలో ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి పలువురు నివాళ్లు అర్పించారు. అనంతరం సీతారాం ఏచూరితో పాటు, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, అచ్యుతానంద మరణం పట్ల సభ కొద్ది సేపు మౌనం పాటించింది. అనంతరం బి.వి.రాఘవులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య, లౌకికవాద,రాజ్యాంగ పరిరక్షణకు సోషలిజాన్నిముందుకు తీసుకెళ్లేందుకు ఐక్యంగా ఉద్యమించడమే సీతారం ఏచూరికి నిజమైన నివాళి అని అన్నారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ చరిత్రను వక్రీకరిస్తోందని మండిపడ్డారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేసి న వ్యక్తి సీతారం ఏచూరి అని అన్నారు. మతాలు, కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, స్త్రీ ,పురుషల మధ్య అసమానతలను సృష్టిస్తున్నారని విమర్శించారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ సెక్యూలరిజం, సోషలిజం సారంశంతోనే భారతదేశ స్వాతంత్ర్య పోరాటం జరిగిందని, అందుకే ఆ అంశాలను రాజ్యాంగంలో పొందుపర్చారని గుర్తు చేశారు. బిజెపి సిద్ధాంతానికి ప్రత్యామ్నాయమే కమ్యూనిస్టుల సిద్ధాంతం అని అన్నారు.
పోటురంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులను తమ శత్రువులుగా ఎంచుకున్నద ని విమర్శించారు. చలపతిరా వు మాట్లాడుతూ ఏకత్వంలో భిన్నత్వం భావజాలాన్ని చూసేదే బిజెపి అని అన్నారు. ఉ పేందర్ రెడ్డి, రమేష్‌రాజా, జానికిరాములు మాట్లాడుతూ మతోన్మాద శక్తులు పెరుగుతున్న క్రమంలో వామపక్ష ఐక్య ఉద్యమాలు అవసరం ఎంతైనా ఉన్నదని తెలిపారు.






### రాజీకయ, సాహిత్యం, సంగీతంపైన ఏచూరికి పట్టు

సయ్యద్ అజీజ్ పాషా

రాజకీయ రంగంతో పాటు సాహిత్యం, సంగీ తం పట్ల సీతారాం ఏచూరికి మంచి పట్టు ఉన్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా అన్నారు. సీతారాం ఏచూరితో కలిసి తా ను ఆరేళ్ల పాటు పార్లమెంట్‌లో ఉన్నానని, ఈ సందర్భంగా అనేక అంశాలను ఏచూరి ప్రస్తావించే వారన్నారు. ఉర్దూ సాహిత్యంలో ఏచూ రి ఒక మాస్టర్ లాంటివారన్నారు. 2011 సంవత్సరంలో జరిగిన వివిధ దేశాల నుంచి 124 ప్రతినిధులు హాజరైన ఇంటర్‌నేషనల్ క మ్యూనిస్టు కాన్ఫరెన్స్‌లో 'ఇంటర్‌నేషనల్ క మ్యూనిస్టు మూవ్‌మెంట్‌లో సభ్యుని'గా ఏచూరి పలు నిర్మాణాత్మకమైన అంశాలను సూచించారని వివరించారు. ఈ సమావేశాల సమయంలో తాను పరిశీలకునిగా హాజరయ్యానని గుర్తు చేసుకున్నారు. అనేక సందర్భాల్లో ఏచూరిని తాను చాలా దగ్గరగా చూశానని అజీజ్ పాషా అన్నారు.

## 'ఓటు చోరీ'యే ప్రధాన సమస్య

(మొదటి పేజీ తరువాయి)

'ఓటు చోర్' (ఓటు దొంగ) నినాదం చేస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం విమానాశ్రయంలో దిగిన తర్వాత జునాగఢ్ చేరుకున్న రాహుల్ గాంధీని మోదీ మణిపూర్ పర్యటనపై విలేకరులు ప్రశ్నించగా...'మణిపూర్ చాలాకాలంగా ఇబ్బందుల్లో ఉంది. ప్రధాన మంత్రి ఇప్పుడు అక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే అది పెద్ద విషయం కాదు. భారతదేశంలో నేటి ప్రధాన సమస్య 'ఓటు చోరీ' (ఓటు దొంగతనం) అని నొక్కి చెప్పారు. కాగా, మోదీ సెప్టెంబరు 13న మణిపూర్‌ను సందర్శించి, చురచంద్‌పూర్, రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లోని అంతర్గతంగా నిర్వాసితులైన ప్రజలతో సంభాషిస్తారు. రెండేళ్ల క్రితం రాష్ట్రంలో జాతి హింస చెలరేగిన తర్వాత మణిపూర్‌లో ప్రధాని పర్యటన ఇదే తొలిసారి. రాహుల్ మాట్లాడుతూ 'వారు హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలను దొంగిలించారు. ఇటీవల కర్నాటకలో మేము దానిని నిరూపించాము. అందువల్ల ప్రధాన సమస్య ఓటు దొంగతనం. ప్రతిచోటా ప్రజలు 'ఓటు చోర్' (ఓటు దొంగ) నినాదాన్ని లేవనెత్తుతున్నారు' అని రాయ్‌బరేలికి చెందిన లోక్‌సభ ఎంపీ అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో కాంగ్రెస్ 'సంఘతన్ సజన్ అభియాన్' (సంస్థను బలోపేతం చేయడానికి ప్రచారం) లో భాగంగా సెప్టెంబరు 10 నుంచి 19 వరకు జునాగఢ్‌లో స్థానిక పార్టీ నాయకులకు శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని బుధవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రారంభించారు. 'రాహుల్ గాంధీ జిల్లా, నగర విభాగ అధ్యక్షుల ను ఉద్దేశించి ప్రసంగిస్తారు. పార్టీ సీనియర్ నాయకులతో సంభాషిస్తారు. ఢిల్లీ కి బయలుదేరే ముందు ఆయన దాదాపు మూడు గంటల పాటు ఈ కార్యక్రమంలో ఉంటారు' అని కాంగ్రెస్ గుజరాత్ అధికార ప్రతినిధి మనీశ్ దోషి తెలిపారు.

## రుతుపవనాల తిరోగమనం

(మొదటి పేజీ తరువాయి)

ఐఎండి తెలిపింది. వాయువ్య దిశగా రాజస్థాన్ నుంచి తిరుగుముఖం పడతాయని పేర్కొంది. ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా దేశంలోకి ప్రవేశించాయి. ఈ సంవత్సరం రుతుపవనాలు మే 24న కేరళలో ప్రవేశించాయి. 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం ఇదే మొదటిసారి. 2009లో రుతుపవనాలు మే 23న ప్రవేశించాయి. జులై 8 సాధారణ తేదీకి తొమ్మిది రోజుల ముందే దేశ వ్యాప్తంగా విస్తరించాయి. ఈసారి నైరుతి రుతుపవన కాలంలో దేశంలో 836.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం 772.5 మి.మీ. కంటే ఎనిమిది శాతం ఎక్కువ. జూన్ నంచి సెప్టెంబర్ కాలంలో 87 సెంటీమీటర్ల, దీర్ఘకాల సగటు వర్షపాతం కంటే 106 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. 50 సంవత్సరాల సగటు వర్షపాతం 96 నుంచి 104 శాతం మధ్య నమోదైతే దానిని 'సాధారణం'గా పరిగణిస్తారు.

## బాంబు బెదిరింపు

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని సూచించారు. అయితే, పేలుడు పదార్థాలు ఎక్కడెక్కడ పెట్టారన్నది అందులో పేర్కొనలేదు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అక్కడికి చేరుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా కోర్టులోని న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బందిని బయటకు పంపించారు. అనంతరం తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదే విధంగా ఈ ఘటనను మరువక ముందే మధ్యాహ్నం బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. అధికారులు అప్రమత్తమయ్యారు. లాయర్లను, కేసుల విచారణ కోసం వచ్చిన ప్రజలను, కోర్టు సిబ్బందిని వెంటనే ఖాళీ చేయించారు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు చేపట్టారు. ఎలాంటి బాంబు లేదని తనీఖీల్లో తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## ప్రధానిగా సుశీల కర్కి

(మొదటి పేజీ తరువాయి)

కర్కి.. ఆ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగానూ అరుదైన ఘనత సాధించారు. నేపాల్ రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. కొద్దిమంది మంత్రులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఆమె.. ఆ వెంటనే కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అయితే ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని అధ్యక్షుడు పౌడెల్ పేర్కొన్నారు. అంతకు ముందు దేశంలో నెలకొన్న సంక్షోభం వేళ ప్రధాన రాజకీయ పార్టీలు, జన్ జెడ్ ఉద్యమకారులతో ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్, దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పలు దఫాల్లో చర్చలు జరిపారు. న్యాయనిపుణులు, సామాజిక వేత్తలు, ఇతర భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపిన పౌడెల్.. చివరకు తాత్కాలిక ప్రధానిగా కర్కిని ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. సుశీలా కర్కి (72).. జూన్ 7, 1952లో విరాట్ నగర్‌లో జన్మించారు. తొలుత ఉపాధ్యాయురాలిగా కెరీర్ ప్రారంభించి.. ఆ తర్వాత న్యాయవ్యవస్థలో అడుగుపెట్టారు. నిర్భయంగా, సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ అవినీతి మచ్చలేని వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారు. 2009లో సుప్రీంకోర్టులో అడుగుపెట్టి.. శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.2016లో నేపాల్ సుప్రీంకోర్టులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత రాజ్యాంగ మండలి సిఫార్సు మేరకు చీఫ్ జస్టిస్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టి.. నేపాల్ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు సృష్టించారు. తాజా ఉద్యమంలోనూ ఆమె కీలక పాత్ర పోషించారు. ఖాట్మండులో పార్లమెంట్ భవనంపై నిరసనకారులు 'జెన్ జెడ్' పేరుతో సోమవారం చేపట్టిన ఆందోళన సమయంలో పోలీసులు కాల్పులు జరపడంతో కనీసం 19 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు. ఈ నెల 8వ తేదీ సోమవారం జరిగిన హత్యాకాండపై తన రాజీనామా కోరుతూ వందలాది మంది నిరసనకారులు తన కార్యాలయంలోకి చొరబడిన తర్వాత ప్రధాని కె.పి శర్మ ఓలి మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. అదే రాత్రి సోషల్ మీడియా నిషేధాన్ని ఎత్తివేశారు. అయితే, ఓలి రాజీనామా చేసిన తర్వాత కూడా హింస కొనసాగింది.

## సి.పి.రాధాకృష్ణన్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

అయిన రాధాకృష్ణన్ ప్రతిపక్ష ఉమ్మడి అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆరోగ్య సమస్యల కారణంగా జులై 21న ఉపరాష్ట్రపతిగా ఉన్న జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యం అయ్యింది. కాగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన తర్వాత ఆయన తొలిసారి ఈ ప్రమాణ స్వీకారోత్సర కార్యక్రమంలో పాల్గొన్నారు. జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఇంతకుముందున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పక్కన కూర్చొని ఆయనతో మాట్లాడుతుండటం కనిపించింది. మరో మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ కూడా వెంకయ్యనాయుడు పక్కనే కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి ధన్‌ఖడ్ సతీమణి సుదేష్ ధన్‌ఖడ్ కూడా హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోం మంత్రి అమిత్ షా, బిజెపి అధ్యక్షుడు జెపి.నడ్డా ముందువరుసలో ఆశీనులయ్యారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. 2027 ఆగష్టు 10నాటికి జగ్‌దీప్ ధన్‌ఖడ్ పదవీకాలం ఉన్నది. రాజ్యాంగం ప్రకారం ప్రస్తుతం ఉపరాష్ట్రపతిగా వారు మరణం వల్ల గానీ, రాజీనామా చేయడం వల్ల గానీ పదవిలోకి ప్రవేశించే ప్రస్తుత ఉపరాష్ట్రపతి పూర్తిగా ఐదేళ్ల పదవీకాలం ఉపరాష్ట్రపతి పదవి బాధ్యతలు నిర్వర్తిస్తారు. నూతన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ 2030 సెప్టెంబరు 11వరకూ ఉపరాష్ట్రపతి పదవిలో ఉంటారు. గౌరవనీయ ఉపరాష్ట్రపతి పదవిని కైవసం చేసుకున్న వారిలో రాధాకృష్ణన్ 3వ నాయకుడు. 'పచ్చై తమిళన్'(నిజమైన నీలి తమిళ్)గా అభివర్ణించబడిన రాధాకృష్ణన్ బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ తరపున ఉపరాష్ట్రపతి నామినీగా ప్రకటించబడిన సమయంలో మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలు అందిస్తున్నారు. తాను రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవికి ఎన్నికవడాన్ని 'జాతీయవాద భావజాల విజయం'గా మంగళవారం రాధాకృష్ణన్ అభివర్ణించారు. ఆయన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో 450ఓట్లు సాధించగా, ప్రతిపక్ష అభ్యర్థి అయిన బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు లభించాయి.

### రాజ్యసభ చైర్మన్‌గా రాధాకృష్ణన్ బాధ్యతల స్వీకరణ...

నూతన ఉపరాష్ట్రపతిగా శుక్రవారం ప్రమాణం చేసిన సి.పి.రాధాకృష్ణన్ రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ప్రముఖ సంఘ సంస్కర్తలు, ప్రముఖ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు రాధాకృష్ణన్ పుష్ప గుచ్ఛాలతో నివాళులు అర్పించారు. అక్కడ ఆయనకు రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్ హరివంశ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు, పార్లమెంట్ వ్యవహారాల సహాయమంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్‌లు స్వాగతం పలికారు. రాజ్యసభ సెక్రటరీ జనరల్ పి.సి.మోదీ కూడా హాజరయ్యారు.రాజ్యసభ మంత్రులు, రాజ్యసభ అధికారులు పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ వద్ద హాజరుకాగా, వారందరి సమక్షంలో రాధాకృష్ణన్ అక్కడ ఒక మొక్కను నాటారు.అనంతర ం ఆయన రాజ్యసభ చైర్‌పర్సన్ కార్యాలయానికి వెళ్లి ఎగువసభ ప్రిసైడింగ్ అధికారిగా బాధ్యతలు స్వీకరించి కొన్ని అధికారిక డాక్యుమెంట్లపై సంతకాలు చేశారు. ఉపరాష్ట్రపతి రాజ్యసభకు ఎక్స్‌అఫిషియో చైర్‌గా ఉన్నప్పటికీ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఒక నోటిఫికేషన్‌లో రాధాకృష్ణ సెప్టెంబరు 12న ఉపాధ్యక్ష పదవిలోకి ప్రవేశించినట్లు ప్రకటించారు. దీనికి ముందు రాధాకృష్ణన్ రాజ్‌ఘాట్ వద్ద మహాత్మాగాంధీ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. సదైవ్ అటల్ స్మారకం వద్ద మాజీ ప్రధాన మంత్రి అటల్‌బిహారీ వాజ్‌పేయికి, కిసాన్‌ఘాట్ వద్ద మాజీ ప్రధానమంత్రి చరణ్ సింగ్‌కు కూడా నివాళులు అర్పించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com